అనుదినం... జనస్వరం

సమగ్ర తెలుగు దినపత్రిక

నవతెలంగాణ

శుక్రవారం 08-12-2023
సంపుటి : 9 సంచిక : 287
12 పేజీలు వెల : 6.50
Published from Rangareddy, Khammam, Hyderabad, Karimnagar
www.navatelangana.com



కొలువుదీరిన కొత్తసర్కార్



సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం

- డిప్యూటీగా భట్టి విక్రమార్క • 11 మందికి క్యాబినెట్ బెర్తులు
- ఆరు గార్యంటీలపై తొలి సంతకం • వికలాంగురాలు కుమ్మరి రజినికి నియామక పత్రం
- ప్రగతిభవన్ ఇక నుంచి జ్యోతిరావు పూలే ప్రజాభవన్ • నేటి నుంచి ప్రజాదర్బార్
- పాలకులం కాదు... సేవకులమంటూ రేవంత్ వ్యాఖ్య

తెలంగాణ ఏర్పడిన పదేండ్ల తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ నేతృత్వంలో కొత్త సర్కార్ కొలువుదీరింది. ఆ ప్రభుత్వానికి ఎనుముల రేవంత్‌రెడ్డి సారధిగా ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం కాంగ్రెస్ అతిరథ మహారథులు మల్లికార్జున ఖర్గే, సోనియ గాంధీ, రాహుల్, ప్రియాంక తదితరుల సమక్షంలో అంగరంగవైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ రేవంత్‌తో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతోపాటు మల్లు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా, మరో పది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిందనీ, ప్రతి ఒక్కరి ఆకాంక్షలను నెరవేరుస్తామని ఈ సందర్భంగా రేవంత్ హామీనిచ్చారు.

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'మీ బిడ్డగా చెబుతున్నా...ఇందిరమ్మ రాజ్యంలో మేము పాలకులం కాదు...మీ సేవలం... అంటూ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రజలు అవకాశమివ్వడాన్ని తాను గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసిఫాబాద్ నుంచి అలంపూర్ వరకు, ఖమ్మం నుంచి కొడంగల్ వరకు సమానాభివృద్ధి కోసం, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం, సామాజిక న్యాయాన్ని సాధించాలనే లక్ష్యంతో సోనియాగాంధీ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు.

గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనతో ముఖ్యమంత్రిగా, డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క, మంత్రులుగా ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎంపీలు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

వేలాది జనం ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మహత్తర ప్రయత్నం ...11లో



సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక హాజరు

- కర్నాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కూడా...

ఘనంగా, ఉత్సహంగా, అట్టహాసంగా నిర్వహించిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీలతోపాటు పలువురు అగ్రనేతలు హాజరయ్యారు. హిమచల్‌ప్రదేశ్, కర్నాటక ముఖ్యమంత్రులు సుఖేందర్‌సింగ్, సిద్ద రామయ్య, కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్,వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, మంత్రులు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ.రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు హాజరయ్యారు. రేవంత్ దంపతులను సోనియాగాంధీ ఆశీర్వదించారు. రేవంత్ ప్రమాణస్వీకారం అనంతరం పలువురు నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు.



9 నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు కూడా

- సోనియా జన్మదిన కానుకగా రెండు గ్యారంటీల అమలు
- రేపు ప్రత్యేకంగా సమావేశం కానున్న అసెంబ్లీ
- ప్రొటెం స్పీకర్ ఎన్నిక అనంతరం సభ్యుల ప్రమాణం : క్యాబినెట్ వివరాలను వెల్లడించిన మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"సోనియా గాంధీ జన్మదినమైన శనివారం (9వ తేది) రాష్ట్ర శాసనసభ సమావేశాన్ని ప్రారంభిస్తున్నాం. అదే రోజు నుంచి మేమిచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటి అమలుకు శ్రీకారం చుడతాం..... ప్రజలు మాపై నమ్మకంతో అధికారాన్ని కట్ట బెట్టారు... వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని హామీలను దశల వారీగా అమలు చేస్తాం" అని రాష్ట్ర మంత్రి ...3లో

ప్రగతిభవన్ కంచెలు తొలగింపు

నవతెలంగాణ-బంజారాహిల్స్

తాను సీఎం అయితే ప్రగతిభవన్ కంచెలు బద్దలు కొడతాను.. సామాన్యులకు ప్రవేశం కల్పిస్తానంటూ రేవంత్ రెడ్డి పలుసార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన చెప్పినట్టుగానే గురువారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తుండగానే అందుకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్ ఎదుట ఉన్న కంచెలను అధికారులు తొలగించారు. కంచెలను తొలగించటానికి పెద్దఎత్తున కార్మికులు వచ్చి పనులు మొదలుపెట్టారు. గేట్లను గ్యాస్ కట్టర్లు, జేసీబీలతో తొలగించారు. గ్యాస్ కట్టర్లతో ఇనుప గ్రిల్స్‌ను తొలగించారు. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడి పరిస్థితిని సమీక్షిస్తూ.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. తొలగించిన కంచెలను ట్రాక్టర్లలో తరలించారు.



స్వాధీనాలపై మార్గదర్శకాలేవీ?

- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- మరో వారం గడువు ఇవ్వండి : అత్యున్నత న్యాయస్థానాన్ని కోరిన కేంద్రం



న్యూఢిల్లీ : మీడియా సిబ్బంది, వ్యక్తుల నుంచి ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకునే విషయంలో మార్గదర్శకాలు రూపొందించేందుకు కాలయాపన ఎందుకు చేస్తున్నారని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాగా, దీనిపై మరో వారం రోజుల గడువు కావాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. మార్గదర్శకాల రూపకల్పన వారం రోజులలో పూర్తవుతుందని తెలిపింది. ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకునేటప్పుడు పాటించాల్సిన మార్గదర్శకాలను రూపొందించాలని కోరుతూ ఫౌండేషన్ ఫర్ మీడియా ప్రొఫెషనల్స్ సంస్థ 2021లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గడువు కావాలన్న కేంద్రం విజ్ఞాపనపై న్యాయమూర్తులు ...11లో

సెన్సార్‌షిప్ కోసం బ్లూప్రింట్

బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ బిల్లుపై విశ్లేషకులు

- నిబంధనలు, పదాలపై స్పష్టత ఇవ్వాలి
- ఈ బిల్లు ప్రభుత్వానికి అధికారాలు కట్టబెడుతుంది
- ఇది జర్నలిజానికి ప్రమాదమని హెచ్చరిక



న్యూఢిల్లీ : మోడీ పాలనలో జర్నలిజం స్వేచ్ఛకు సంకెళ్లు పడుతున్నాయి. పలు సందర్భాల్లో ఇది నిరూపితమైంది. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో సెన్సార్‌షిప్ కోసం చార్టర్‌గా, సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ (ఎంఐబీ) రూపొందించిన బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లు, 2023 (ప్రసార బిల్లు) ప్రస్తుతం చర్చకు దారి తీస్తున్నది. నవంబర్ 11న ప్రజాభిప్రాయం కోసం దీనిని విడుదల చేశారు. శుక్రవారం వరకు దీనిపై అభిప్రాయాలు తెలపొచ్చు. ఇది ఒకవేళ అమలులోకి వస్తే భవిష్యత్తులో ఏ ప్రభుత్వమైనా దీనిని తొలగించాలనుకోవటం కష్టమని నిపుణులు అంటున్నారు.

అయితే, దీని ద్వారా ఎవరిని నియంత్రించాలని కోరుతున్నారు? అని వారు కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇండిపెండెంట్ జర్నలిజాన్ని సెన్సార్‌షిప్ పరిధిలోకి తీసుకురావాలని మోడీ సర్కారు యోచిస్తున్నదని వారు అంటున్నారు. ప్రజాస్వామ్య దేశంలో నాలుగో స్తంభమైన జర్నలిజానికి ఇది ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. కంటెంట్, షోలు, సీరియల్‌లు, డాక్యుమెంటరీలతో వార్తలను (స్వతంత్ర వార్తల వెబ్‌సైట్‌లు, వార్తలు, వీక్షణల కోసం ప్రముఖ పాయింట్‌లుగా ఇప్పుడు స్థాపించబడిన వ్యక్తులు, వివరణకర్త వీడియోలు, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఇతర ఆడియో-విజువల్ మెటీరియల్) కలపటం అనేది డ్రాఫ్ట్‌లో అత్యంత దారుణమైన తీరని నిపుణులు ...11లో

పార్లమెంటులో తెలంగాణ సెంట్రల్ గిరిజన వర్సిటీ బిల్లు

- అన్ని పార్టీల మద్దతు • మూజువాణి ఓటుతో ఆమోదం
- వరంగల్ జిల్లా ములుగులో యూనివర్సిటీ
- విద్యార్థుల డ్రాపౌట్స్‌కు కుటుంబ పరిమితులే కారణం : కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- విద్యతో రాజకీయాలు చేయొద్దు : కేంద్రానికి ప్రతిపక్షాల హితవు

వివరాలు 11లో

పక్షం రోజుల్లోనే పార్టీలకు వెయ్యి కోట్ల విరాళం !


న్యూఢిల్లీ : నవంబరులో ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆ నెల 6-20 తేదీల మధ్య పక్షం రోజుల వ్యవధిలో వివిధ రాజకీయ పార్టీలకు రూ.1,006 కోట్ల మేర విరాళాలు అందాయి. ఆయా రాష్ట్రాలలో గతంలో జరిగిన ...11లో

ప్రతిరోజూ 42 మంది ఆత్మహత్య

గంటకు ఇద్దరు చొప్పున సూసైడ్

బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో దారుణాలు...ఎన్సీఆర్బీ





బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో ఆత్మహత్యలు ఆగడంలేదు. ప్రతిరోజూ 42 మంది తమ ప్రాణాలను బలిపెట్టుకుంటున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) తెలిపింది. గంటకు ఇద్దరు చొప్పున సూసైడ్ చేసుకుంటున్నారు. ఎన్సీఆర్బీ 2022 డేటా ప్రకారం దేశవ్యాప్తంగా జరిగిన 1,70,924 ఆత్మహత్యల్లో మధ్యప్రదేశ్‌లోనే 15,386 ఆత్మహత్యలు జరిగాయి. జాతీయ సగటు రోజుకు 468 మంది ఆత్మహత్యలు చేసుకుంటే, మధ్యప్రదేశ్‌లో మాత్రం ప్రతిరోజూ 42 మంది, దాదాపు గంటకు ఇద్దరు తమ జీవితాలను అర్థంతరంగా ముగింపుపలుకుతున్నారు.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మరో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఉన్న మహారాష్ట్రలో 22,746 ఆత్మహత్యలు (మొత్తం లెక్కలో 13.3 శాతం), తమిళనాడులో 19,834 (11.6 శాతం), మధ్యప్రదేశ్‌లో (9 శాతం), 15,386 మంది, కర్నాటకలో 13,606 (8 శాతం), పశ్చిమ బెంగాల్‌లో 12,669 (7.4 శాతం) ఉన్నాయని ఎన్సీఆర్బీ డేటా వెల్లడించింది. మొత్తం ఆత్మహత్యల్లో ఈ రాష్ట్రాలు 49.3 శాతం ఉండగా, మిగిలినవి మిగిలిన 23 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలలో ఉన్నాయి.

దేశంలో తమ జీవితాలను ముగించుకున్న 38,259 మంది పురుషులు, 20,828 మంది మహిళలతో కూడిన 59,087 మంది 18-30 ఏండ్ల మధ్య ఉన్నారని, 31.7 శాతం మంది కుటుంబ సమస్యల కారణంగా, 18.4 శాతం మంది అనారోగ్యం కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపింది.

గతేడాది మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 746 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. భోపాల్‌లో 527 మంది, గ్వాలియర్‌లో 307 మంది, జబల్‌పూర్‌లో 213 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు.కుటుంబ సమస్యల కారణంగానే 31.7 శాతం ఆత్మహత్యలు జరిగాయని భోపాల్ పోలీస్ కమిషనర్ హెచ్‌సి మిశ్రా తెలిపారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలహీనపడటం, భావోద్వేగ బంధం, కమ్యూనికేషన్ లేకపోవడం దీనికి ప్రధాన కారణమని అన్నారు. యువకులు, ముఖ్యంగా విద్యార్థులు సరైన కౌన్సిలింగ్ లేకపోవడంతో పాటు సమాజంలో కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల తమ జీవితాలను ముగించుకుంటున్నారని గతంలో ఇండోర్ కమిషనర్‌గా, జబల్‌పూర్, గ్వాలియర్ ఎస్పిగా పనిచేసిన మిశ్రా అన్నారు.

తెలంగాణకు 2,50,084 ఇండ్ల మంజూరు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణకు పీఎంఎవై-యు కింద నవంబర్ 20 వరకు 2,50,084 ఇండ్లు మంజూరు కాగా, 2,44,219 ఇండ్ల నిర్మాణం ప్రారంభమైందని, అందులో 2,24,339 ఇండ్లు పూర్తి అయ్యాయని కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌశల్ కిశోర్ తెలిపారు. 1,23,933 ఇండ్లు ప్రజలకు ఇచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే ఇండ్ల నిర్మాణానికి రూ.4,475.66 కోట్లు మంజూరు కాగా, రూ.3,314.27 కోట్లు విడుదల అయ్యాయని, అందులో రూ.3,170.89 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఇంకా తెలంగాణకు రూ.1,161,39 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ (పీఎంఎవై-యు) కింద 12,67,689 ఇండ్లు ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నను కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2015 జూన్ 25న ప్రారంభమైన పీఎంఎవై-యు కింద నవంబర్ 20 వరకు ఏపీకి 21,32,432 ఇండ్లు మంజూరు కాగా, అందులో 20,07,436 ఇండ్ల నిర్మాణం ప్రారంభం అయిందని, 1,24,996 ఇండ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. ఇండ్ల నిర్మాణం ప్రారంభమైన వాటిలో 8,64,743 ఇండ్లు పూర్తి అయ్యాయని, అందులో 7,30,435 ఇండ్లు ప్రజలకు అందాయని పేర్కొన్నారు. ఇండ్లు నిర్మాణం కోసం రూ.32,499.33 కోట్లు మంజూరు కాగా, అందులో రూ.21,839.49 కోట్లు విడుదల చేసింది. రూ.19,767.25 కోట్లు ఖర్చు అయిందని తెలిపారు. అయితే ఇంకా ఆంధ్రప్రదేశ్‌కు రూ.10,659.84 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పీఎంఎవై-యు కింద 118.63 లక్షల ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 78.15 లక్షల ఇండ్లు మాత్రమే పూర్తి అయ్యాయి. ఇంకా 40.48 లక్షల ఇండ్లు పూర్తి కాలేదు. అలాగే రూ.2 లక్షల కోట్లు మంజూరు కాగా, రూ.1.54లక్షల కోట్లు మాత్రమే విడుదల అయింది. అందులో రూ.1.45 లక్షల కోట్లు ఖర్చు అయింది. ఇంకా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ.46 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

పోలవరం నిర్వాసిత కుటుంబాలు లక్షకుపైనే...

అందులో 56,504 గిరిజన కుటుంబాలు

- ఒక్కో గిరిజన కుటుంబానికి రూ.6.86 లక్షలు
- 2013 భూసేకరణ చట్టం ప్రకారమే పరిహారం, పునరావాసం
- కేంద్ర జలశక్తి సహాయ మంత్రి భిశ్వేశ్వర తుడ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు (పీఐపీ) నిర్మాణం కారణంగా 1,06,006 కుటుంబాలు నిర్వాసితులయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్టు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి భిశ్వేశ్వర తుడ తెలిపారు. లోక్‌సభలో టీడీపీ ఎంపీ కె.రామ్మోహన్ నాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మొత్తం 1,06,006 పోలవరం నిర్వాసిత కుటుంబాలు ఉండగా, అందులో 56,504 కుటుంబాలు షెడ్యూల్డ్ తెగలకు చెందినవి అని తెలిపారు. అల్లూరి సీతా రామరాజు జిల్లాలో 43,689 ఎస్టీ కుటుంబాలు ఉండగా, ఏలూరు జిల్లాలో 12,815 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2005 ఏప్రిల్ 8 నాటి ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం 2013 డిసెంబర్ వరకు ఈ కుటుంబాలకు పునరావాసం, పరిహారం (ఆర్ అండ్ ఆర్) అందించామని, ఆ తరువాత న్యాయమైన పరిహారం, పునరావాసం, పారదర్శకత భూసేకరణ హక్కు చట్టం 2013 ప్రకారం ఇచ్చామని తెలిపారు. 2013 చట్టం ప్రకారం సగటున ఒక్కో గిరిజన నిర్వాసిత కుటుంబానికి రూ.6.86 లక్షలు, ప్రాజెక్టు కోసం తమ భూమిని కోల్పోయే గిరిజన నిర్వాసిత కుటుంబాలకు ఇందిరా ఆవాస్ యోజన ప్రకారం ఇండ్లతో పాటు సేకరించిన భూమికి సమానమైన భూమి, లేదా రూ.2.5 ఎకరాల భూమి (ఇందులో ఏది తక్కువైతే అది) అందజేస్తున్నట్టు తెలిపారు. గిరిజన కుటుంబాలు తమ జాతి, భాషా, సాంస్కృతిక గుర్తింపును నిలుపుకునేలా చూడడానికి గిరిజన నిర్వాసిత కుటుంబాలకు వీలైనంత వరకు గిరిజన ప్రాంతాల్లోనే పునరావాసం ఇస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు (పీఐపీ) జాతీయ ప్రాజెక్ట్‌గా ప్రకటించామని, 2016 సెప్టెంబర్ 30న ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల ప్రకారం, 2014 ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వం నీటిపారుదల ఖర్చులతో సహా 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, పునరావాసం భాగం కూడా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోందని అన్నారు. అయితే, పరిహారం, పునరావాసంతో సహా ప్రాజెక్ట్ అమలును కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వమే చేస్తుందని తెలిపారు.

బెంగళూరులో వాటర్స్ కార్పొరేషన్ కొత్త సెంటర్ ఏర్పాటు

బెంగళూరు : సాఫ్ట్‌వేర్, అనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్లోబల్ కంపెనీ వాటర్స్ కార్పొరేషన్ బెంగళూరులో కొత్త కేంద్రాన్ని ప్రారంభించినట్టు ప్రకటించింది. ఇక్కడ దాదాపు రూ.130 కోట్లు (16 మిలియన్ డాలర్ల) పెట్టుబడితో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని ఏర్పాటు చేశామని ఆ సంస్థ ప్రెసిడెంట్, సిఇఒ ఉదిత్ బత్ర వెల్లడించారు. వినూత్న కల్పనలు, గ్లోబల్ కస్టమర్ సక్సెస్‌లో భారత్ వేగంగా పెరుగుతుందన్నారు. కొత్త సెంటర్ ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డిజిటైజేషన్, ఆపరేషనల్ ఎక్సలెన్సీ, ఉత్పత్తి, టెక్నాలజీలో రాణించడానికి నూతన పెట్టుబడులు దోహదం చేయనున్నాయన్నారు. కొత్త సెంటర్ ద్వారా కొత్తగా 300 ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 62,780	▲ 110
22 క్యారెట్లు	- 57,550	▲ 100
కిలో వెండి	- 80,000	▲ 1000



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 66
రిటైల్ (లైవ్)	రూ. 88
స్కిన్‌తో	రూ. 128
స్కిన్‌లెస్	రూ. 145

బిజినెస్

ఇక చిన్న రుణాలు పుట్టవు..!

- రూ.50వేల లోపు వ్యక్తిగత రుణాలకు దూరం
- ఫిన్‌టెక్ సంస్థలకు బ్యాంక్‌ల సూచన
- ఇప్పటికే పేటియం నిర్ణయం



న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ డిజిటల్ వేదికలపై పొందుతున్న చిన్న రుణాల జారీ ఇకపై కఠినతరం కానుంది. ముఖ్యంగా రూ.50,000 లోపు వ్యక్తిగత రుణాల జారీని పరిమితం చేయాలని బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి)లు తమ ఫిన్‌టెక్ భాగస్వామ్య సంస్థలను ఆదేశించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. ఇటీవల వ్యక్తిగత రుణాల జారీ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను కఠినతరం చేసిన విషయం తెలిసిందే. హామీలేని వ్యక్తిగత రుణాలకు రిస్క్ వెయిట్‌ను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. ఈ నేపథ్యంలోనే బ్యాంక్‌లు తమ ఫిన్‌టెక్ భాగస్వాములను అప్రమత్తం చేశాయి. వ్యక్తిగత రుణాల జారీ పెంచాల్సి వస్తే.. బ్యాంకులు మరింత మూలధనాన్ని కేటాయించాలని ఆర్‌బిఐ సూచించింది. ఎన్‌బిఎఫ్‌సిల ద్వారా అధిక రుణాలు జారీ చేయడం ద్వారా ప్రమాదాలకు దారి తీయవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్‌బిఐ స్పష్టమైన సంకేతాలతో తాము వ్యక్తిగత రుణాల జారీని తగ్గించుకోవాలని తమ ఫిన్‌టెక్ సంస్థలకు సూచనలు చేశామని ప్రయివేటు రంగంలోని ఓ టాప్ బ్యాంకర్ పేర్కొన్నారు. రూ.50,000 కంటే తక్కువ రుణ విభాగంలో ఉండకూడదని తమ ఫిన్‌టెక్ భాగస్వాములకు సూచించామన్నారు. ప్రస్తుత సమయంలో ఫిన్‌టెక్ భాగస్వాములకు నిధులను పూర్తిగా తగ్గించాలని అనుకోనప్పటికీ, చిన్న టిక్కెట్ల వ్యక్తిగత రుణాలపై పెద్దగా వెళ్లడం పట్ల తాము అసౌకర్యాన్ని వ్యక్తం చేశామని మరో బ్యాంకర్ పేర్కొన్నారు. చిన్న రుణాల జారీ పట్ల అప్రమత్తంగా ఉండాలని తమ ఫిన్‌టెక్ భాగస్వాములకూ సూచించామని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకర్ వెల్లడించారు. కొంతకాలం ఆ విభాగానికి దూరంగా ఉండటం మంచిదని భావించామన్నారు.

పేటియం షేర్లపై ఒత్తిడి..

న్యూఢిల్లీ : రూ.50,000 లోపు ఉండే వ్యక్తిగత రుణాల జారీని తగ్గించుకుంటామని పేటియం ప్రకటించింది. ఇకపై కేవలం పెద్ద రుణాలపైనే దృష్టి సారిస్తామని ఆ సంస్థ బుధవారం తెలిపింది. అదే విధంగా ఇప్పుడు కొనండి-తర్వాత చెల్లించండి వ్యాపారాన్ని పునర్‌వ్యవస్థీకరిస్తామని వెల్లడించింది. ఈ పరిణామం గురువారం పేటియం షేర్లను భారీగా నష్టపోయేలా చేసిందిజ ఇంట్రాడేలో 20 శాతం నష్టపోయి బిఎస్ఇలో రూ.650 కనిష్ట స్థాయికి దిగజారిన సూచీ.. తుదకు 18.69 శాతం నష్టంతో రూ.661.30 వద్ద ముగిసింది. పేటియం లిస్టింగ్ తర్వాత ఒకే పూటలో ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. వ్యక్తిగత రుణాల జారీని కఠినతరం చేస్తూ ఇటీవల ఆర్‌బిఐ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో పేటియం తన విధానాన్ని మార్చుకున్నట్లు స్పష్టమవుతోంది.

హ్యుందాయ్ కార్లు ప్రియం

న్యూఢిల్లీ : ప్రముఖ కార్ల తయారీదారు హ్యుందాయ్ మోటార్ ఇండియా తన వాహన ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ముడి సరుకుల ధరలు పెరగడం, ఫారెక్స్ కరెన్సీలో మార్పుల నేపథ్యంలో 2024 జనవరి 1తేది నుంచి కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయని పేర్కొంది. అయితే ఎంత మొత్తంలో పెంచేది ఆ సంస్థ వెల్లడించలేదు.

నేడు ఆర్‌బిఐ సమీక్షా నిర్ణయాల వెల్లడి



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా నిర్ణయాలను శుక్రవారం వెల్లడించనుంది. గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన బుధవారం ప్రారంభమైన ఈ భేటీ నేటితో ముగియనుంది. కాగా.. గత ఫిబ్రవరిలో చివరి సారిగా వడ్డీ రేట్లను పెంచింది. అప్పటి నుంచి కీలక వడ్డీ రేట్లను కదిలించలేదు. తాజా భేటీలోనూ యథాతథంగా ఉంచే అవకాశాలు ఉన్నాయని ప్రముఖ గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ డచెస్ బ్యాంక్ పేర్కొంది. గత ఫిబ్రవరిలో చివరి సారిగా ఆర్‌బిఐ వడ్డీరేట్లు పెంచడంతో రెపోరేట్ ఆల్ టైం గరిష్ట స్థాయి 6.5 శాతానికి చేరుకుంది. 2025 నాటికి రెపోరేట్ 5.50 శాతానికి దిగి వస్తుందని భావిస్తున్నామని డచెస్ బ్యాంక్ అంచనా వేసింది.

ఫోన్‌పే షేర్.మార్కెట్ వేదికలో డిస్కవర్ విభాగం

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్‌పేకు చెందిన షేర్.మార్కెట్ వేదికలో కొత్తగా 'డిస్కవర్' విభాగాన్ని ప్రారంభించినట్లు ఆ సంస్థ వెల్లడించింది. దీని అత్యాధునిక ఇంటెలిజెన్స్ లేయర్ ద్వారా ఇన్వెస్టర్లకు మెరుగైన పెట్టుబడి అనుభవాన్ని సులభతరం చేస్తుందని పేర్కొంది. ఈ జోడింపు ద్వారా పరిశోధన ఆధారిత ఉత్పత్తులు, అనుభవాలను తీసుకురావడంతో పాటుగా డిస్కౌంట్ బ్రోకింగ్‌ను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇది తమ పెట్టుబడిదారుల విభిన్న అవసరాలను తీర్చడానికి రూపొందించబడిందని షేర్.మార్కెట్ సిఇఒ ఉజ్జల్ జైన్ తెలిపారు.



పెరిగిన ప్లేట్ భోజనం ఖరీదు

- పండుగ వేళ కూరగాయలు ప్రియం

న్యూఢిల్లీ : పండుగ సీజన్‌లో కూరగాయల ధరలు పెరగడంతో నవంబర్‌లో ప్లేట్ భోజనం వ్యయం పెరిగిందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ పేర్కొంది. ఖరీఫ్ సీజన్‌లో అస్థిర వర్షపాత పరిస్థితుల మధ్య తక్కువ ఉత్పత్తి కారణంగా ఇంట్లో వండిన శాఖాహారం, మాంసాహార థాలీ (ప్లేట్)ల ధర భారీగా పెరిగిందని తెలిపింది. సెప్టెంబర్ ధరలతో పోల్చితే గడిచిన నవంబర్‌లో శాఖహార థాలీ ధర 10 శాతం పెరిగి రూ.30.3కి చేరగా, మాంసహార థాలీ ధర నెలవారీగా 5 శాతం పెరిగి రూ.61.2గా నమోదయ్యిందని వెల్లడించింది. ఏడాదికేడాదితో పోల్చితే శాఖహార ధరల్లో 9 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ముఖ్యంగా ఉల్లిపాయలు, టొమాటో ధరలు వరుసగా 93 శాతం, 15 శాతం ఎగిశాయి. పప్పుల ధరలు కూడా ఏడాది ప్రాతిపదికన 21 శాతం పెరిగాయి. కాగా... ఏడాదికేడాదితో పోల్చితే మాంసహార థాలీ ధర పెరగలేదని క్రిసిల్ పేర్కొంది. వెజ్ థాలీలో రోటీ, కూరగాయలు, అన్నం, పప్పు, పెరుగు మరియు సలాడ్ ఉంటాయి. నాన్-వెజ్ థాలీలో వెజ్ థాలీకి సమానమైన ఉత్పత్తులతో పాటు పప్పు స్థానంలో బ్రాయిలర్ చికెన్‌ను పరిగణలోకి తీసుకుంటుంది.

సీఎం సహా 12 మందితో కొత్త క్యాబినెట్

మరో ఆరుగురికి అవకాశం • కీలక శాఖలు సీఎం దగ్గరే.. అమాత్యుల పుట్టుపుర్వోత్తరాలివే..

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మరో 12 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మొత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా 18 మందికి అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం సీఎంతో సహా 12 మందే ప్రమాణం చేశారు. ఈ క్యాబినెట్‌లో ఇంకా ఆరుగురికి అవకాశముంది. శాఖల కేటాయింపుకు సంబంధించి ఎలాంటి అధికారిక ఉత్తర్వులను సర్కారు ఇంకా ఇవ్వలేదు.

క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ మంత్రులకు శాఖలు కేటాయించారా అని విలేకర్లు ప్రశ్నించగా, అందుకు ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని సీఎంను అడగాలని చెప్పారు. మేము కూడా మీడియాలో చూసి ఆశ్చర్యపోయామని అన్నారు. దీన్ని బట్టి అధికారికంగా మంత్రులకు శాఖల కేటాయింపు జరగలేదనేది స్పష్టమైంది. అయితే మీడియాలో మంత్రులకు శాఖలు ఇచ్చినట్టుగా ప్రచారం జరిగింది.ఆ వివరాలు కిందివిధంగా ఉంది.

- మల్లు భట్టి విక్రమార్క- డిప్యూటీ సీఎం, రెవెన్యూ శాఖ
- ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి-హోంశాఖ
- దామోదర రాజనర్సింహా- వైద్య ఆరోగ్య శాఖ
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి-మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ
- తుమ్మల నాగేశ్వరరావు-రోడ్లు, భవనాల శాఖ
- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి-సాగునీటి పారుదల శాఖ
- దుద్దిళ్ల శ్రీధర్‌బాబు-ఆర్థిక శాఖ
- దనసరి అనుసూయ సీతక్క-గిరిజన సంక్షేమ శాఖ
- జూపల్లి కష్టారావు-పౌరసరఫరాల శాఖ
- పొన్నం ప్రభాకం గౌడ్-బీసీ సంక్షేమశాఖ
- కొండా సురేఖ- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ



మల్లు భట్టి విక్రమార్క(ఖమ్మం జిల్లా మధిర)



భట్టి బీఏ పూర్తి చేశారు. 2007 నుంచి 2009 వరకు ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే 2009, 2014, 2019, 2023 ఎన్నికల్లో వరుసగా శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ విప్, డిప్యూటీ స్పీకర్, టీపీసీసీ వర్కిగ్ ప్రెసిడెంట్, సీఎల్పీ నేతగా వ్యవహరించారు. కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక నాయకునిగా ఎదిగారు. శాసనసభకు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి వస్తారని ఆపార్టీ శ్రేణుల్లో మంచిపేరుంది.

ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్)



భారత వైమానిక దళంలో పైలట్‌గా పనిచేశారు. బీఎస్సీలో డిగ్రీ చేశారు. 1994లో రాజకీయాల్లోకి వచ్చారు. 1999, 2004, 2009, 2014, 2018, 2023 సంవత్సరాల్లో శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2009లో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. ఆయన్ను కాంగ్రెస్‌లో సౌమ్యుడిగా పేర్కొంటారు. టీపీసీసీ కార్యనిర్వా హక అధ్యక్షుడిగా, 2004లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా, 2015లో పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే సీడబ్ల్యూసీ సభ్యుడిగా కూడా వ్యవహరించారు. దేశంలోని ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలకు స్క్రీనింగ్ కమిటీ సభ్యుడిగా కూడా ఉన్నారు.

దామోదర రాజనర్సింహ(మెదక్ జిల్లా ఆందోల్)



1989లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1999, 2004, 2009, 2023 అసెంబ్లీలో ఎన్నికల్లో విజయం సాధించి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఉన్నారు. వైఎస్సార్ క్యాబినెట్‌లో ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలోనూ ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో ఓడిపోయారు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి(నల్లగొండ జిల్లా నల్లగొండ నియోజకవర్గం)



ఇంజినీరింగ్ చదివారు. 1999, 2004, 2009, 2014 కాలంలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. గతంలో ఐటీ, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రిగా, పెట్టుబడులు, మౌళిక వసతుల కల్పన మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్ శిష్యుడిగా పేరు.

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు(పెద్దపల్లి జిల్లా మంథని)



ఎంఎ, ఎల్‌ఎల్‌బీ చదివారు. 1999లో రాజకీయ అరంగేట్రం జరిగింది. 1999, 2004, 2009, 2018, 2023 ఎన్నికల్లో గెలుపొందారు. పౌరసరఫరాలు, శాసనసభ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా పనిచేసిన డి.శ్రీపాదరావు కుమారుడే శ్రీధర్‌బాబు.

పొంగులేటి శ్రీనివాసరెడ్డి(ఖమ్మం జిల్లా పాలేరు)



2013లో వైఎస్సార్ కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, ఎల్‌ఎల్‌బీ చదివారు. 2014లో వైసీపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడిగా, అదే ఏడాదిలో ఖమ్మం నుంచి ఎంపిగా గెలిచారు. 2016లో బీఆర్‌ఎస్‌లో చేశారు. మళ్లీ తాజాగా ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచారు.

పొన్నం ప్రభాకర్‌గౌడ్ (కరీంనగర్ జిల్లా హుస్నాబాద్)



కరీంనగర్ నుంచి 2009-14 కాలానికిగాను లోక్‌సభ సభ్యునిగా విజయంసాధించి సేవలు అందించారు. ఎంఏ, ఎల్‌ఎల్‌బీ చదువుకున్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేది.. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ చైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

కొండా సురేఖ(వరంగల్ జిల్లా వరంగల్ తూర్పు నియోజకవర్గం)



1995లో మండల పరిషత్ అధ్యక్షురాలిగా పనిచేశారు. బీకాం చదివారు. 1999, 2004, 2009, 2023లో శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. గతంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. 2014లో బీఆర్‌ఎస్‌లో చేరి, 2018లో మళ్లీ కాంగ్రెస్‌కు తిరిగొచ్చారు.

దనసరి అనసూయ సీతక్క (మహబూబాబాద్ జిల్లా ములుగు)



1996 వరకు మావోయిస్టుగా అడవి జీవితం గడిపిన సీతక్క, పీహెచ్‌డీ చేసి ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. 2004లో టీడీపీ ద్వారా రాజకీయల్లోకి వచ్చి, 2009, 2019, 2023లలో వరుసగా కాలానికి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. కరోనా కాలంలో నియోజకవర్గంలో విస్తృతసేవలు అందించారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా, రాహుల్, ప్రియాంకకు దగ్గరయ్యారు. అలాగే రేవంత్‌రెడ్డి అనుచరురాలిగా ముద్రపడింది.

తుమ్మల నాగేశ్వరరావు(ఖమ్మం జిల్లా ఖమ్మం నియోజకవర్గం)



1978లో రాజకీయ అరంగేట్రం చేశారు. డిగ్రీ చదివారు. 1985, 1994, 1999, 2014, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. 2018లో ఓటమి పాలయ్యారు. ఇప్పటివరకు భారీ నీటిపారుదల, రోడ్లు, భవనాలు, మహిళా శిశు, అబ్కారీ శాఖ మంత్రిగా పనిచేశారు.

2014లో బీఆర్‌ఎస్‌లో చేరారు, 2015లో ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో కీలకనేతగా ఉన్నారు. ఆయన మంత్రివర్గంలోనూ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికలకు రెండునెలల ముందే జూపల్లి కృష్ణారావుతోపాటు కాంగ్రెస్‌లో చేరారు.

జూపల్లి కృష్ణారావు(నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్)



2004, 2009, 2012, 2014 సంవత్సరాలకుగాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆహార,పౌరసరఫరాల శాఖ, దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2011లో బీఆర్‌ఎస్‌లో చేరి కేసీఆర్ మంత్రివర్గంలో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా ఎన్నికలకు రెండునెలల ముందే కాంగ్రెస్‌లో చేరారు.

రజనీకి కాంట్రాక్టు ఉద్యోగం
ఉత్తర్వులు జారీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వికలాంగురాలైన తుమ్మరి రజనీకి ఉద్యోగం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌కు చెందిన రజనీ ఎన్నికలకు ముందు గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిని కలిసి తనకు ఎవరూ ఉద్యోగం ఇవ్వడం లేదని గోడు వెళ్లబోసుకున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలి ఉద్యోగం ఇస్తానని రేవంత్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రజనీకి ఉద్యోగం కల్పించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. తుమరి రజనీకి తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (టీఎస్-ఎస్ఒసీఏ)లో ప్రాజెక్ట్ మేనేజర్‌గా కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించినట్టు తెలిపారు. ఆమెకు నెలకు రూ.50 వేల పారితోషకాన్ని చెల్లించనున్నారు.

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి షాపింగ్ మాల్‌కు నోటీసులు

- టీఎస్‌ఆర్టీసీకి రూ.7 కోట్ల అద్దె బకాయిలు
- రూ.2.5 కోట్ల విద్యుత్ బకాయిలు
- కరెంట్ సరఫరా నిలిపివేత



నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డికి చెందిన జీవన్‌రెడ్డి మాల్‌కు గురువారం ఆర్టీసీ, విద్యుత్ అధికారులు నోటీసులు జారీచేశారు. అద్దె బకాయిలు చెల్లించాలని ఆర్టీసీ అధికారులు, విద్యుత్ బకాయిలు చెల్లించాలని విద్యుత్‌శాఖ అధికారులు నోటీసులిచ్చి.. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న వారిని ఖాళీ చేయాలని అనౌన్స్ చేయడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బస్టాండ్ పక్కనున్న ఆర్టీసీ స్థలాన్ని 33 ఏండ్లకు లీజ్‌కు తీసుకుని జీవన్‌రెడ్డి మాల్ నిర్మించిన విషయం విధితమే. అయితే లీజ్‌కు సంబంధించి రూ. 7 కోట్లు అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో హైదరాబాద్ ఆర్టీసీ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం మాల్‌కు వచ్చి నోటీసులు ఇచ్చారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపారస్తులు ఖాళీ చేయాలంటూ అధికారులు అనౌన్స్‌మెంట్ చేయడంతో అక్కడున్న వారు అయోమయానికి గురయ్యారు. అంతేకాకుండా, కాంప్లెక్‌కు రూ.2.5 కోట్ల విద్యుత్ బకాయిలు ఉండటంతో కరెంటు సరఫరా నిలిపి వేసినట్లు డివిజనల్ విద్యుత్ కార్యాలయం ఏడీఈ శ్రీధర్ తెలిపారు.

ఉచిత ప్రయాణంపై మహిళల్లో ఆసక్తి

- సాధ్యాసాధ్యాలపై ఆర్టీసీ అధ్యయనం
- బస్సుల్లో ఏనోట విన్నా ఇదే చర్చ
- అమలుపై అనేక ఊహాగానాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళల్లో అసక్తికర చర్చ జరుగుతోంది. డిసెంబర్ 9 నుంచే మహిళలంతా బస్సుల్లో టికెట్ లేకుండా ఉచితంగా ప్రయాణం చేయొచ్చంటూ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విధితమే. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దాంతో ఆరు పథకాల అమలు పట్ల ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం గురించి మహిళలు చర్చించుకుంటున్నారు. నిత్యం బస్సుల్లో ప్రయాణించే వాళ్లల్లో ఎక్కువ మంది ఉచిత ప్రయాణం గురించే ముచ్చటిస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం అన్న హామీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ టీమ్‌తో అధ్యయనం చేయిస్తున్నట్టు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతోంది. ఆ రాష్ట్రాల అనుభవాలను బట్టి ఇక్కడ అమలు చేస్తారంటున్నారు. 7నే సీఎం ప్రమాణస్వీకారం జరగడంతో తేదీ మారే అవకాశాలు ఉండొచ్చని చర్చ నడుస్తోంది.

ఉచిత ప్రయాణంపై అధ్యయనం

పంజాబ్, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటకలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతోంది. తమిళనాడులో నగరాలు, పట్టణాల్లోనే బస్సుల్లో ఉచిత ప్రయాణం కొనసాగుతోంది. కర్నాటకలో రాష్ట్ర మంతటా ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా సింధు పోర్టల్ అందుబాటులోకి తెచ్చి స్మార్ట్‌కార్డులను జారీచేస్తోంది. ఇలా రోజు కర్నాటకలో 18 నుంచి 19లక్షల మంది మహిళలు బస్సుల్లో ఉచిత సేవలను వినియోగించుకుంటున్నారు. ఇక, రాష్ట్రంలో ఏ పద్ధతి అనుసరిస్తారనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణం అమలు చేసే అవకాశముందంటున్నారు. మహిళల్ని ఆకర్షించిన పథకాల్లో బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా ప్రధానమైనదిగా ఉంది. రవాణా ఛార్జీల భారాలు తగ్గుతాయనే ఆశతో కాంగ్రెస్‌కు ఓట్లేశామంటూ పలువురు మహిళలు చెబుతున్నారు. ఇప్పటికే ఏడాదికి ఎంత భారం



సచివాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

పడుతుందనే ఆర్థిక విషయాలపై ఒక నివేదిక ఇచ్చినట్టు సమాచారం. రాష్ట్రమంతటా బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేస్తే ఏటా రూ.2200 కోట్ల మేరకు నష్టం వస్తుందని, అదే పల్లెవెలుగు బస్సుల్లోనే అమలు చేస్తే రూ.750 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారు.

మెదక్ రీజియన్‌లో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో పథకాన్ని అమలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రిపరేషన్ చేస్తున్నారు. మెదక్ రీజియన్‌లో 8 ఆర్టీసీ డిపోలున్నాయి. వీటి పరిధిలో 596 పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తున్నాయి. సిద్దిపేట డిపోలో 109 బస్సులు, దుబ్బాకలో 38, మెదక్‌లో 104, సంగారెడ్డి 94, నర్సాపూర్‌లో 28, జహీరాబాద్‌లో 93, నారాయణఖేడ్‌లో 60, గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ డిపోలో 70 బస్సులున్నాయి. రీజియన్ పరిధిలో 353 పల్లెవెలుగు బస్సులుండగా వీటిల్లో ఆర్టీసీవి 182, అద్దె బస్సులు 171 ఉన్నాయి. 243 ఎక్స్‌ప్రెస్ బస్సులుండగా వీటిల్లో 192 ఆర్టీసీ, 50 అద్దె బస్సులున్నాయి. మెదక్ రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లో ప్రతి రోజూ 2 లక్షలా 9 వేల కిలో మీటర్ల దూరం బస్సులు ప్రయాణిస్తున్నాయి. నిత్యం లక్షా 73 వేల మంది ప్రయాణికుల్ని వివిద గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. ప్రతి రోజూ సగటు ఆదాయం రూ.86.85 లక్షలుంది. రోజువారి ప్రయాణాల్ని పరిశీలిస్తే సీట్ల నిష్పత్తి 74 శాతంగా ఉంది. మండలాలాలకు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు నడుస్తున్నాయి. ఏపీ, కర్నాటక రాష్ట్రాలకు కూడా 84 బస్సుల్ని నడుపుతున్నారు. నిత్యం ప్రయాణికుల్లో మహిళలు 56 శాతంగా ఉంటున్నట్టు గుర్తించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇప్పటికీ పల్లెవెలుగు బస్సు మొఖం చూడని గ్రామాలు వందల్లో ఉన్నాయి. రోడ్డు మార్గమున్నా ప్రయాణికులు లేరనే నెపంతో బస్సులు నడపట్లేదు. మండల కేంద్రాల మీదుగా వెళ్లే పల్లెవెలుగు బస్సులు కేవలం ఆ రోడ్డు వెంట ఉన్న గ్రామాల్లోనే ఆగుతాయి. స్కూల్, కళాశాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఒకటి రెండు ట్రిపుల్లో నడుపుతున్న బస్సులు ప్రయాణికుల సమయానికి ఉపయోగపడని పరిస్థితి ఉంది. ఉచిత ప్రయాణం అమలు చేస్తే గ్రామాలకు బస్సులు నడపాలనే డిమాండ్ ముందుకు రానుంది.

రాష్ట్ర సరిహద్దు వరకే ఉచితం ?

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాల్ని ఏ విధంగా కల్పిస్తారనే విషయాలపై అనేక చర్చలు నడుస్తున్నాయి. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వర్తింపజేస్తారంటున్నారు. తెలంగాణకు చెందిన మహిళలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, ఇతర రాష్ట్రాల మహిళలకు వర్తించదని అంటున్నారు. రాష్ట్ర సరిహద్దు వరకే తెలంగాణ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందని, సరిహద్దు దాటగానే టికెట్ తీసుకోవాల్సి వస్తుందంటున్నారు. బీదర్ వెళ్లాల్సి వస్తే జహీరాబాద్ దాటగానే టికెట్ తీసుకోవాలి. అదే విధంగా తెలంగాణ మహిళలుగా గుర్తించేందుకు ఆధార్‌కార్డునే ఆధారంగా తీసుకునే అవకాశముంది. అయితే ఆధార్‌కార్డుల్లో ఇప్పటికీ చాలా మందికి ఉమ్మడి జిల్లాల పేర్లు, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ అనే ఉన్నది. ఉచిత ప్రయాణానికి ఆధార్‌కార్డును ఆధారంగా తీసుకుంటే తప్పనిసరిగా ఆధార్‌పై తెలంగాణ అని మార్పు చేసుకోవాల్సి వస్తది. కర్నాటకలో ఎదురవుతున్న ఇబ్బందులు కూడా ఇక్కడ తప్పవంటున్నారు. పురుషుల కోసం ప్రత్యేక బస్సులు పెడితే కుటుంబ సమేతంగా ప్రయాణం చేసే వాళ్లకు ఇబ్బందులు తప్పవంటున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకు అమలు : ప్రభులత, ఆర్‌ఎం, మెదక్ రీజియన్

ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు అమలు చేస్తాం. ఇప్పటి వరకు మాకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. ఏ పద్ధతిలో అమలు చేయాలనేది ప్రభుత్వం చెబుతుంది. ఆ మేరకు మెదక్ రీజియన్‌లో పథకాన్ని అమలు చేయాల్సి ఉంటది. ఊర్లల్లోని మహిళల పల్లె వెలుగు బస్సుల్ని అదనంగా నడపాల్సి వస్తది.

9నుంచే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



(మొదటి పేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం సాయంత్రం సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలను సహచర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు హామీలను శనివారం నుంచి అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ రెండు గ్యారంటీలపై ఆయా శాఖల అధికారులతో సీఎం చర్చించి అమలుపై కార్యచరణను సిద్ధం చేస్తారని తెలిపారు. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు ఏయే శాఖలో ఎన్ని నిధులు ఖర్చు పెట్టారు, వాటి ప్రయోజనాలు ప్రజలకు ఎంతవరకు చేరాయన్న సమాచారంతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయనున్నట్టు వివరించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించాలని అధికారులను ఆదేశించినట్టు వెల్లడించారు.

గత తొమ్మిదేండ్లుగా విద్యుత్‌కు సంబంధించి తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల సంస్థకు తీవ్ర నష్టం జరిగిందని, దానిపై శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులతో సీఎం సమీక్షించనున్నట్టు తెలిపారు. మహిళలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై కూడా క్యాబినెట్‌లో చర్చించినట్టు తెలిపారు. శనివారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో మొదట ప్రొటెం స్పీకర్ నియామకం, ఆ తర్వాత ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగం ఉంటుందని తెలిపారు. రైతుల పెట్టుబడి సాయంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు. గ్రూప్ వన్, గ్రూప్ టూ ఉగ్యోగాల భర్తీపై చర్చించామని, త్వరలో తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాబోయే ఐదేండ్లలో ప్రజలు కోరుకునే మార్పును చూపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మంత్రుల శాఖల కేటాయింపుపై విలేఖర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ అదంతా సీఎం చూసుకుంటారని దాట వేశారు.

రెక్కలున్న పక్షులాంటోళ్లు..పిల్లల్ని బంధించొద్దు

- వారిలోని సృజనాత్మకను ప్రోత్సహించండి
- సమాజ వికాసం కోరే విద్యా విధానం రావాలి: బాలోత్సవ్‌లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చిన్నపిల్లలు రెక్కలున్న పక్షులాంటోళ్లనీ, వారిని బంధించకుండా సృజనాత్మకను ప్రోత్సహిస్తే అద్భుతంగా ఎదుగుతారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో మూడో పిల్లల జాతరను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్, కవి శాంతారావు, బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సోమయ్య, నిర్వాహకులు సుజావతి, మమత, రూపారుక్మిణీ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు. ప్రారంభ సభలో దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ..మానవ జీవితంలో సంతోషంగా, స్వచ్ఛంగా ఉండేది బాల్యదశ మాత్రమేనన్నారు. బాల్యానికి తగిన శిక్షణ, యవ్వనానికి తగిన దిశానిర్దేశం, వద్దాప్యానికి రక్షణ ఇచ్చే సమాజమే ఉన్నతమైనదని చెప్పారు. బాలోత్సవంలో పిల్లల ఆనందాన్ని చూస్తుంటే తన బాల్యస్మృతులు గుర్తుకు వస్తున్నాయన్నారు. పిల్లలు సెలవుల కోసం ఎదురుచూడకుండా బడి ఉంటే బాగుండు అనే పరిస్థితి వచ్చినప్పుడే మెరుగైన విద్యా వ్యవస్థ ఉన్నట్టన్నారు. నేటి విద్యావ్యవస్థ ఎలా ఉంది? పిల్లలకు చదువెలా చెబుతున్నాం? అనే దాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ర్యాంకులు..విజయాల చుట్టే చదువులను తిప్పడం సరిగాదన్నారు. పిల్లల్లో చలనం, చైతన్యం ఎక్కువ అనీ, వారికి వీలైనంత మేరకు స్వేచ్ఛనివ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. వారిలో సృజనాత్మకశక్తిని ప్రోత్సహించాలి తప్ప నిరుత్సాహపర్చొద్దని నొక్కి చెప్పారు. సీరియల్స్‌లో ఒక పాత్రకు జరిగే అన్యాయాన్ని చూసి అయ్యో అని బాధపడటం మానేసి స్కూల్ నుంచి పిల్లలు రాగానే వారి సాధకబాధకాలను పంచుకోవాలని తల్లిదండ్రులను కోరారు. తండ్రులు వ్యాపారాల్లో, తల్లులు సీరియల్స్‌లో మునిగి సరిగ్గా పట్టించుకోకపోతే పిల్లలు మానసిక రోగులుగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. మాతృభాష మన ఆలోచనలకు ప్రథమ సోపానం అన్నారు. ఇంగ్లీష్, ఇతర భాషలు నేర్చుకున్నా తెలుగును మాత్రం మరువొద్దన్నారు. సమాజ వికాసం దిశగా విద్యా విధానం ఉండాలని ఆకాంక్షించారు.



సంపాదకీయం

మధ్యప్రాచ్యంలో పరిస్థితి దిగజారుతోందా !

గత రెండు నెలల్లో అతిపెద్ద దాడి, మారణకాండకు దిగిన యూదు దురహంకారులు. గాజాలోని రెండవ పెద్ద పట్టణమైన ఖాన్ యూనిస్‌లో ఇజ్రాయిల్ మిలిటరీకి అడుగడుగునా ప్రతిఘటన. ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్ నౌకలపై ఎమెన్ సాయుధ శక్తుల దాడి, సంయమనం పాటించాలని అమెరికాను కోరిన సౌదీ అరేబియా. ఇప్పటికైనా మానవతా సంక్షోభాన్ని నివారించండని భద్రతా మండలిని తొలిసారిగా కోరిన ఐరాస ప్రధాన కార్యదర్శి. ఈ పరిణామాలన్నీ గాజాలో సాగుతున్న మారణ కాండ, దాని పర్యవసానాలు మధ్య ప్రాచ్యం మీద పడుతున్న తీరు, మొత్తం మీద దిగజారుతున్న పరిస్థితిని సూచిస్తున్నాయి. గాజాలోని 250 లక్ష్యాలపై మంగళవారం నాడు వైమానికదాడులు జరిగాయి. దీంతో మానవతాపూర్వక సాయానికి కూడా ఆటంకం కలిగింది. శరణార్థి శిబిరాల్లో ఖాళీలేకపోవటంతో రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో పాలస్తీనియన్లు ఉంటున్నారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం జనాన్ని ఖాళీ చేయించినపుడు మరోచోట వారికి తగినన్ని ఏర్పాట్లు చేయాలని గాజాలో ఎక్కడా అలాంటి ఆనవాళ్లు లేవని ఐరాస బాలల నిధి ప్రతినిధి జేమ్స్‌ఎల్డర్ చెప్పటం మానవతా పూర్వక సాయం అందిస్తున్నట్లు పశ్చిమ దేశాలు చేస్తున్న ప్రచారం బండారాన్ని వెల్లడించింది. ఇరవై మూడులక్షల మంది పౌరుల్లో 19 లక్షల మంది నెలవులు తప్పారు, పది లక్షల మంది ఐరాస శిబిరాల్లో పేర్లు నమోదు చేసుకున్నారు.

> ఎమెన్ పౌరులు,అరబ్బు. ఇస్లామిక్ దేశాల్లో స్వేచ్చను కోరుకొనే జనాల ఆకాంక్షల మేరకు పాలస్తీనియన్లకు మద్దతుగానే తాము దాడులు చేస్తున్నట్లు ఎమెన్‌లో అధికారాన్ని చేజిక్కించుకున్న శక్తులు ప్రకటించాయి. దాడులను విరమించే వరకు కొనసాగిస్తామని కూడా స్పష్టం చేశాయి. వారు ప్రయోగిస్తున్న క్షిపణులు సౌదీ గగనతలం నుంచే వెళుతున్నందున అమెరికా ప్రతిదాడులకు పూనుకుంటే మధ్యలో సౌదీ ఇరుక్కుపోయే అవకాశం ఉంది. అందువలన వివాదం మరింత ముదరకుండా చూసుకొనేందుకే సంయమనం పాటించాలని కోరిందన్నది స్పష్టం.

భవిష్యత్‌లో తమ మీద దాడులు జరగకుండా గాజా ప్రాంతాన్ని మిలిటరీ రహితంగా ఉంచాలన్న ఇజ్రాయిల్ ప్రతిపాదనను అమెరికా కూడా వ్యతిరేకించింది. అది పాలస్తీనా ప్రాంతంగా ఉండాల్సిందేనని పేర్కొన్నది. గాజా ఎలా ఉండాలన్నది అక్కడి పౌరులు నిర్ణయించాలని టర్కీ పేర్కొన్నది. ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమైనప్పటి నుంచి ఎమెన్‌లోని హౌతీ సాయుధశక్తులు అడపాతడపా ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్, దానికి మద్దతు ఇస్తున్న అమెరికా,



ఇతర పశ్చిమ దేశాల వాణిజ్య నౌకల మీద దాడులు చేస్తున్నాయి. లక్షల మంది సాయుధులతో పాటు దాని దగ్గర నౌకా దళం నుంచి ప్రయోగించే ఖండాంతర క్షిపణులు, సాయుధ డ్రోన్లు కూడా ఉన్నాయి. ఇజ్రాయిల్ దాడులను ఆపివేయించేందుకు అమెరికా మీద ఒత్తిడి తేవటమే ఈ దాడుల లక్ష్యం. ఇప్పటివరకు అమెరికా పాటించిన సంయమనాన్ని ముందు కూడా కొనసాగించాలని తాజాగా సౌదీ అరేబియా కోరింది. ఈ దాడుల వెనుక ఇరాన్ హస్తం ఉందని అమెరికా ఆరోపిస్తూ కవ్విస్తున్నది. ఇటీవలి కాలంలో ఇరాన్‌తో సయోధ్య కుదుర్చుకున్న సౌదీ నేతలు ఇజ్రాయిల్ దాడులను ఆటవిక చర్యలంటూ ఖండిస్తున్న సంగతి తెలిసిందే. అంతకు ముందే అమెరికా కుట్రలో భాగంగా ఇదే సౌదీ తొమ్మిదిన్నరేండ్లపాటు హౌతీ సాయుధులను అణిచేందుకు విఫలయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వారితో నేరుగా చర్చలు జరుపుతూ శాంతి క్రమం ముందుకు పోవాలని కోరుకుంటున్నది. ఎమెన్ పౌరులు, అరబ్బు. ఇస్లామిక్ దేశాల్లో స్వేచ్చను కోరుకొనే జనాల ఆకాంక్షల మేరకు పాలస్తీనియన్లకు మద్దతుగానే తాము దాడులు చేస్తున్నట్లు ఎమెన్‌లో అధికారాన్ని చేజిక్కించుకున్న శక్తులు ప్రకటించాయి. దాడులను విరమించే వరకు కొనసాగిస్తామని కూడా స్పష్టం చేశాయి. వారు ప్రయోగిస్తున్న క్షిపణులు సౌదీ గగనతలం నుంచే వెళుతున్నందున అమెరికా ప్రతిదాడులకు పూనుకుంటే మధ్యలో సౌదీ ఇరుక్కుపోయే అవకాశం ఉంది. అందు వలన వివాదం మరింత ముదరకుండా చూసుకొనేందుకే సంయమనం పాటించాలని కోరిందన్నది స్పష్టం. ఎర్ర సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలు తిష్టవేసి ఆ ప్రాంత దేశాల మీద బెదిరింపులకు దిగిన అంశం ఎరిగినదే.

గాజాలో ప్రస్తుతం ఉన్న తీవ్ర పరిస్థితి అంతర్జాతీయ శాంతి, భద్రతల నిర్వహణకు ముప్పు తెచ్చేదిగా ఉన్నందున వెంటనే భద్రతా మండలి జోక్యం చేసుకోవాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కోరటం గమనించాల్సిన అంశం. సాధారణంగా దేశాల నుంచి అలాంటి వినతులు వస్తాయి. ఐరాస నిబంధన 99 ప్రకారం ప్రధాన కార్యదర్శి కూడా కోరవచ్చు. గుటెరస్ పదవీకాలంలో ఈ నిబంధనను ఉపయోగించుకోవటం ఇదే ప్రథమం. అక్కడ పౌరులకు ఎలాంటి రక్షణ లేదని, ఇంత వరకు ఏ సంక్షోభంలోనూ లేని విధంగా రెండు నెలల కాలంలో గాజాలో 130 మంది ఐరాస సహాయక సిబ్బంది కూడా ఇజ్రాయిల్ దాడుల్లో మరణించారని భద్రతా మండలి అధ్యక్షుడికి రాసిన లేఖలో పేర్కొన్నాడు. గాజాలో పరిస్థితి విషమించటంతో పరిసర దేశాల పౌరుల్లో సహనం నశిస్తున్నది. ఎప్పుడేం జరుగుతుందో తెలియని స్థితి. ఇజ్రాయిల్ దుండగాల నిలిపివేతకు అమెరికా, ఇతర పశ్చిమ దేశాల మీద మరింత ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది.



గెలుపుకి మలుపుకి మధ్య

ఇక్కడ మాటల కోటలు నిర్మించి
రంగులద్దాల్సిన పని లేదు
భుజం భుజం తట్టి
చిరునవ్వుని వెలిగించాల్సిన
అవసరం అసలే లేదు
కొన్ని నిర్ణయాల తిరుగుబాటులో
గెలుపుకి మలుపుకి మధ్య
స్వీకారాలు ఆకారాన్ని దాల్చుతుంటాయి

ఇక్కడ వాదానికి ప్రతివాదానికి
ముడి వేయాల్సిన ఆత్రుత లేదు
వాగ్దానాల విసుర్లకు
అక్కడక్కడా ఎగిరెగిరి పడుతూ
ఏ కొమ్మకో తగులుకోవాల్సిన పనే లేదు
గెలుపు మలుపుల మధ్య
కొన్ని సర్దుబాట్లు వాకిలి తడుతుంటాయి

ఇక్కడ అలంకారాలకు ఆనవాళ్లకు
తలొంచాల్సిన కర్మ లేదు
లోపలి మర్మాల మరమ్మతులకు
చేయి తడుపుల చేతలకు
ఏ తీరుకో కట్టుబడాల్సిన అవసరం లేదు
గెలుపు మలుపుల నడుమన
కొన్ని చేయూతలు చేయందిస్తుంటాయి

ఇక్కడ ఏ కారణాలు పడగలిప్పి
బుస కొట్టనక్కర్లేదు
ఒకటికొకటి కలుపుకుపోతూ
మరొక మార్గంలో పరుగులు పెడుతూ
ఆయాసాన్ని ఆవేశాన్ని కలపాల్సిన పని లేదు
గెలుపనే మలుపు మధ్యన
కొన్ని సంకల్పాలు పింఛం విప్పుతుంటాయి

ఇక్కడ ఏ ఆర్భాటాలు
డప్పులు మోగిస్తూ ఆడాల్సిన పని లేదు
పాదాల గుర్తుల్ని గడప గడపలో వదిలేస్తూ
చంకలెగరేయాల్సిన అవసరమే లేదు
గెలుపుకి మలుపుకి మధ్యన
కొంత నిశ్శబ్దం నిర్మాణాలుగా విస్తరిస్తూ
ఆకాశాన్ని తాకుతుంటాయి

గెలుపనేది
ఓర్పుకు ఓదార్పుకు మధ్య వారధి లాంటిది
గెలుపనేది
మనిషికి మానవతకు నడుమ
చెరగని గురుతు లాంటిది

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

మెదడు గుడ్డిదయినప్పుడు కళ్లుండి లాభం లేదు!

ఖుద్ గలత్ హోకర్ ఖుద్ కొ నహీ..!
సాబిత్ కర్‌నా ఇతనా ముష్కిల్ నహీ హోతా
జిత్‌నా సహీ, హోకర్, ఖుద్‌కొ సహీ.., సాబిత్ కర్‌నా-



డాక్టర్ దేవరాజు మహారాజు

తప్పు చేసి, చేసిన పని సరైనదేనని నిరూపించుకోవడం ఏమంత కష్టమైన పనికాదు. సరైన పని చేసి, చేసింది సరైనదే అని నిరూపించుకోవడం. ఈ రోజుల్లో చాలా కష్టం! అని పై చరణాలకు అర్థం.

'ఇదీ భారత్! ఇండియా కాదు' అని అంటాడొకడు. తాజ్‌మహల్‌ను తేజోమహల్ అని అంటానంటాడొకడు. అసలు యహుదీ-అనే పదమే తప్పు -దాన్ని యాదవ అని అనాలని అంటాడు- ఇంకొకడు-ఇక భార్యను హత్య చేసి తత్వవేత్తగా మారిన వాడొకడు ఆస్ట్రేలియాను అస్త్రాలయా అని పిలవాలం టాడు. ఇంతమంది మేతావులు ఈ దేశంలో ఎందుకు పుట్టు కొచ్చారంటే - ఆరో తరగతిలో స్కూల్లో పేరు తీసేస్తే పోయి. లేని రైల్వే స్టేషన్లో చాయ్ అమ్ముకున్నానన్నవాడు యం.ఎ.డిగ్రీ కొనుక్కుని వచ్చి పరిపాలకుడైనందుకు! ఓ చోట తల్లిని, మరో చోట భార్యను విడివిడిగా వదిలేసి, నైతికత అనేది లేకుండా జాగ్రత్త పడి - శూద్రుడై ఉండి మనువాద పల్లకీ మోస్తున్నందుకు!! ప్రపంచ దేశాలు బలాదూరు తిరుగుతూ 'విశ్వగురువు' నయ్యాననే భ్రమలో బ్రతుకుతున్నందుకు!! దేశం ప్రమాదకర స్థితిలోకి దిగజారిపోయింది - మెదడు గుడ్డిదయినప్పుడు కళ్లుండి లాభం లేదని అంటున్నది ఇందుకే.

దేశం ఈ స్థితికి రావడానికి మూల కారణం ఆరెస్సెస్ సంస్థ. అది ఎలాంటిదో అది ఎన్నెన్ని ఘనకార్యాలు వెలగ బెట్టిందో చూడండి. 1925లో ఆరెస్సెస్ స్థాపన జరిగింది. 1930 మార్చిలో ఉప్పు సత్యాగ్రహం జరిగినప్పుడు. అందులో ఆరెస్సెస్ పాల్గొనదని తేల్చి చెప్పాడు హెడ్గేవార్! పైగా 1940 డిసెంబర్‌లో బ్రిటీష్ వారి 'ఇంపీరియల్ సివిల్ గార్డ్'లో చేరిన ఆరెస్సెస్, వారికి భజన చేసింది. 1942 ఆగష్టులో క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకున్న పుడు తాము అందులో పాల్గొనమని ఆరెస్సెస్ స్పష్టం చేసింది. 1947 ఆగష్టులో దేశానికి స్వాతంత్ర్యం లభించిన పుడు, మువ్వన్నెల త్రివర్ణ పతాకాన్ని తాము జాతీయ జెండాగా గౌరవించమని ఆరెస్సెస్ ప్రకటించింది. చాలా కాలం వారు దాన్ని ఎగురేయలేదు. అదీ వారి దేశభక్తి! 1948 జనవరిలో గాంధీని చంపిన వాడెవరూ? ఆరెస్సెస్ కార్యకర్త గాడ్సేనే కదా? ఇది బహిరంగ రహస్యమే కదా? 1948 ఫిబ్రవరిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న సంస్థగా గుర్తించబడి ఆరెస్సెస్, భారత ప్రభుత్వ నిషేధానికి గురైంది. 1949 నవంబర్‌లో మనుస్మృతిని తప్పించి - అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని ఒప్పుకోమని ఆరెస్సెస్ బహిరంగంగా ప్రకటించింది. 1951 ఫిబ్రవరిలో మహిళలకు సమాన హక్కులు ప్రసాదించే హిందూ కోడ్ బిల్‌ను ఆరెస్సెస్ వ్యతిరేకించి- దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టింది. ఇవన్నీ నిశితంగా పరిశీలిస్తే ఏమనిపిస్తుంది? మెదడు గుడ్డిదయినప్పుడు కళ్లుండి లాభం లేదని అనిపించడం లేదా?

> భార్య, భర్తకు కాళ్లు ఎందుకు నొక్కాలి? అనే విషయం మీద ఒక పైత్యేషు శర్మ ఇలా వివరణ ఇచ్చాడు - సంప్రదాయ బద్ధమైన ఆ వివరణ విని దైవభక్తులంతా ముచ్చట పడ్డారు. "పురుషులకు కాలి వేళ్ళ నుండి మోకాళ్ల వరకు ఉన్న భాగం శనిది. స్త్రీల చేతి వేళ్ళ కొసల నుండి అరచేయి వరకు ఉన్నభాగం శుక్రుడిది. భార్య, భర్త కాళ్లు పట్టడం ద్వారా శనిపై శుక్రుడి ప్రభావం పడి ఆ ఇంట ధన ప్రాప్తి కలుగుతుంది!" చాలా పకడ్బందీగా సమాధానం కూర్చుకున్నారు గానీ, శనినీ, శుక్రుణ్ణీ నమ్మేదెవరు? మెదడు గుడ్డిదయిన వాళ్లు తప్ప? అందుకే ఎవరో సరిగానే చెప్పారు. "పురుషులు పురుషులకోసం ఏర్పరచుకున్నవే ఈ మతాలన్నీ" అని!

ఇస్రో చంద్రుడి ఉపరితలాన్ని ఫొటోలు తీయగలుగుతుంది. కానీ 140 కోట్లకు పెరిగిన భారత దేశ జనాభాలో ఉన్న మూర్ఖుల మెదళ్లలోని మూర్ఖత్వాన్ని ఇంకా మనం ఫొటో తీయలేకపోతున్నాం. చంద్రయాన్-3 విజయవంతమైంది గనక, అక్కణ్ణించి దేవుణ్ణడిగి మాకు వర్షాలు ఎప్పుడు కురుస్తాయో అడిగి చెప్పాలని - బీహారుకు చెందిన ఒక వ్యక్తి RTI ఆక్ట్ కింద దరఖాస్తు చేసుకున్నాడు. సామాన్యుల్లో ఉంటే అర్థం చేసుకోవచ్చు - కానీ మూర్ఖత్వం ప్రముఖుల్లో ఉంటే దాన్ని ఏమనాలి? ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో ఒక DGP రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేశాడు. హిందూ పంచాంగాన్ని అనుసరించి విధులు నిర్వహించాలన్న ఆదేశాలతో పాటు రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంచాంగాలు పంపిణీ చేశాడు. పోలీసులు పంచాంగాలు చూసుకుంటారు సరే - మరి దొంగలు, నేరగాళ్లు పంచాంగాల ప్రకారం నేరాలు చేయరుకదా? మెదడు గుడ్డిదయినప్పుడు కళ్లుండి లాభం లేదు కదా? చంద్రయాన్-3 విజయవంతం కాగానే చంద్రుణ్ణి హిందూదేశ్‌గా ప్రకటించాలని చక్రపాణి అనే స్వామి ప్రకటించాడు. లోగడ చంద్రయాన్-2 కూలిపోయిన చోటుకు 'తిరంగా పాయింట్' అనీ చంద్రయాన్-3 ల్యాండర్ విజయవంతంగా దిగిన చోటుకి 'శివశక్తి' అని మోడీ ప్రభుత్వం పేర్లు పెట్టింది. తొలిసారి చంద్రుడి మీదికి మతాన్ని చేర్చగలిగామని చంకలు గుద్దుకుంది. అలా ఇష్టం వచ్చిన పేర్లు పెట్టడానికి వీలుండదు. దానికి అంతర్జాతీయ ప్లానిటరీ బాడీ విధించిన నియమాలు నిబంధనలూ కొన్ని ఉంటాయి. మూర్ఖత్వం వదులుకున్న వారికి మాత్రమే కదా విషయాలు అర్థమయ్యేదీ? చంద్రయాన్-3లో వెళ్ళిన యాత్రికులకు సెల్యూట్ చేస్తున్నానని ప్రకటించాడొక బీజేపీ మంత్రి. ఆస్ట్రనాట్స్ ఎవరూ వెళ్లలేదన్న విషయం కూడా ఆ మహాపురుషుడికి తెలియదన్నమాట!



కాంగ్రెస్ పాలనలో చైనా మన దేశపు 43,000 కి.మీ. భూమిని ఆక్రమించింది అని అన్నాడు బీజేపీ అధ్యక్షుడు జె.పి. నడ్డా. భూమి చుట్టు కొలతే 40,075 కి.మీ. అయితే, అంత కన్నా ఎక్కువ భారత భూభాగాన్ని చైనా ఎలా ఆక్రమించిందీ? మన దేశపు మొత్తం భూభాగం ఉన్నదే - 32,87,263 చ.కి.మీ.లు (SQUARE KM) నడ్డా 43 వేల చదరపు కిలో మీటర్లు అని అనాల్సింది. అంత తెలివే ఉంటే బీజేపీ పార్టీకి అధ్యక్షుడెట్లా అవుతాడూ? అని దేశ ప్రజలు నవ్వుకున్నారు. చుట్టు కొలత కిలో మీటర్లలో చెపుతాం. విస్తీర్ణం చదరపు కిలో మీటర్లలో చెపుతాం. బీజేపీ మేధావులు మెదళ్లుమూసుకుని, తమ కళ్లు తెరిచే ఉన్నాయని అనుకుంటారు. మహిళలు బట్టల్లేకపోయినా అందంగానే ఉంటారంటూ - పతంజలి బాబా రామ్‌దేవ్ వ్యాఖ్యానించాడు. మహారాష్ట్ర మాజీ సీఎం ఫడ్నవీస్ భార్య పైన కూడా కామెంట్ చేశాడు. ఆమెకు వందేళ్ళ వరకు ముసలితనం రాదని సర్టిఫికేట్ ఇచ్చాడు. మెదళ్లు మూసు కున్న పరిపాలకులకు ఆశ్రితులు మెదళ్లు లేని మూర్ఖులే ఉంటారు. పైగా వాళ్ళ మెల్లె కళ్ళతో చూసినా వాళ్ళేమీ చూడలేరు.

"ఒక దేశానికి ఇంకో దేశానికీ మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు తటస్థంగా ఉండడమో - ఏదో ఒక దేశానికి మద్దతివ్వడమో చేయవచ్చు. కానీ, ఒక దేశానికి ఒక ఉగ్రవాద సంస్థకి యుద్ధం జరుగుతున్నప్పుడు బుద్ధి ఉన్నోడెవడైనా ఉగ్రవాద సంస్థకి మద్దతిస్తాడా? మిమ్మల్ని, మీ కుటుంబాన్ని, మీ పార్టీని ఆరు దశాబ్దాలు భరించడం మా తప్పైపోయింది. ఇక మీదట ఆ అదృష్టం మాకొద్దులే నాయనా? అని ఒక తెలుగు సినీ గేయ రచయిత పరోక్షంగా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ఒక ప్రకటన చేశాడు. అతను జై శ్రీరామ్ అనలేదు గానీ, తానే ఆ శ్రీరామ్ అయినంతగా తన బత్తాయిరంగు ప్రదర్శించాడు. అయితే కాంగ్రెస్ పాలస్తీనా ప్రజలకు మద్దతిచ్చిన విషయం తెలుసుకోకుండా విమర్శించడం సరికాదని అనేక మంది బుద్ధి చెప్పారు. బుద్ధి ఉన్నోడెవడో లేనోడు ఎవడో అక్కడే అర్థమయింది. మిడిమిడి జ్ఞానంతో, వాట్సప్ యూనివర్సిటీ పట్టభద్రులు ఈ మధ్య ఇలాగే రెచ్చిపోతున్నారు. సినిమా పాటలు రాసినా, మరోవైపు సాహిత్య రంగంలో కూడా విశిష్టమైన కృషి చేసిన మహనీయులకే దొరకాల్సిన గౌరవం దొరుకుతుంది. అల్పుడెప్పుడు పల్కు ఆడంబరముగాను అంటూ తమ అల్పత్వాన్ని ప్రదర్శించుకుంటూ ఉంటారు. చంద్రయాన్-3ని కూడా కొందరు మోసగాళ్లు తమ స్వార్థానికి వాడుకుంటున్నారు. ఆ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి 'రైస్ పుల్లింగ్' కారణమనీ- అందుకు ఉపయోగించిన పాత్ర తమవద్ద ఉందంటూ కొందరు-ఓ హైదరాబాదు రియల్ ఎస్టేట్ వ్యాపారి నుంచి ఇరవై కోట్ల రూపాయలు కొట్టేశారు. అతను లబోదిబోమని మొత్తుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేసి, నలుగురు నిందితుల్ని పట్టుకున్నారు. అణ్వాయుధాల్లోను శాటిలైట్స్‌లోనూ ఉపయోగించే రాగి చెంబు తమ వద్ద ఉందంటూ వారు జనాన్ని మోసం చేస్తున్నారని పోలీసులు స్కామ్ బయట పెట్టారు. మోసగాళ్లు చెప్పారు సరే మరి - అంత ధనవంతుడైన ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారికి మెదడెందుకు పనిచేయలేదు? కనీసమైన ఇంగిత జ్ఞానం, లోకజ్ఞానం లేకుండా కూడా కోట్లు సంపాదించొచ్చా? మెదడు గుడ్డిదయితే అంతేనేమో!

భార్య భర్తకు కాళ్లు ఎందుకు నొక్కాలి? అనే విషయం మీద ఒక పైత్యేషు శర్మ ఇలా వివరణ ఇచ్చాడు - సంప్రదాయ బద్ధమైన ఆ వివరణ విని దైవభక్తులంతా ముచ్చట పడ్డారు. "పురుషులకు కాలి వేళ్ళ నుండి మోకాళ్ల వరకు ఉన్న భాగం శనిది. స్త్రీల చేతి వేళ్ళ కొసల నుండి అరచేయి వరకు ఉన్నభాగం

> చంద్రయాన్-3 విజయవంతం కాగానే చంద్రుణ్ణి 'హిందూదేశ్'గా ప్రకటించాలని చక్రపాణి అనే స్వామి ప్రకటించాడు. లోగడ చంద్రయాన్-2 కూలిపోయిన చోటుకు 'తిరంగా పాయింట్' అనీ చంద్రయాన్-3 ల్యాండర్ విజయవంతంగా దిగిన చోటుకి 'శివశక్తి' అని మోడీ ప్రభుత్వం పేర్లు పెట్టింది. తొలిసారి చంద్రుడి మీదికి మతాన్ని చేర్చగలిగామని చంకలు గుద్దుకుంది. అలా ఇష్టం వచ్చిన పేర్లు పెట్టడానికి వీలుండదు. దానికి అంతర్జాతీయ ప్లానిటరీ బాడీ విధించిన నియమాలు నిబంధనలూ కొన్ని ఉంటాయి. మూర్ఖత్వం వదులుకున్న వారికి మాత్రమే కదా విషయాలు అర్థమయ్యేదీ?

శుక్రుడిది. భార్య, భర్త కాళ్లు పట్టడం ద్వారా శనిపై శుక్రుడి ప్రభావం పడి ఆ ఇంట ధన ప్రాప్తి కలుగుతుంది!" చాలా పకడ్బందీగా సమాధానం కూర్చుకున్నారు గానీ, శనినీ, శుక్రుణ్ణీ నమ్మేదెవరు? మెదడు గుడ్డిదయిన వాళ్లు తప్ప? అందుకే ఎవరో సరిగానే చెప్పారు. "పురుషులు పురుషులకోసం ఏర్పరచుకున్నవే ఈ మతాలన్నీ" అని! ఈ మధ్య మహిళా ప్రవచనకారిణులు కూడా పెరిగిపోయ్యారు. అలాంటావిడ ఇలా చెప్పింది. భర్త, భార్యను 'ఒసేయ్' అని పిలవడంలో ఎంతో గౌరవముందట! ఒసేయ్-అంటే ఇంటి యజమానురాలా-అని అర్థమట. అలాగయితే ఆ వీధిలో పోయేవాళ్లంతా ఈ విషయం చెప్పినావిణ్ణి ఒసేయ్! అని పిలుచుకుంటూ పోతే సరి! ఆమెకు బోలెడంత గౌరవం దక్కుతుంది కదా?

మెదళ్లు గుడ్డివైపోయిన మతవిశ్వాసకుల మనస్తత్వాన్ని ఎత్తి చూపే సంఘటనలు ఎన్నో జరుగుతుంటాయి. అయితే, న్యూయార్క్ స్టేట్‌లో జరిగిన ఒక సంఘటన ఇలా ఉంది. 1820 లో ఉత్తర న్యూయార్క్ స్టేట్‌లోని ఒక సరస్సు పక్కన ఒక మత బోధకురాలు ఉండేది. ఆమెకు అసంఖ్యాకంగా అనుచర గణం ఉండేది. ఆమె మీద వారికి ఎంతో విశ్వాసం. ఒకసారి ఆమె నీటి మీద నడుస్తానని ప్రకటించింది. నడవబోయే రోజూ, సమయం కూడా ప్రకటించింది. అంతే! ఆరోజుకు, ఆ సమయానికి లెక్కలేనంతమంది ఆ సరస్సు చుట్టూ చేరారు. ప్రకటించిన సమయానికి ఆ మత ప్రచారకురాలు అక్కడికి వచ్చింది. అనుచరుల్ని సంతృప్తిగా చూసుకుంది. నవ్వుతూ నాలుగు వైపులా చెయ్యి ఊపింది. అనుచరగణం ఉత్సాహంగా కేకలేసింది. మత ప్రచారకురాలు అక్కడి జనాన్ని ఉద్దేశించి బిగ్గరగా ఇలా అడిగింది. "నేను ఈ సరస్సులోని నీటి మీద నడుస్తానని మీరు నమ్ముతున్నారా?" అని అంది. అనుచరులంతా ఏకకంఠంతో 'అవునూ అవునూ' అని అరిచారు. ఉత్సాహంగా చప్పట్లు చరిచారు. "అయితే సరే - మీకు ఆ నమ్మకం ఉండడమే ముఖ్యం! మీకు అంత నమ్మకం ఉన్నప్పుడు ఇక నేను నడవకపోయినా ఫరవాలేదు" అని మత ప్రచారకురాలు వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది! అనుచరులు కూడా నిరుత్సాహంగా వెళ్ళిపోయారు. ఈ సంఘటన వల్ల మనకేం తెలుస్తోంది? విశ్వాసాన్ని బలపరుచుకోవడానికే మత ప్రచారకులు ప్రాధాన్యమిస్తారు. తప్పించి, చెప్పింది చేసి చూపలేరు. ఇక నిజ నిర్ధారణకు నిలదీయనివారే మత విశ్వాసకులవుతారు! పైగా తమకు తాము భక్తులమని మురిసిపోతుంటారు. మెదడు గుడ్డిదయినప్పుడు...ఇక అంతే!!

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త
(మెల్బోర్న్ నుంచి)

ఏది సరైన ప్రత్యామ్నాయం?

> ఒక పాలక పార్టీకి మరొక పాలక పార్టీ ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాజాలదు. దీనికి తోడు మత విభజన ఆధారంగా మెజార్టీ ప్రజల అండతో అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ గోతికాడి నక్కలా ఎదురుచూస్తోంది. బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందో లేదో అన్నది తేలాలి. అధికారం పోయింది కాబట్టి ఆ పార్టీలో కూడా పక్కచూపులు చూసే అవకాశం లేకపోలేదు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో జరగాల్సిన అభివృద్ధిపై ప్రజల్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



గడ్డం రమేష్
9490098484

రాష్ట్రంలో శాసనసభకు జరిగిన ఎన్నికల ఫలితాలు ప్రకటించబడ్డాయి ఈ ఎన్నికలలో రాజకీయ పార్టీలు స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 2290 మంది 119 సీట్లకు పోటీపడ్డారు. ఇందులో 221 మంది మహిళలు ఒక ట్రాన్స్ జెండర్ కూడా ఉన్నారు. తెలంగాణలో ఓటు హక్కు ఉన్నవారు మూడు కోట్ల 17 లక్షలకు పైగా ఉన్నారు. వీరిలో 71. 38 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత శాసనసభ ఎన్నికలకు ఇప్పటి ఎన్నికలకు మధ్య సుమారు 36లక్షలకు పైగా కొత్త ఓటర్లు పెరిగారు. పోలైన ఓట్లలో 92 లక్షల 3533 39.40 శాతం ఓట్లు తెచ్చుకొని 64 అసెంబ్లీ సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అధికార పార్టీ అయిన బీఆర్ఎస్ 87లక్షల 32 వేల 992 ఓట్లు 37.39 శాతం ఓట్లు తెచ్చుకొని 39 స్థానాలకు పరిమితమైంది. గతంలో ఉన్న 49 శాసనసభ స్థానాలను కేవలం రెండు శాతం ఓట్ల తేడాతో అధికారాన్ని చేజార్చుకుంది. బీజేపీకి గతంలో 6.98 శాతం ఓట్లతో ఒక్క సీటు గెలిచింది. మధ్యంతర ఎన్నికల్లో మరొక రెండు సీట్లు తెచ్చుకుంది. ఈ ఎన్నికల్లో 13.9 శాతం 32 లక్షల 45 వేల తొమ్మిది వందల తొంబై ఆరు ఓట్లు తెచ్చుకొని మూడు సీట్ల నుండి ఎనిమిది సీట్లకు ఎగబాకింది. ఎన్నికలు జరిగిన తీరు చూస్తే మాత్రం రాష్ట్రంలో ముక్కోణపు పోటీ జరుగుతున్నట్టు బీజేపీ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. అదే కాకుండా అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించారు. కొసమెరుపు ఏమిటంటే అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కొత్తగా అధికారం చేపట్టబోతున్న కాంగ్రెస్‌కు మేమే ప్రత్యామ్నాయమన్న బీజేపీ ఎక్కువ స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయి చతికిలపడటం గమనార్హం.

డిపాజిట్లు గల్లంతైన పార్టీలు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 34(1)(ఏ) ప్రకారం పదివేల రూపాయలు ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు అయితే అందులో సగం డిపాజిట్ చెల్లించాలి. అప్పుడే పోటీచేసే అర్హత వస్తుంది. ఈ డిపాజిట్ నేటి ఎన్నికల్లో పెద్ద సమస్య కాకపోయినా డిపాజిట్ దక్కించు కోవడం అనేది పార్టీలకు, అభ్యర్థులకు పరువు సమస్యగా మారింది. నిన్న మొన్నటి వరకు పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కూడా ఏడు స్థానాలలో డిపాజిట్ కోల్పోయింది. ఈ ఏడు సీట్లు కూడా అత్యధికంగా సీట్లు గెలిచిన హైదరాబాద్‌లో ఉండటం గమనార్హం. అయితే బీఆర్ఎస్‌కు ఎంఐఎంకు మధ్యలో అవగాహన వలన అలా జరిగి ఉంటుందని ఊహాగానాలు కూడా లేకపోలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా 13 స్థానాల్లో డిపాజిట్ కోల్పోవడం పెద్ద ఎదురుదెబ్బగా చెప్పుకోవచ్చు. ఇంత అనుకూల వాతావరణంలోనూ ఎందుకిలా జరిగిందో కాంగ్రెస్ పార్టీ పరిశీలించుకోవాలి. గత ఎన్నికలలో కూడా కాంగ్రెస్‌కు ఇలా జరగలేదు. 94 సీట్లలో పోటీ చేసి కేవలం ఆరు సీట్లలో మాత్రమే డిపాజిట్ పోగొట్టుకుంది. వచ్చేది డబుల్ ఇంజన్ సర్కార్ ఇచ్చేది అన్ని మేమే అని చెప్పిన బీజేపీ 64 సీట్లలో డిపాజిట్లు రాకపోవడం ఆ పార్టీకి మింగుడు పడని సమస్యగా మారింది. మాజీ మంత్రి బాబూ మోహన్ అందోల్‌లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయగా డిపాజిట్ దక్కలేదు. మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి తనయుడు మహబూబ్‌నగర్‌లో కూడా ధరావత్ కోల్పోయాడు. మునుగోడులో మధ్యంతరంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ రెండో స్థానంలోకి వచ్చింది ఇప్పుడు అక్కడ డిపాజిట్ కూడా రాలేదు. బీజేపీతో అంటకాగిన జనసేన పవన్ కళ్యాణ్ పార్టీ పోటీ చేసిన ఏడుసీట్లలో డిపాజిట్ గల్లంతయింది. తెలంగాణలో పవన్ సినిమా ఫెయిల్ అయింది. బీజేపీ సోషల్ ఇంజనీరింగ్ కూడా ఫలితాలను రాబట్టలేకపోయింది. ముఖ్యంగా బీసీ ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ నినాదాలు ఆకట్టుకోలేకపోయాయి.

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలు

రాష్ట్రంలో 19 ఎస్సీ 12 ఎస్టీ నియోజక వర్గాలున్నాయి 19లో 19 నియోజకవర్గాలు ఉన్న ఎస్సీ సామాజిక వర్గం కాంగ్రెస్ 14 సీట్లను కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ మరో ఐదింటికి పరిమితమైంది. బీజేపీకి ఒక్క సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మాత్రమే రెండవ స్థానానికి పరి మితమైంది. కానీ ఒక్క సీటు కూడా గెలవలేక పోయింది. 12 గిరిజన రిజర్వుడు స్థానాల్లో కాంగ్రెస్ తొమ్మిదింటిలో విజయం సాధించగా మిగిలిన మూడింటిలో బీఆర్ఎస్ సరిపెట్టుకుంది గిరిజన స్థానాల్లో కొన్నింటిలో బీజేపీకి ఒక్క శాతం కూడా ఓట్లు పడకపోవడం గమనించాలి. బీజేపీ ఇచ్చిన బీసీ నినాదం ఊసే లేకుండాపోయింది. గత శాసనసభకంటే కొత్త సభకు బీసీ శాసనసభ్యులు తగ్గారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాదులో బీఆర్ఎస్ నిర్మించింది. కొన్ని జిల్లాలకు గిరిజనుల పేరు పెట్టింది. తండాలను, ఆదివాసి గూడాలను గ్రామ పంచాయతీ లుగా చేసింది. ఇంతజేసినా దళితుల నమ్మకాన్ని కూడగట్టలేకపోయింది. దళితబంధు పెట్టిన వ్యతిరేకతను మూటగట్టుకుంది. దళితులకు మూడెకరాల భూమి, గిరిజనులకు పోడు భూముల సమస్య పరిష్కారంలో బీఆర్ఎస్ బాధ్యతాయుతంగా వ్యవహరించలేక పోవడం వలన దళిత, గిరిజనులకు దూరమైంది వారి విశ్వాసాన్ని పోగొట్టుకుంది. మందకృష్ణ మాదిగను చేతిలో పట్టుకొని వర్గీకరణ డిమాండ్‌ను బీజేపీ ముందుకు తీసుకొచ్చింది. మాదిగలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ అన్యాయం చేసిందని కాంగ్రెస్ మాలల పార్టీ అని కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వర్గీకరణ చేయలేదు కాబట్టి బీజేపీకి మద్దతని మందకృష్ణ ప్రకటన చేశాడు. బీజేపీకి అనుకూలంగా హైదరాబాద్‌లో సభ పెట్టి మోడీని ఆహ్వానించాడు. బీజేపీ కలలన్నీ కల్లలయ్యాయి. ఆశించిన ఫలితాలు రాలేదు. అయినా బీజేపీని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు.

పెరిగిన మతోన్మాద ప్రమాదం

ఒకపక్క సోషల్ ఇంజనీరింగ్‌కు పాల్పడుతూ, మరోపక్క బీజేపీ గోబెల్స్ ప్రచారానికి పాల్పడింది. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ శక్తి మూడు నుండి ఎనిమిదికి పెరిగింది. మరొక ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే పద్నాలుగు లక్షల నుండి దాని ఓటింగ్ బలాన్ని ముప్పై రెండు లక్షలకు పెంచుకుంది. మూడవ శక్తిగా బలపడింది. అభ్యుదయ వాదులను కలవరపెట్టే అంశమిది.



> వచ్చేది డబుల్ ఇంజన్ సర్కార్ ఇచ్చేది అన్ని మేమే అని చెప్పిన బీజేపీ 64 సీట్లలో డిపాజిట్లు రాకపోవడం ఆ పార్టీకి మింగుడు పడని సమస్యగా మారింది. మాజీ మంత్రి బాబూమోహన్ అందోల్‌లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయగా డిపాజిట్ దక్కలేదు. మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి తనయుడు మహబూబ్‌నగర్‌లో కూడా ధరావత్ కోల్పోయాడు. మునుగోడులో మధ్యంతరంగా జరిగిన ఎన్నికలలో బీజేపీ రెండో స్థానంలోకి వచ్చింది ఇప్పుడు అక్కడ డిపాజిట్ కూడా రాలేదు. బీజేపీతో అంటకాగిన జనసేన పవన్‌కళ్యాణ్ పార్టీ పోటీ చేసిన ఏడుసీట్లలో డిపాజిట్ గల్లంతయింది. తెలంగాణలో పవన్ సినిమా ఫెయిల్ అయింది.

ఉపాధి, సంక్షేమం సవాళ్లు

రాష్ట్రంలో గత పాలకులు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినా వ్యతిరేకత వచ్చింది. దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి పథకాలు అందిన వారికి సంతోషం, అందని వారికి ఆక్రోశం, ఆగ్రహం కలిగిస్తాయి. రైతుబంధుతో రైతుల్లో సంతోషం కానీ రుణమాఫీ కాలేదని అసంతృప్తి వ్యక్తమైంది. దీనికి తోడు ఇప్పుడు కౌలు రైతులకు కూడా ఎకరానికి రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అది ఎలా అమలు చేస్తారో తేలాలి. అందరికీ పజిల్‌గా మారింది. మహిళలకి భృతికి గీటురాయి ఏమిటో చెప్పాలి. గ్యాస్ సబ్సిడీ ఎంతమందికి ఇస్తారు తేలాలి. అన్నింటికీ మించి కరెంటు సబ్సిడీ అమలు చేయకపోతే కొత్తగా వచ్చే పాలకులకు షాక్ కొట్టే ప్రమాదం లేకపోలేదు. వీటితోపాటు పాత పథకాలను అమలు చేస్తారో రద్దు చేస్తారో తెలియాలంటే వేచి చూడాల్సిందే. అన్నిటికంటే ముఖ్యం తెలంగాణ ఉద్యమం మూడు లక్ష్యాలచుట్టూ సాగింది. అందులో నీళ్లు, నిధులు, నియామకాలు. నీళ్ళ, నిధులు పక్కన పెడితే ఉద్యోగాల కల్పన తెలంగాణ ఉద్యమానికి పునాది. దాన్ని విస్మరించిన పాలకులను ఇంటికి పంపారు. ఉపాధి ఎలా కల్పిస్తారు అనేది రాబోయే ప్రభుత్వానికి పెద్ద సవాలు. ఒకవేళ అది సాధ్యం కాకపోతే నిరుద్యోగభృతి ఎలా నిర్ధారిస్తారనేది ఆలోచించాల్సిన అంశమే. పాలకవర్గాలు అధికారం కోసం ఆపద మొక్కులు మొక్కినట్టు అనేక వాగ్దానాలు చేస్తారు. వాటిని నెరవేర్చకపోతే వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుంది. అవకాశం కూడా లేకపోలేదు. అప్పుడు సరైన ప్రత్యామ్నాయం ఏమిటనే సమస్య తెలంగాణలో ముందుకు వస్తుంది.

ఒక పాలకపార్టీకి మరొక పాలకపార్టీ ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాజాలదు. దీనికితోడు మత విభజన ఆధారంగా మెజార్టీ ప్రజల అండతో అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ గోతికాడి నక్కలా ఎదురుచూస్తోంది. బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందో లేదో అన్నది తేలాలి. అధి కారం పోయింది కాబట్టి ఆ పార్టీలో కూడా పక్కచూపులు చూసే అవకాశం లేకపోలేదు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో జరగాల్సిన అభివృద్ధిపై ప్రజల్ని చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. దాని కోసం రాష్ట్ర పురోగమనాన్ని కాంక్షించే శక్తులు ఒక్కటై ఐక్యంగా నిలబడి పాలకులపై కలపడాల్సిన సమయం ఆసన్న మైంది. ఇది చేస్తేనే బీజేపీని ముందుకు రాకుండా నిలువరించగలరు. ఇదే సరైన బాట. సరైన సమయం. బాట తప్పితే మతోన్మాద ప్రమాదం పెచ్చరిల్లుతుంది.



జాతీయస్థాయి స్కూలుగేమ్స్ పోటీలకు...
ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-సత్తుపల్లి

నల్గొండలో మంగళ, బుధవారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూలుగేమ్స్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి 5గురు విద్యార్థులు ఎంపికైనట్లు కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీ పిచ్చయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో అండర్-14 విభాగంలో సత్తుపల్లికి చెందిన ఎండీ అబ్బుర్ రిహబ్, జీ ఉదయ్‌కిరణ్‌లు వెయిట్ లిఫ్టింగ్ కేటగిరీకి ఎంపికయ్యారన్నారు. అండర్-17 బాలికల విభాగంలో ఖమ్మం నుంచి కే నిఖిత, అండర్-17 బాలుర విభాగం నుంచి ఖమ్మంకు చెందిన సయ్యద్ ఆదిల్ పాషా, కొత్తగూడెంకు చెందిన డీ సాయివరుణ్ ఎంపికైనట్లు పిచ్చయ్య తెలిపారు. వీరంతా ఈనెల 16, 19 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి స్కూలుగేమ్స్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.



తుమ్మల నాగేశ్వరరావుకు అభినందనలు

నవతెలంగాణ-కల్లూరు

కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం సందర్భంగా హైదరాబాదులో గురువారం ఆయన నివాస గృహంలో కల్లూరు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చంద్రరావు, తెలంగాణ గ్రామర్ పాఠశాల చైర్మన్, క్రీసెంట్ ఫార్మసీ కంపెనీ అధినేత ఎస్కే జానిమియా, నల్లమల వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరు మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ప్రమాణస్వీకారం అనంతరం జిల్లా పర్యటనలో భాగంగా కల్లూరు వస్తానని తుమ్మల తెలిపారని చంద్రరావు విలేకరులకు తెలిపారు.



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కొణిజర్ల

కాంగ్రెస్ పార్టీ నుంచి వైరా నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన మాళోత్ రాందాస్ నాయక్‌ని హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్, అమ్మపాలెం ఎంపీటీసీ దంపతులు బాణోత్ అనూష క్రిష్ణ, టిడిపి మండల నాయకులు వాంకుడోతు సీతారాములు, యూత్ నాయకులు అనీల్, కొళ్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా దేవాలయాల బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవం

నవతెలంగాణ- ముదిగొండ

మండలంలోని పమ్మి గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ కోట మైసమ్మ, బంగారు మైసమ్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, ఆంజనేయస్వామి, నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ట మహోత్సవము ముత్తారం సీతారామచంద్రస్వామి దేవాలయం పూజారి బోర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ నిర్వాహకులు భారీ స్థాయిలో ఏర్పాటుచేసిన హోమగుండం, జలబిందుల బొడ్రాయి అభిషేకం, అమ్మవార్ల ట్రాక్టర్లతో ఊరేగింపు, దేవాలయాల పున ప్రతిష్ట మహోత్సవం కనుల పండుగగా జరిగింది. ఊరంతా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, స్నేహితులతో నిండి అంగరంగ వైభవంగా అట్టాసంగా కొనసాగింది. గ్రామంలో ముత్యాలమ్మ దేవాలయం వద్ద భారీ సంఖ్యలో భక్తులు, ప్రజలు సమీప గ్రామాల జనం హాజరయ్యే ముత్యాలమ్మ దేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. గ్రామంలో బంధువులతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ వడ్డే మాధవరావు, ఎంపీటీసీ సభ్యులు కోయ రమేష్, మాజీ ఎంపీటీసీ వడ్డే శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, యువతి, యువకులు, మహిళలు, చిన్నారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పడిపోయిన వరిపనులపై ఉప్పునీరు పిచికారి చేయండి
- దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన ఏవో

నవతెలంగాణ-కల్లూరు

తుఫాన్ కారణంగా కింద పడిపోయిన వరి పనులపై ఉప్పు నీరు పిచికారి చేస్తే మొక్క రాకుండా ఉంటుందని వ్యవసాయ అధికారి ఎం.రూప రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని కప్పల బంధం, ముచ్చావరం, యజ్ఞ నారాయణపురం తదితర గ్రామాల్లో వరి, మిర్చి, పత్తి పంటలను పరిశీలించారు. వరి పైరు పొలంలో కింద పడిపోయిందని, వెంటనే మడిలో నుండి నీళ్ల పోయేటట్టుగా కాలువలు కొట్టాలని, ఉప్పు ద్రావణం పిచికారి చేయాలన్నారు. కోసి కుప్పలు పోసిన ధాన్యం మంచిగా ఉన్నంతవరకు వేరు చేసి అడుగున తడిసిన ధాన్యానికి ఉప్పు నీరు పిచికారి చేయాలన్నారు. దీని ద్వారా మొక్క రాకుండా ఉంటుందని తెలిపారు. గాలికి మిర్చి తోటలు పడిపోతే వెంటనే వాటిని పైకి లేపి మొదలకు మట్టినేట్టటం, కర్రలు సపోర్టుగా పాతి కట్టడం వంటి చర్యలు చేపట్టాలని రైతులకు సూచన చేశారు.

విజయోత్సవ ర్యాలీలు వద్దు.. అన్నదాతలను ఆదుకుందాం
- వర్షాల నేపథ్యంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పిలుపు

నవతెలంగాణ-సత్తుపల్లి



తుపాను ప్రభావంతో ఎడతెరిపీ లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అన్నదాతలకు తీవ్ర-నష్టం జరిగి ఆవేదన చెందుతున్నారని, నేపథ్యంలో మనం గెలిచామనే సంతోషంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా కూడా విజయోత్సవ ర్యాలీలు జరపొద్దని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పంట చేతికందే సమయంలో అకాల వర్షాల కారణంగా నష్టం జరిగిందని, ఇలాంటి సమయంలో సంబురాలు జరుపోకుండా మనమంతా రైతులకు వెన్నుదన్నుగా నిలివాలని రాగమయి దయానంద్ కోరారు. తెలంగాణ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదలశాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గురు మాత్యులు

ఉమ్మడి ఖమ్మం జిల్లా చరిత్రలో తొలిసారి సువర్ణావకాశం

- ఒకే మంత్రివర్గంలో ముగ్గురికి చోటు
- ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క
- భట్టితో పాటు పొంగులేటి, తుమ్మలకు కీలక మంత్రి పదవులు

నవతెలంగాణ - ఖమ్మంప్రాంతీయ ప్రతినిధి





తెలంగాణ రాష్ట్ర మూడో మంత్రివర్గ కూర్పులో ఖమ్మం జిల్లాకు సువర్ణావకాశం లభించింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వంలో ఏకంగా ముగ్గురు కీలక నేతలకు కేబినెట్ బెర్త్ ఖరారైంది. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. మధిర నుంచి వరుసగా నాలుగోసారి విజయం సాధించిన మల్లు భట్టి విక్రమార్కకు ఉప ముఖ్యమంత్రితో పాటు కీలకశాఖ లభిస్తుంది. మాజీ ఎంపీ, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావుకు ప్రాధాన్యం ఉన్న శాఖలు లభించనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎప్పుడూ ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్‌లో మాత్రమే ఒకేసారి ఇద్దరికి బెర్త్ దొరికింది. అప్పుడు సంభాని చంద్రశేఖర్, వనమా వెంకటేశ్వరరావు మంత్రులుగా పనిచేశారు. ఇప్పుడు మాత్రం ఒకేసారి మూడు కీలక శాఖలు ఖమ్మం జిల్లాకు దక్కడంతో కాంగ్రెస్ శ్రేణులతో పాటు జిల్లా ప్రజల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది.

తొలిసారి జిల్లాకు ఉప ముఖ్యమంత్రి పదవి...

ఖమ్మం జిల్లా నుంచి గతంలో జలగం వెంగళరావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. పలువురు నాయకులు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. కానీ ఇప్పటి వరకు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో దక్కిన అత్యుత్తమ పదవి ముఖ్యమంత్రి పోస్టే. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్కకు అవకాశం దక్కింది. ఎన్ఎస్‌యూఐ కార్యకర్త స్థాయి నుంచి భట్టి పార్టీకి విధేయుడిగా ఉంటున్నారు. మధిర నుంచి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించడం, రాష్ట్రంలో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు 109 రోజుల పాటు 1365 కిలోమీటర్లు మండుటెండలో చేసిన పాదయాత్ర, కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయడం, చీఫ్‌విప్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా, సీఎల్పీ నేతగా సమర్థవంతమైన బాధ్యతలు నిర్వర్తించడం భట్టికి సానుకూలంగా మారాయి. సామాజిక సమీకరణాలు కూడా ఆయనకు కలిసివచ్చాయి.

కలిసివచ్చిన అనుభవం... సామాజిక సమీకరణాలు..

తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్ కేబినెట్‌లలో మంత్రిగా పనిచేశారు. సత్తుపల్లి నుంచి మూడుసార్లు, ఖమ్మం నుంచి రెండుసార్లు, పాలేరు నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించారు. చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా, ఎక్సైజ్ మినిస్టర్‌గా, భారీ నీటిపారుదల శాఖ మంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రిగా, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి అత్యధికసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రజబ్ అలీ సరసన చేరిన తుమ్మలకు మంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉంది. వీటితో పాటు కాంగ్రెస్‌లో చేరిన రెండు నెలల్లోనే ఎమ్మెల్యేగా గెలవడంతో మంత్రిగా అవకాశం లభించింది.

అనతికాలంలోనే కీలకనేతగా ఎదిగిన పొంగులేటి..

పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచింది ఇదే మొదటిసారి అయినా రాష్ట్ర కేబినెట్‌లో చోటు సంపాదించారు. మాజీ ఎంపీగా కాంగ్రెస్‌లో చేరిన కొద్దికాలంలో కీలక నేతగా ఎదిగారు. ఆయన చేరిక సందర్భంగా ఈ ఏడాది జులై 2న ఖమ్మంలో ఏర్పాటు చేసిన జనగర్జన భారీ బహిరంగ సభతో రాహుల్ గాంధీ దృష్టిలో పడ్డారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమితులై, ఈ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు స్థానాల్లో పొంగులేటి ప్రచారం నిర్వహించారు. 17 అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ అభ్యర్థులకు ఆయన ఆర్థికంగా అండగా నిలబడ్డారనే ప్రచారముంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్నికల ప్రచారం కోసం రాహుల్, ప్రియాంకగాంధీని రప్పించారు. ఇక పాలేరు సెగ్మెంట్ నుంచి ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 56 వేలకు పైగా భారీ మెజార్టీతో గెలుపొంది కేబినెట్ బెర్త్ దక్కించుకున్నారు.

మొదటిసారి ముగ్గురు...



రాష్ట్రంలో 1992 నుంచి 2004వ సంవత్సరం మినహా మిగిలిన అన్ని ప్రభుత్వాల్లో ఉమ్మడి జిల్లాకు ఒక మంత్రి పదవి లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటి వరకు శీలం సిద్దారెడ్డి, జలగం వెంగళరావు, తుమ్మల నాగేశ్వరరావు, జలగం ప్రసాదరావు, కోనేరు నాగేశ్వరరావు, రాంరెడ్డి వెంకట్ రెడ్డి, సంభాని చంద్రశేఖర్, వనమా వెంకటేశ్వరరావు, పువ్వాడ అజయ్‌కుమార్ మంత్రులుగా పని చేశారు. వీరిలో 2004లో ఒకేసారి సంభాని చంద్రశేఖర్, వనమా వెంకటేశ్వరరావు మంత్రులుగా ఉన్నారు. ఆ తర్వాత ఇప్పుడు ఒకేసారి ముగ్గురు మంత్రులవ్వడం విశేషం.

పొంగులేటి శ్రీనివాసరెడ్డి

స్వస్థలం: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురం
జననం : 1965 అక్టోబర్ 28
కుటుంబం: తల్లిదండ్రులు పొంగులేటి రాఘవరెడ్డి, స్వరాజ్యం, భార్య మాధురి, కుమారుడు హర్షారెడ్డి, కోడలు సోమారెడ్డి, కుమార్తె స్వప్నిరెడ్డి, అల్లుడు అర్జున్‌రెడ్డి.
వ్యాపారజీవితం:1985లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామోదయ పథకంలో పేరువంచ మేజర్ క్రాస్వాల్ నిర్మాణం చేశారు. ఆ క్రాస్వాల్ నిర్మాణంతో 450 ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. అలా కాంట్రాక్టర్గా మారి అనేక నిర్మాణాలు చేశారు. అలా ఉన్నత స్థితికి ఎదుగుతూ వచ్చారు.
సామాజిక సేవలు : తల్లిదండ్రుల పేరిట పీఎస్ఆర్ ట్రస్టు పేరుతో అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఆయా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి సమయంలో ఉచితంగా తాగునీరు సరఫరా చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, చదువుకునే స్థోమత లేని విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందించడం, క్రీడా పోటీలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించడం లాంటి మొదలగు అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నారు.
రాజకీయ ప్రస్థానం : 2013లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 లోకసభ ఎన్నికలలో వైఎస్ఆర్ పార్టీ తరఫున ఖమ్మం లోకసభ నియోజకవర్గం నుంచి పోటీచేసి, టీడీపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావుపై 11,974 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 2014 సెప్టెంబరు 1 నుంచి 2019 వరకు రవాణా, పర్యాటక, సంస్కృతి శాఖ స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఎనర్జీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సంప్రదింపుల కమిటీలో సభ్యులుగా పనిచేశారు. కొంతకాలం తెలంగాణ వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. అనంతరం 2016లో అప్పటి టీఆర్ఎస్ పార్టీ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరారు. 2018లో ఖమ్మం పార్లమెంట్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఈ ఏడాది జూలై 2న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో ఖమ్మంలో జరిగిన జనగర్జన భారీ బహిరంగ సభ ద్వారా కాంగ్రెస్ పార్టీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరఫున పాలేరు ఎమ్మెల్యేగా పోటీ చేసి మొదటిసారిగా ఎమ్మెలేగా గెలుపొందారు.

మల్లు భట్టి విక్రమార్క

జననం : 1961 జూన్15, స్నానాల లక్ష్మీపురం గ్రామం, వైరా మండలం, ఖమ్మం జిల్లా.
తల్లిదండ్రులు : అఖిలాండ, మాణిక్యమ్మ
జీవిత భాగస్వామి : నందిని
సంతానం : సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య
రాజకీయ ప్రస్థానం :
ప్రస్తుతం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యుడిగా నాల్గోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2009, 2014, 2018, 2023 ఎన్నికలలో శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యారు.
2009 నుండి 2011 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చీఫ్ విప్‌గా ఉన్నారు.
2011 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2019 నుండి 2023 వరకు తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ పక్ష నేతగా వ్యవహరించారు. డైరెక్టర్, ఆంధ్రాబ్యాంక్ గా వ్యవహరించారు.
పీసీసీ కార్యనిర్వాహక సభ్యుడు (1990-92)
పీసీసీ కార్యదర్శి (2000-2003)గా పని చేశారు.
2007లో ఖమ్మం జిల్లా నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు.
భట్టి విక్రమార్క సోదరుడు మల్లు అనంత రాములు నాగర్‌కర్నూల్ లోకసభ నియోజకవర్గం మాజీ పార్లమెంటు సభ్యుడు, మాజీ పీసీసీ అధ్యక్షుడు. కాగా, మరో అన్న మల్లు రవి మాజీ పార్లమెంటు సభ్యుడు, శాసనసభ సభ్యులు. విక్రమార్క హైదరాబాదులోని కళాశాల నుండి గ్రాడ్యుయేషన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు.
పాదయాత్ర...
మల్లు భట్టి విక్రమార్క 2023 మార్చి 16న ఆదిలాబాద్? జిల్లాలోని బోథ్ నియోజకవర్గ పిప్పిరి గ్రామం నుంచి 'పీపుల్స్? మార్చ్'? పాదయాత్ర ప్రారంభించి రాష్ట్రంలోని 17 జిల్లాలు, 36 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,365 కిలో మీటర్లు పూర్తి చేసి పాదయాత్రకు గుర్తుగా ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడు దగ్గర పైలాన్ ను ఆవిష్కరించి ముగింపు సందర్భంగా ఖమ్మంలో 2023 జులై 2న రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా జన గర్జన సభను నిర్వహించారు.

తుమ్మల నాగేశ్వరరావు

జననం..: ఖమ్మం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో తుమ్మల లక్ష్మయ్య, మాణిక్యమ్మ దంపతులకు 1953 నవంబర్ 15 న జన్మించారు.
సోదరులు...: తుమ్మల జానకి రామయ్య, తుమ్మల చెన్నారావు(లేటు),
అక్కచెల్లెలు : భద్రమ్మ, రమణమ్మ
భార్య: భ్రమరాంబ
కుమారుడు : తుమ్మల యుగంధర్, **కోడలు :** దీప్తి
కుమార్తెలు: పెద్ద కూతురు డాక్టర్ జగన్మోహిని, రెండవ కూతురు చంద్రిక
విద్యాభ్యాసం...1 నుంచి 4వ క్లాస్ వరకు గండుగులపల్లిలో...4 నుంచి హెచ్ఎస్సి వరకు సత్తుపల్లి మండలం కిష్టారం హైస్కూల్ లో...1969లో పియూసీ కొత్తగూడెంలోని ఎస్సార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో పూర్తి చేశారు. 1972 నుంచి 1975 వరకు హైదరాబాద్ లోని రామచంద్ర కామర్స్ కాలేజ్‌లో బీకాం పూర్తి చేశారు.
రాజకీయ రంగప్రవేశం..
1982 స్వర్గీయ నందమూరి తారకరామారావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీలో చేరారు. 1985, 1994, 1999 సంవత్సరాలలో సత్తుపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మూడు సార్లు ప్రాతినిధ్యం వహించిన సత్తుపల్లి అసెంబ్లీతో పాటు జిల్లా మంత్రిగా అభివృద్ధికి విశేష కృషి చేశారు. రిజర్వేషన్ల మార్పుతో సత్తుపల్లిని ఎస్సీ రిజర్వేషన్‌గా మార్చడంతో ... 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం సెగ్మెంట్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యే గా గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 2014 లో ఎమ్మెల్సీ గా చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2016 పాలేరు అసెంబ్లీ ఉపఎన్నికల్లో ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 45,676 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. స్వర్గీయ ఎన్టీఆర్ మంత్రి వర్గంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్, మేజర్ ఇరిగేషన్ శాఖల మంత్రిగా... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మాజీ సీఎం చంద్రబాబు క్యాబినెట్ లో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా...కేసీఆర్ మంత్రి వర్గంలో రోడ్లు, భవనాల...మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.

సమగ్ర చట్టం కోసం పోరాడుతా..

ఎంపీ నామ నాగేశ్వరరావు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకువచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు గురువారం న్యూఢిల్లీలో ఖమ్మం నుంచి వెళ్లిన ప్రతినిధి బృందానికి స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం న్యూఢిల్లీలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావును కలిసి మెమోరాండం అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీ నామ మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, వ్యవసాయం కోసం రైతు, కూలీలు ఎంత కష్ట పడతారో తాను ఎంతో దగ్గరగా చూశానన్నారు. అప్పులు చేసి,తీర్చలేక ఆత్మ హత్యలు చేసుకునే వారని అన్నారు. అందుకే పార్లమెంట్‌లో ఎన్నో సార్లు రైతు వ్యతిరేక చట్టాలను , మోటార్లకు మీటర్లను అడ్డుకోవడం జరిగిందని గుర్తు చేశారు. దేశానికి వెన్నుముకైనా అన్నదాతల సమగ్ర వ్యవసాయ చట్టం కోసం చేయని పోరాటం లేదన్నారు. తాజాగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు రోజు జరిగిన అఖిల పక్ష సమావేశం లో కూడా రైతు చట్టాల గురించి పార్లమెంటులో చర్చించాలని కేంద్రాన్ని కోరిన సంగతిని గుర్తు చేశారు. రైతుకు గిట్టుబాటు ధరకు సంబంధించిన చట్టం పై కూడా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చర్చించాలని కూడా తాను కోరినట్లు నామ నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని. రోజుకు 600 రూపాయలు చొప్పున కూలి ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్లో 2,50,000 కోట్ల నిధులు కేటాయించాలని. ఉపాధి పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, దళిత గిరిజన పై జరుగుతున్న దాడులని నివారించాలని, దేశంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులును భర్తీ చేయాలని. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని తదితర సమస్యలపై ఈ సందర్భంగా ఎంపీ నామ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేయగా ఎంపీ నామ సానుకూలంగా స్పందించి, వారికి భరోసా ఇచ్చారు. ఎంపీ నామ ను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు కెవిపిఎస్ నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, నందిపాటి మనోహర్, సాగర్, కెవి రెడ్డి, తేలపోలు రాధాకృష్ణ, కే.లక్ష్మణరావు, వేణు, బంధం శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజల మనిషి శ్రీహరి యాదవ్
ఆయన లేని లోటు తీర్చలేనిది

నవతెలంగాణ- ఖమ్మం

చిత్తారు శ్రీహరి యాదవ్ ప్రజల మనిషి అని, ఎన్నో సామాజిక కార్యక్రమాలతో ప్రజల మనసును గెల్చుకున్నారని పలువురు వక్తలు నివాలర్పించారు. అఖిల భారత యాదవ్ మహాసభ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో గురువారం చిత్తారు శ్రీహరి యాదవ్ 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్ మాట్లాడుతూ శ్రీహరి యాదవ్ యాదవ్ సంఘ పటిష్టానికి, సంఘ పురోభివృద్ధికి శ్రమిస్తూ అశువులు బాశారని నివాళ్లర్పించారు. ఆయన లేని లోటు ఎంతగానో కనిపిస్తుందని అన్నారు. ఆయన స్పూర్తితో ముందుకు పోవాలన్నారు. అంతకుముందు శ్రీహరి యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించి, నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ్ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య యాదవ్, అఖిల భారత యూత్ అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్, గొర్రెల పెంపకందారుల ఖమ్మం జిల్లా అధ్యక్షులు చింతలచెరువు కోటేశ్వరరావు, పొదుల సతీష్ యాదవ్, తెల్లబోయిన రమణ యాదవ్, పొదిల తిరుపతిరావు, కన్నబోయిన రవియాదవ్, ఎల్ఐసి శ్రీను, భూపతి యాదవ్, మండే శ్రీనివాస్ యాదవ్, వాకధాని విజయ్, వాకధాని రఘుపతి యాదవ్, పంకు మురళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ(ఎం) జనరల్ బాడీ సమావేశం

హాజరుకానున్న తమ్మినేని

నవతెలంగాణ- కూసుమంచి

సీపీఐ(ఎం) మండల స్థాయి జనరల్ బాడీ సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరు కానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ మండల కమిటీ సభ్యులు, గ్రామ శాఖ కార్యదర్శులు, గ్రామస్థాయి ముఖ్య నాయకులు, పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆ పార్టీ మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పాలేరు డివిజన్ ఇంచార్జీ బండి రమేష్, మండల ఇంచార్జీ బుగ్గవీటి సరళ పాల్గొననున్నట్లు తెలిపారు.



సమిష్టి కృషితో ప్రజా సమస్యలు పరిష్కరించుకుందాం

- ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్

నవతెలంగాణ-కూసుమంచి

ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేసి మండలంలో ప్రజా సమస్యలను పరిష్కారం చేసుకుందామని ఎంపీపీ భానోత్. శ్రీనివాస్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... మండలంలో ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అధికారులకు సూచించారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమిష్టిగా కలిసి పనిచేసి సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని, ప్రజా సమస్యల పరిష్కారించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి కంచర్ల పద్మా వీరారెడ్డి, ఎంపీడీవో రమాదేవి, కో -ఆప్షన్ మెంబర్ అలీ, సర్పంచ్లు ఎంపీటీసీలు, పలు ప్రభుత్వశాఖ అధికారులు పాల్గొన్నారు.



రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో యువకుల సంబరాలు

నవతెలంగాణ-కామేపల్లి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో యువకులు, నిరుద్యోగులు సంబరాలు జరిపారు. టపాసులు కాల్చి రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ కేరింతల కొట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు తెల్లబోయిన సురేష్, ప్రధాన కార్యదర్శి గోకర ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెరుగు రాము, కాంగ్రెస్ నాయకులు సింగం వెంకట రాములు, మంద వెంకన్న, సింగం రామకృష్ణ, గాడి పల్లి ఉపేందర్, పెరుగు నాగరాజు, నక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి..

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని ఆరెంపుల మాజీ ఎంపీటీసీ, తెదేపా నాయకుడు గోకినెపల్లి కొండలు (55) బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని తెదేపా రాష్ట్ర నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లు గురువారం సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు. పార్టీ అభివృద్ధికి కొండలు చేసిన సేవలను కొనియాడారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారితో కాంగ్రెస్ నాయకుడు,సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బండి జగదీశ్, ఆరెంపులు సర్పంచ్ పద్మ తెదేపా పాలేరు ఇంచార్జ్ కరుణాకర్, మండలాధ్యక్షుడు సానబోయిన శ్రీనివాస్ గౌడ్, కూసుమంచి మండలాధ్యక్షుడు కోటి, నాయకులు విజయ్, నాగేశ్వరరావు,వెంకటేశ్వర్లు,స్థానిక కాంగ్రెస్,తెదేపా నాయకులు ఉన్నారు.



ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలో జలగంనగర్ లోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులకు యుడైస్ ప్లస్ శిక్షణ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ శ్యాంసన్ మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన సమాచారం అంతా ఈనెల 11వ తేదీన వరకు ఎంఆర్సీ భవనంలో సమర్పించాలన్నారు. పాఠశాలలో అవసరమైన మౌళిక వసతుల గురించి వివరించారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్యాన్సర్ వ్యాధిగ్రస్తునికి... టాలెంట్ స్కూల్ ఆర్థిక చేయూత

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి టాలెంట్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా ఆ స్కూలు యాజమాన్యం ఆర్థిక చేయూతను అందించింది. టాలెంట్ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయలక్ష్మి కవిజయలక్ష్మికి టీచర్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అంతా కలిసి కలిసి రూ.76,500 లను ఉపాధ్యాయురాలు స్నేహితురాలు సరస్వతి ద్వారా విజయలక్ష్మికి ఈ సాయాన్ని అందించారు. అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ కరెస్పాండెంట్ పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పిల్లలు చదువుకున్నంత కాలం చదివిస్తానని స్కూలు యాజమాన్యం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న జేసీబీ...వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఓ ద్విచక్రవాహనాన్ని జేసీబీ(ప్రోక్లయిన్) ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలో కరుణగిరి మున్నేరు వంతెనపై గురువారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలోని సైనిక్ వెల్ఫేర్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు (50) మండలంలోని టీఎస్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో కరుణగిరి మున్నేరు వంతెనపై ఎదురుగా వస్తున్న జేసీబీ (పొక్లయిన్) ఢీకొంది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి ఎస్ఐ వెంకటకృష్ణ చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సత్తుపల్లి ప్రజలను వదిలి వెళ్లేది లేదు

- నా రాజకీయ కార్యకలాపాలు ఇక్కడ్నుంచే
- ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా ఉంటా
- రాజకీయాలకు అతీతంగా సేవలందించా
- ఎన్నికైన వారు నాలాగే ఉండాలని కోరుకుంటున్నా
- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



నవతెలంగాణ-సత్తుపల్లి

గెలుపోటములు సర్వసాధారణమని, ఓడిపోయానని బాధపడేది లేదని, మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి ప్రజలకు సేవచేసే భాగ్యం కల్పించిన సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలను మర్చిపోనని, సత్తుపల్లి కేంద్రంగానే నా రాజకీయ కార్యకలాపాలు సాగిస్తానని తాజా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. గురువారం మసీదు రోడ్డులోని క్యాంపు కార్యాలయం వద్ద సండ్ర విలేకర్లతో మాట్లాడారు. ఓడిపోయాక సత్తుపల్లిని వదిలి వెళ్లిపోతారని కొంతమంది సామాజిక మాధ్యమాల్లో పెట్టినా బాధపడేది లేదన్నారు. నా విజయం కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు సత్తుపల్లిలోనే ఉంటూ అండగా నిలబడతానన్నారు. ఎమ్మెల్యేగా గత 15 యేండ్లుగా రాజకీయాలకు అతీతంగా పనిచేశానన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమాభివృద్ధి పథకాలను సైతం తమపర భేదం లేకుండా అర్హత ఉన్న లబ్ధిదారులకు అందించానన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే కూడా నాలాగే రాజకీయాలకు అతీతంగా వారి సేవలందించాలని ఆకాంక్షిస్తున్నట్లు సండ్ర అన్నారు. గత మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా అధికారదర్పం ఏనాడూ ప్రదర్శించలేదన్నారు. ఎవరిపైనైనా దాడులు చేయించాలనే ఆలోచన కూడా రాలేదన్నారు. ఇలాంటి వాటిని దీర్ఘకాలికంగా ప్రజలు హర్షించరన్నారు. 2500 వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరై ఉన్నాయని, వాటిని తీసుకొచ్చి లబ్ధిదారులకు అందించే బాధ్యతను కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే తీసుకోవాలని సండ్ర కోరారు. ఫలితాలు వెలువడ్డాక వందలాది మంది నన్ను కలిసి బాధ్యను వ్యక్తం చేశారన్నారు. కొంతమంది భయభ్రాంతులకు గురిచేసినా తట్టుకొని, నాపై ఉన్న నమ్మకంతో గెలిపించేందుకు కష్టపడిన వారిని అండగా ఉంటానని వాళ్లకు భరోసా ఇచ్చానన్నారు. వాళ్లకి పత్రికా ముఖంగా భరోసా తెలియజేస్తున్నాని సండ్ర స్పష్టం చేశారు. ప్రజలకు సేవలందించడానికి అధికారం ఉంటేనే కాదని, ప్రతిపక్షంలో ఉన్నా సేవలందించవచ్చన్నారు. ఇక్కడే ఉంటూ కార్యకర్తలు, ప్రజలకు ఏ విధంగా సాయమందించాలో సత్తుపల్లి ప్రజల మధ్యనే ఉంటూ రాజకీయ కార్యకలాపాలను సాగించడం జరుగుతుందని సండ్ర తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ ఛైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, పట్టణ, మండల అధ్యక్షులు ఎస్కే రఫీ, యాగంటి శ్రీనివాసరావు, మల్లూరు అంకమరాజు, పెనుబల్లి ఎంపీపీ లక్కినేని అలేఖ్య వినీల్, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, చెక్కిలాల మోహనరావు, సదాశివునిపాలెం సర్పంచ్ తుంబూరు సరస్వతి, ఉప సర్పంచ్ కాల్నేని వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, ఎస్కే చాంద్‌పాషా, గుండ్ర రాఘవేంద్ర, నాయకులు అమరవరపు కృష్ణారావు, వల్లభనేని పవన్, మానుకోట సత్యనారాయణ, పర్వతనేని వేణు, తుంబూరు దామోదరరెడ్డి పాల్గొన్నారు.



వరి వర్షార్పణం

- నీటిలోనే వరి పంట

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో చేతికి వచ్చి వరి పంట వర్షార్పణం కావటంతో రైతులు పడుతున్న వేదన వర్ణాతీతంగా మారింది. మూడు రోజులు తుఫాన్‌తో పొలంలోని వరి తడిసి ముద్దై చేతికి రాని పరిస్థితి ఉంది. పొలం నుండి నీటిని తొలగించటానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చీమల వారిగూడెంలో రైతు అడ్డగోడ ఐలయ్య పొలంలో నీరు నిల్వ ఉండి వరి మెదలు మునిగి పోయిఉన్నాయి. కోసిన వరి మెదలు పొలంనుండి బయటకు తీసినా ధాన్యం రంగుమారటం, మొలకెత్తుతున్నాయని రైతు ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చీమలపాడు ప్రాంతంలో ఈదురు గాలులు, తుఫాను తాకిడికి వరి కంకులు విరిగి నేలపాలైనాయి. పంట నేలపాలైనా రైతులను ఆదుకోవాలని గిరిజన రైతు ఎరిపోతు భద్రయ్య ప్రభుత్వాన్ని అర్థిస్తున్నారు.

శ్రీకోటమైసమ్మ తల్లికి కంఠాహారం వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలంలో ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మ అమ్మవారికి గురువారం దాతలు కంఠాహారం వితరణ చేశారు. మహబూబాబాద్ జిల్లా ములకనూరు గ్రామానికి చెందిన కడియాల భారతి అమెరికాలో ఉద్యోగం వచ్చిన సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లింపులో భాగంగా రూ.1.25 లక్షల విలువైన బంగారు కంఠాహారంను దాత తండ్రి కోటేశ్వరరావు ఆలయం ట్రస్టీ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభిరామారావు, ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులుకు అందజేశారు. ఆలయ అర్చకులు కొత్తలంక కైలాస శర్మ కంఠాహారంకు పూజలు నిర్వహించి అమ్మవారికి ధరింపచేశారు. దాతను ఆలయ అధికారులు అభినందించారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది మూడు మోహన్, లలిత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు మంత్రులను అందించిన పాలేరు





నవతెలంగాణ- కూసుమంచి

ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక కూడా పాలేరు నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కడం విశేషం. ఇది ఎక్కువ శాతం రుజువు అవుతుంది. పాలేరు నియోజకవర్గానికి అదే గౌరవంగా వస్తుంది. ఇది మరోసారి రుజువు అయింది. పాలేరు నియోజకవర్గం నుండి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మంత్రి పదవి దక్కింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడ్డ మంత్రివర్గంలో సంభాని చంద్రశేఖర్ 1989 సంవత్సరంలో పాలేరు నుంచి గెలిచి 1992 లో మంత్రి పదవి చేపట్టారు. అనంతరం పాలేరు నియోజకవర్గ నుండి 2009–2014 సంవత్సరంలో గెలిచిన రామిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి వరించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఆ ఆనవాయితీ కొనసాగుతుంది. 2015 పాలేరు నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన తుమ్మల నాగేశ్వరరావు కూడా టిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కింది. నేడు(2023) కాంగ్రెస్ ప్రభుత్వం లో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గంలో పాలేరు ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచిన శ్రీనివాస్ రెడ్డికి కూడా మంత్రి పదవి దక్కడం విశేషం. రాష్ట్రంలో ఏ ప్రభుత్వంలో ఏర్పడ్డా పాలేరు నియోజకవర్గానికి మంత్రి పదవి పక్క అనే సెంటిమెంట్ గుర్తు చేసుకుంటున్నారు. ఏదేమైనా మొదటిసారి ఎమ్మెల్యే అయిన మంత్రి పదవి దక్కించుకున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

ఖమ్మంలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు



నవతెలంగాణ-ఖమ్మం టౌన్

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడం పట్ల గురువారం స్థానిక 17, 27 డివిజన్ లలో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 17, 27 డివిజన్ యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ గంగాధర్ , మైనార్టీ నాయకులు షేక్ జాని ఆద్వర్యంలో బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు షేక్ జిలాని హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ యువజన కాంగ్రెస్ నాయకులు షేఖ్ జిలాని మాట్లాడుతూ ప్రగతి భవన్ ను బద్దలు కొడతామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానంతరం ప్రగతి భవన్ చుట్టూ ఉన్న కంచె తీసి వేయించి జ్యోతిరావు పూలే ప్రజా భవన్ గా మార్చారని అన్నారు. ఈ భవన్లోనే ప్రజా దర్బారు నిర్వహించనున్నారని అన్నారు. దొరల తెలంగాణ పోయిందని ప్రజల తెలంగాణ వచ్చిందని అన్నారు. 6 గ్యారంటీ లపై తొలి సంతకం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు. సోనియమ్మ ఇచ్చిన నిజమైన తెలంగాణ ఇప్పుడు ప్రజలకు కనిపిస్తోందని అన్నారు. దొరల పాలనా కుటుంబ పాలన అంతమైందని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన మొదలైందని అన్నారు. ఖమ్మం జిల్లాకు మూడు మంత్రులుగా భట్టి విక్రమార్కు, తుమ్మల నాగేశ్వర రావు, మరియు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం జిల్లాకు అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ తోపాటు యువజన కమిటీ పలువురు ప్రజా పతినిధులు మహిళలు పాల్గొన్నారు.



పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాల రూపొందించండి

ఏడిఏ నరసింహారావు

కల్లూరు : తుఫాన్ కారణంగా పడిపోయిన వారి పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి కచ్చితంగా నమోదు చేయాలని సత్తుపల్లి వ్యవసాయ సంచారకులు ఏడిఏ నరసింహారావు ఏఈఓలను కోరారు. గురువారం స్థానిక రైతు వేదికలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ఈదురుగాళ్లకు పడిపోయిన వారిని మీ దగ్గర ఉన్న ఆధారాలు ప్రకారం ఎకరాలు రైతు పేరు నమోదు చేయాలన్నారు. రైతులు వరి పైరును కోసే ప్రయత్నం చేస్తారు కాబట్టి ఇప్పుడైతేనే కరెక్ట్ గా జరిగే నష్టం ప్రాథమిక అంచనా వేయటానికి కుదురుతుందని అన్నారు. ప్రభుత్వం నుండి ఇప్పటివరకు ఎటువంటి గైడెన్స్ లేవని ఒకవేళ తర్వాత వచ్చిన గాని రూపొందించిన అంచనాలు ఉపయోగపడతాయని క్షేత్రస్థాయిలో ప్రతి ఎకరాన్ని పరిశీలించి నష్టం ఎంత జరుగుతుందో అంచనా వేయాలన్నారు. ప్రతి నెల జరిగే సమీక్ష సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం.రూప, ఏఈవోలు పాల్గొన్నారు.



పంటనష్టం నమోదు యుద్ధప్రాతిపదికన చేయాలి

తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ-కొణిజర్ల

తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ, వ్యవసాయ శాఖలకు ఆదేశాలు జారీ చేసి యుద్ధప్రాతిపదికన సర్వే జరిపి నష్టం నమోదు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం తెలంగాణ రైతు సంఘం బృందం లాలాపురం, పల్లిపాడు గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ వేలాది ఎకరాల వరి పంట నీట మునిగి తేలుతున్న పరిస్థితి ఏర్పడింది అన్నారు. వర్షం నీరు బయటకు పంపే అవకాశం లేని రైతులు కూలీలు ద్వారా నీటిలోనే వరి కోసి ఒడ్డుకు చేరవేయడం జరుగుతుంది అన్నారు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టిన మిర్చి కింద పడింది అన్నారు. మొక్కజొన్న పంట కూడా దెబ్బతిన్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎకరాకు ఇరవై ఐదు వేల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టం సర్వే వెంటనే జరపాలని డిమాండ్ చేశారు. వారం రోజుల గడిచిన తర్వాత వ్యవసాయ శాఖ సర్వే చేయడం వల్ల రైతులకు ఉపయోగం లేకుండా పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, పారుపల్లి శ్రీనాథ్, రైతు సంఘం అధ్యక్షులు ఎస్‌డి పాషా, కార్యదర్శి సంక్రాంతి పురుషోత్తం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు

నవతెలంగాణ-నేలకొండపల్లి

తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన వరి, మిర్చి, పత్తి వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందాల్సిన పంట వేలాది ఎకరాలలో నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నేలకొండపల్లి, సదాశివపురం, అనాసాగరం, ముజ్జుగూడెం, నాచేపల్లి, మంగాపురం తండా తదితర గ్రామాలలో కోతకొచ్చిన వరి పొలాలు నేల వాలిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. అప్పలనరసింహపురం, రాయగూడెం, కోరట్లగూడెం, మోటాపురం, రాజేశ్వరపురం తదితర గ్రామంలో మిర్చి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. ఎరువులు పురుగు మదుల ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఎకరానికి లక్ష నుంచి రెండు లక్షల వరకు పెట్టుబడులు పెట్టగా చేతికందే సమయంలో వర్షం తాకిడితో మిరప చెట్లు విరిగిపోవడంతో పాటు పూత ఖాతా పూర్తిగా రాలిపోవడంతో రైతులకు అపార నష్టం కలిగించింది. పత్తి పంటకు సైతం పెద్ద ఎత్తున నష్టం జరగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి అనేక వ్యయ ప్రయాసల కోర్చి పంటలు సాగు చేస్తే ప్రకృతి బీభత్సంతో నోటికాడి కొచ్చిన పంటలు నీటిపాలు కావడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. వ్యవసాయ అధికారులు ఇప్పటికే దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు జరిగిన నష్టంపై అధికారులకు నివేదికలు పంపించారు. ఈ నేపథ్యంలో రైతులకు జరిగిన నష్టాన్ని నిర్దిష్టంగా లెక్క కట్టి ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి తగిన మద్దతు ధరను చెల్లించాలన్నారు.



రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి జిల్లా కోపరేటివ్ సొసైటీ వైస్ చైర్మెన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావుతో పాటు గురువారం పాల్వంచ నుండి పలువురు నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. రేవంత్‌రెడ్డితో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ప్రమాణ స్వీకారానికి హాజరైయ్యారు. ప్రమాణ స్వీకారానికి వెళ్లినవారిలో కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, బాదార్ల జోషి, కందుకూరి రాము, పులి సత్యనారాయణ, ధర్మరాజుల నాగేశ్వరరావు, ధారా చిరంజీవి, డోలి శ్రీను, బాలినేని నాగేశ్వరరావు, కలగట్ల నాగిరెడ్డి, సామా వెంకటరెడ్డి, ఆవుల మధు, ధర్మసూత్ ఉపేందర్, పాటోలు నాగేశ్వరరావులి, తదితరులు పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ-సుజాతనగర్

మండల పరిధిలోని రాఘవపురం గ్రామంలో తుఫాను ప్రభావంతో పాడైపోయిన వరి, జామ పంటలను గురువారం ఏడీ కరుణ శ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంలో నీరు లేకుండా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, తడిసిన వరి పన్నలపై లీటరు నీటిలో 20 గ్రాములు ఉప్పు కలిపి వరి పనులు మొత్తం తడిచే విధంగా పిచికారి చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వలన వరి మొలకలు రావని తెలిపారు. పరిశీలించిన వారిలో మండల వ్యవసాయ అధికారి జీ. నర్మదా, ఏఈఓలు శరత్, నరసింహారావు, రైతులు ఎల్లబోయిన నరసింహారావు, ఎల్లబోయిన వెంకటేశ్వర్లు, మండే అప్పారావు, బాలు, వీరయ్య తదితరులు ఉన్నారు.



కోల్ ఇండియాలో సింగరేణియుల హవా...

నవతెలంగాణ-కొత్తగూడెం

2023-24 కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ అండ్ బాడీబిల్డింగ్ టోర్నమెంట్లు డిసెంబర్ 4, 5, 6 తేదీలలో, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ నాగ్‌పూర్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా, సింగరేణి క్రీడాకారులు, పురుషుల పవర్ లిఫ్టింగ్‌లో 8 మంది, మహిళా పవర్ లిఫ్టింగ్‌లో ఆరుగురు, వెయిట్ లిఫ్టింగ్‌లో 10 మంది, బాడీబిల్డింగ్‌లో 9 మంది పాల్గొని, 5 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 7 కాంస్య పతకాలు, మొత్తం 20 పతకాలు సాధించి కోల్ ఇండ ఇయా లిమిటెడ్ రన్నరప్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని వెస్టన్ కోల్‌ఫీల్డ్ సీఅండ్ ఎండి. మనోజ్ కుమార్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుసిఎల్ నుండి డైరెక్టర్ (పర్సనల్) జేపీ.ద్వివేది, డైరెక్టర్ (టెక్, ఆపరేషన్స్), ఎకె. సింగ్, ఇతర అధికారులు, సింగరేణి నుండి, డివైపిఎం, పి.సుశీల్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్, కె.సాయి స్వరూప్, అసిస్టెంట్. స్పోర్ట్స్ సూపర్‌వైజర్, పి.శ్రీనివాస్, ఇతర సంస్థల క్రీడకారులు పాలుగొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) యూనిట్స్ ఆధ్వర్యంలో గురువారం ఆర్బీఎస్కె ప్రభుత్వ వైద్య బృందం వారు విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు, చర్మ, కంటి, పుట్టుకతో వచ్చిన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, పుట్టుకతో లోపాలు వ్యాధులు అభివృద్ధి ఆలస్యం, వైకల్యం కోమర ఆరోగ్య సమస్యలతో 18 సంవత్సరాల లోపు పిల్లలకు డాక్టర్ ఎం.మనోహర్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ బి.అరుణలు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులను ఉన్నతస్థాయి వైద్యం చేయించడానికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ భాను ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ తోర్తి జాన్, విలియం ప్రసాద్, లైబ్రరీయన్ ఎండి. ఖాసిం, ఏఎన్ఎం తార, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.



అధ్యాపకులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-చర్ల

ప్రతి ఒక్క అధ్యాపకుడు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్య నోడల్ అధికారిని బి.సులోచనా రాణి అన్నారు. గురువారం ఆమె చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలో వివిధ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు చేస్తున్నటువంటి ఓజేటి శిక్షణ తరగతులను ఆయా సెంటర్స్‌కి వెళ్లి స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో మంచిగా చదువుకొని రాబోయే పరీక్షలలో మంచి పలుతాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



రైతులు వ్యవసాయశాఖ సూచనలను పాటించాలి

నవతెలంగాణ-బూర్గంపాడు

రైతులు తప్పని సరిగా వ్యవసాయశాఖ సూచనలను పాటించాలని మండల వ్యవసాయ శాఖాధికారి అనిల్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పుసాక, బుడ్డగూడెం, మోరంపల్లిబంజర్, బూర్గంపాడు గ్రామాలలో వరి, మిరప, ఇతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కోత దశలో ఉన్న వరి తుఫాన్ ప్రభావంతో నేల వాలిందని, వర్షం తగ్గాక పొలం నుంచి నీటిని పూర్తిగా తీసివేసి కర్రల, ఇనుప తీగల సహాయంతో ఊతం ఇచ్చి నిలబెట్టాలని ఆయన తెలిపారు. రైతులకు తదితర సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగవైష్ణవి, ప్రేమ్, శంకర్, నాగరాజు, కృష్ణ, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

'బుటారి జోగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి'

నవతెలంగాణ-చర్ల



చర్ల మండల పరిధిలోగల కలివేరు గ్రామపంచాయతీ నందు గల రజపల్లి కాలనీ డిసెంబరు 1న జరిగిన విద్యుద్ఘాతంతో బుటారి జోగయ్య పూరి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గురువారం వారి కుటుంబాన్ని సీపీఐ(ఎం) మండల నాయకులు వెళ్లి పరామర్శించి ఇల్లు నిర్మించుకోవడానికి నాలుగు రేకులు, కట్టు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కారం నరేష్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సహాయక చర్యలు, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సకాలంలో అందించాలని, అదేవిధంగా విద్యుత్ అధికారులతో మాట్లాడి తగిన సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మచ్చా రామారావు, పొడుపుగంటి సమ్మక్క, పామర్రు బాలాజీ, బందెల చంటి స్థానిక సీపీఐ(ఎం) నాయకురాలు తాటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ-కొత్తగూడెం




మిచౌంగ్ తుఫాన్ వల్ల రాష్ట్రంలో, జిల్లాల్లో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి... రైతులు తీవ్రంగా నష్టపోయారు... పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణం రైతాంగానికి పరిహారం అందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక మంచికంటి భవన్‌లో గురువారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకేసారి కుండపోత వర్షాలు కురవడంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయని, అధికారుల లెక్క ప్రకారమే సుమారు 13 వేల ఎకరాలు నష్ట పోయాయి. కానీ ఇంకా అంత కంటే ఎక్కువగానే నష్టం వాటిల్లిందని అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నష్టాన్ని అంచనా వేయాలి కోరారు. జిల్లాల్లో వరి, పత్తి, మిర్చి, శనగ, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదే విధంగా టమాట, వంగ, బీర, బెండ తోటలు కూడా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదకు గురౌతున్నారు. కల్లాల్లో ఉన్న వరి తడిసిపోవడంతో మొలకలొచ్చే పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా కల్లాల్లో ఉన్న మిర్చి కూడా తడిసి తీవ్రంగా నష్టం వాటిల్లిందని తెలిపారు. కోత దశలో ఉన్న వరి పంట కూడా నేలరాలి దెబ్బతిన్నదని రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాన్ని తక్షణం అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వర్ష ప్రభావం ఉందని, వర్షాల వల్ల మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. దెబ్బ తిన్న రోడ్లు, చెక్ డ్యాంల మరమ్మతులు చేయించాలని, వాతావరణం మార్పు వలన ప్రజలకి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, వైద్య సదుపాయాలు మెరుగుపరిచి ప్రజలను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కార్యదర్శి వర్గ సభ్యులు ఏజే.రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, యం.జ్యోతి, ఎంబి.నర్సారెడ్డి, కె.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కె.ధర్మ, కొండపల్లి శ్రీధర్, నభి, రేపాకుల శ్రీను, వంశీ, వీర్ల రమేష్, అర్జున్, భూక్యా రమేష్, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహము లేదు.. ఊరేగింపు లేదు...

- భద్రాచలంలో నెలకొన్న రాజకీయ నిశ్శబ్దం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



సాధారణ ఎన్నికల నోటిఫికేషన్‌కి మూడు నెలల ముందు నుండే భద్రాచలం నియోజకవర్గం చేరికలు ఫిరాయింపులతో పాటు అధినాయకుల పర్యటనలు సమీక్షలు బలనిరూపణలతో దద్దరిల్లిన భద్రాచల రాజకీయ వాతావరణంలో మూడో తారీకు ఫలితాలు అనంతరం ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ స్థానికంగా ఓటమి పాలైతే బీఆర్ఎస్ పార్టీ స్థానికంగా గెలిచి అధికారం కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు ప్రధాన పార్టీలో ఏ ఒక్కరికి పూర్తి సంతృప్తికరమైన ఫలితాలు రాకపోవడంతో ఇరు పార్టీలలో తీవ్ర నిరాశలు నెలకొన్నాయి. దీనికి తోడు బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ గూటికి చేరటం ఖాయమని సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో తను పార్టీ మారటం లేదని కార్యకర్తలకు అభయం ఇచ్చేందుకు తెల్ల వెంకట్రావు నాన్న అవస్థలు పడ్డ విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే అనూహ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10లో 9 సీట్లు గెలిచిన భద్రాచలం సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఆ లోటును పూడ్చేందుకు ఓటమిపాలైన పోదెం వీరయ్యకు ఎమ్మెల్సీ ఇస్తారని జోరుగా ప్రచారం నడిచినప్పటికీ అది కేవలం ప్రచారంగానే మిగిలిపోయిందె తప్ప కార్యరూపం దాల్చలేదు. గురువారం కొలువుతీరిన నూతన ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాకే మూడు మంత్రి పదవులు రావడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4 సీట్లు గెలిచిన అపటికి మొండిచేయి మిగిలింది. జిల్లాలో గెలిచిన ఎమ్మెల్యేలకే దిక్కు లేకపోతే ఓడిన పొదెం వీరయ్యకు నామినేటెడ్ పదవి వస్తుందా అన్నది ఇప్పుడు ప్రశ్నగా మిగిలింది. రాష్ట్రం ఏర్పడ్డ నుండి అనేక రకాల వివక్షకు గురైన భద్రాచలం నియోజకవర్గం మరోసారి వెనుకబాటు తప్పదని స్పష్టమవుతుంది. భద్రాచలంలో గులాబీ జెండా ఎగరేయాలి అన్న కసితో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవడంతో ఇక్కడ గెలిచిన సాధించేది ఏమీ లేదన్న నిరుత్సాహంలో ప్రధాన నాయకత్వం సైతం ఇండ్లకే పరిమితం కాగా రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటికీ సిట్టింగ్ స్థానం కోల్పోవడంతో కాంగ్రెస్ శ్రేణులు నిరుత్సాహానికి గురై ఓటమికి నువ్వంటే నువ్వే కారణమని సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఏదైనాప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి భద్రాచలంలో ఒడటం... భద్రాచలంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపొంది అధికారం కోల్పోవడంతో భద్రాచలంలో ఎటువంటి ఉత్సవం గానీ ఊరేగింపులు గాని లేక రాజకీయ నిశ్శబ్దం నెలకొన్నది.



కృంగిన పెనుబల్లి బ్రిడ్జిని పరిశీలించిన చైర్పర్సన్

- తాత్కాలిక పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపల్ పరిధిశివారులోని పాత కొత్తగూడెంలో కొత్తగూడెం మున్సిపాలిటీ పెనుబల్లి పంచాయతీ పరిధిలో గల పెనుబల్లి బ్రిడ్జి తుఫాన్ వర్షం కారణంగా కృంగిపోయింది. గురువారం కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి సంఘటన స్థలానికి కౌన్సిలర్లతో కలిసి చేరుకొని పరిశీలించారు. తాత్కాలిక మరమ్మత్తులు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన అవసరం ఉందని ఫోన్ ద్వారా అధికారులను కోరారు. అవసరమైతే కాలినడకన మాత్రమే వెళ్లాలని వాహనాలు, ఎండ్లబండ్లు, బ్రిడ్జిపై నుండి నడపవద్దని ప్రజలను కోరారు. ఎన్నికల ముందు కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హై లెవెల్ నూతన బ్రిడ్జికి శంకుస్థాపన చేయడం జరిగిందని దాన్ని ఇటువంటి పరిస్థితులలో వెంటనే బ్రిడ్జి పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ పరమేష్ యాదవ్, ధర్మరాజు, బండి నరసింహ, రుక్మేందర్ బండారి, బిఆర్ఎస్ నాయకులు ఎంఏ.రజాక్, యూసుఫ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు నిర్వహించాలి

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేనికి కౌన్సిల్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సిబ్బంది, అధికారులు సమన్వయంతో పనులు నిర్వహించాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంకి ఎలా సహకరించారో అదే విధంగా ఈ ప్రభుత్వానికి సహకరించాలని కొత్తగూడెం మునిసిపల్ చైర్మెన్ కాపు సీతాలక్ష్మీ అన్నారు. గురురవాం మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ సజావుగా నిర్వహించినందుకు మునిసిపల్ కమిషనర్‌ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా ఆశీర్వాదంతో గెలుపొందిన కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుకి శుభాకాంక్షలు తెలిపారు. వారి సలహాలు సూచనలు తీసుకుంటూ కొత్తగూడెం మునిసిపాలిటీ అభివృద్ధి కోసం నిరంతరాయంగా కృషి చేస్తామని, అధికారులు అందరూ గత ప్రభుత్వంలో ఏ రకంగా సహకరించారో, ప్రస్తుత ప్రభుత్వంలో కూడా అదే విధమైన సహకారాన్ని అందిస్తూ విధులు నిర్వహించాలని కోరారు. పారిశుద్ధ్య విభాగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రెండు రోజులుగా భారీ వర్షం కారణంగా ఎక్కడికక్కడ నిలిచిపోయిన మురికి కాలువలను శుభ్రపరిచి, ప్రతి వార్డులలో బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించి, జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రఘు, డిప్యూటీ ఇంజనీర్ రవి, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

నవతెలంగాణ-కొత్తగూడెం

సింగరేణిలో ఈనెల 27న నిర్వహించనున్న గుర్తింపు యూనియన్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం అధికారుల సమీక్ష సమావేశం నిరహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయ జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి ఛాంబర్ నందు ఈ నెల 27వ తేదీన కొత్తగూడెం రీజియన్ నందు గల కార్పోరేట్, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ఏరియాలలో సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల నిర్వహణ కొరకు చేయవలసిన ఏర్పాట్ల గురించి జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సి కె.బసవయ్య లక్ష్మీదేవిపల్లి తహశీల్దార్ కేఆర్‌వికే. ప్రసాద్‌తో చర్చించారు. ఈ సందర్భంగా జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్‌ఆర్‌సి బసవయ్య మాట్లాడారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలో యూనియన్ ఎన్నికలు సుజావుగా నిర్వహించేందుకు 24 పోలింగ్ బూతులు, 72 పోలింగ్ బాక్సులు అవసరమని తెలియజేశారు. అందుకుగాను ఎన్నికల నిర్వహణ కోసం 124 మంది సిబ్బంది (ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ ఆఫీసర్లు) ఓట్ల లెక్కింపు కొరకు 57 మంది సిబ్బందిని (కౌంటింగ్ సుపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లు) కేటాయించాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో ఏజీఎం (పర్సనల్) కె. శ్రీనివాస రావు, లక్ష్మీదేవిపల్లి తహశీల్దార్ కేఆర్‌వికే. ప్రసాద్, డిజీఎం (పర్సనల్)లు పి.వేణుగోపాల్ రావు, వైవిఎల్ వరప్రసాద్, డిజిఎం(ఐటి) హరిశంకర్, సీనియర్ పిఓ జికే.కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- కార్మికుల హక్కులు, ప్రయోజనాల సాధనకు సంస్థను నిద్రపోనివ్వం
- పోరాట పటిమతో పనిచేద్దాం
- టీబీజీకేఎస్ నాయకులకు సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత దిశానిర్దేశం

నవతెలంగాణ-ఇల్లందు



సింగరేణి సంస్థ పురోగమనానికి టీబీజీకేఎస్ గెలుపు చాలా అవసరమని, సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, ప్రయోజనాల సాధనకు సంస్థను నిద్రపోనివ్వబోమని సింగరేణి అంటే సింహ గర్జన అని, అదే స్ఫూర్తితో పనిచేస్తూ సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సింగరేణి సంస్థ ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ సంఘం నాయకులు, ముఖ్య కార్యకర్తలు గురువారం హైదరాబాద్ లో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో బొగ్గు గని కార్మికులు ప్రధాన భూమిక పోషించారని, సింగరేణి కార్మికులకు ఉన్న పోరాట స్ఫూర్తి జాతీయ సంఘాలకు లేదని స్పష్టం చేశారు. గనుల్లో కార్మికులు చేస్తున్న కష్టం, చిందిస్తున్న చెమట తెలంగాణలో వెలుగులు నింపుతోందని, కాబట్టి ధైర్యంగా పోరాటం చేయాలని దిశానిర్దేశం చేశారు. అధికారం ఉన్నా లేకున్నా తెలంగాణ కోసం పోరాటం చేసి సాధించామని, ఈ సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేస్తామనడంలో ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో ఒక్కొక్కరు ఒక్కో కేసీఆర్ లా పనిచేయాలని అన్నారు. మ్యానిఫెస్టో కమిటీని ఏర్పాటు చేస్తామని, అతిత్వరలో తమ సంఘం మ్యానిఫెస్టోను విడుదల చేస్తుందని ప్రకటించారు. ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ వంటి జాతీయ సంఘాలు సింగరేణి హక్కులను ఏనాడూ కాపాడలేదని, భవిష్యత్తులోనూ సంఘాలను సింగరేణి ఎదుగుదల కోసం ఏమీ చేయలేవని విమర్శించారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉండగా ఒక్క సమ్మె కూడా చేసే అవసరం లేకుండా అన్ని పనులను సాధించి పెట్టామని తెలిపారు. సింగరేణి అంటే తమకు ప్రాధాన్యత ఉందని, కానీ కాంగ్రెస్ ప్రాధాన్యతల్లో సింగరేణి, ఆ సంస్థ కార్మికులు లేరని తేల్చిచెప్పారు. ఏ అధికారం లేనప్పుడే తెలంగాణ సాధించామని, అలాంటిది కార్మికుల హక్కులు, ప్రయోజనాలు సాధించడానికి సింగరేణి సంస్థ యాజమన్యాన్ని నిద్రపోనివ్వబోమని స్పష్టం చేశారు. తమకు పోరాటాలు కొత్తకాదని, కార్మికుల హక్కులను సాధించే వరకు విశ్రమించబోమని, కార్మికుల పక్షాన ప్రతి నిత్యం నిలబడి ఉంటామని పునరుద్ఘాటించారు.



కల్పవృక్ష నారసింహ సాల ఆశ్రమ ప్రారంభోత్సవ వేడుకలు

గ్రామ మూర్తికి పట్టు వస్త్రాలు సమర్పించిన నృసింహభక్త బృందం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం కల్పవృక్ష సాలగ్రామ ఆశ్రమ ప్రారంభోత్సవ వేడుకలలో భాగంగా భద్రాచలం పురవీధులలో మేళ తాళాలతో ఊరేగింపుగా కరీంనగర్ నుండి వచ్చిన భక్త బృందం కల్పవృక్ష నారసింహ సాలగ్రామమూర్తికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగినది. హైదరాబాద్ కు చెందిన నృసింహ భజన బృందం వారు కల్పవృక్ష నారసింహ మూర్తికి కల్పవృక్షం పీఠాన్ని అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ భద్రాద్రి పుణ్యక్షేత్రంలో గోవుని గోవిందున్ని ఏకకాలంలో దర్శించి తరించాలనే సంకల్పంతో గో గోవింద కల్పవృక్ష నారసింహ సాలగ్రామ ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినదని అలానే గత 750 సంవత్సరాల నుండి తరతరాలుగా పూజలందుకుంటూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఉన్న కల్పవృక్ష నారసింహ సాలగ్రామాన్ని భక్తుల సందర్శనార్థం ఉంచనున్నట్లు తెలియజేశారు. నిజంగా మన భద్రగిరిలో ఇంత చక్కని ఆశ్రమం నిర్మాణం చేయడం ఎంతో ఆనందదాయకమని భద్రాద్రి వాసులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. భక్తులు భజనలు కీర్తనలతో భద్రాద్రి పురవీధులన్నీ పులకించేలా తన్మయత్వంతో వచ్చి ఎంతో ఆనందంగా స్వామివారికి జరిగే విశేష పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి, శ్రీధర్ స్వామి, నృసింహ భక్త కుటుంబ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యంత్రిగా భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా గురువారం లక్ష్మీదేవిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బాణసంచాకాల్చి, మిఠాయిలు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పూణెం శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెక్రెటరీ గౌస్ భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, సర్పంచులు బండా వెంకటేశ్వర్లు, చింతా రమేష్, ఉప సర్పంచ్ తాటి బాలకృష్ణ, నరసింహారావు, కొంపల్లి వీరయ్య, ఉప్పల హేమంత్, జీడి మహేష్, దేవేందర్, కేవీ రెడ్డి, రావు కిరణ్, సూరిబాబు, అంతడుపుల కృష్ణ, షబ్బీర్ భాయ్, ఉబ్బని రాజు, తుంపిరి జ్ఞాని ముత్యం, కడియాల సత్యనారాయణ, మలోత్ లక్ష్మణ్, బొమ్మగని భాస్కర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం పట్ల హర్షం

నవతెలంగాణ-అశ్వాపురం



తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా గురువారం ఎనముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చినందుకు కృజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి షరీఫ్, పొడియం అనిల్ కుమార్, మూర్వినేని చంద్రకళ, బొబ్బాల నాగేశ్వరరావు, వలబోజు మురళీకృష్ణ, సంతపురి సతీష్ కుమార్, గొల్లపల్లి నరేష్, దొసపాటి చింటు, అక్కినపల్లి రమేష్, జోగి రాజు, దాసరి భిక్షమయ్య, వరప్రసాద్, భూక్యా సాయికిరణ్, శశి పాల్గొన్నారు.



పాల్వంచ : రాష్ట్ర ముఖ్య మంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పాల్వంచలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున కార్యకర్తల సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయితే గంగాధర్, జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు ఎస్సీ జలీల్ కాంగ్రెస్ నాయకులు విజయ్, సోమయ్య, రాంబాబు, లక్ష్మారెడ్డి, సుజాత, రాంబాబు, సూర్య కిరణ్, హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద ప్రత్యేక వైద్య శిబిరం

నవతెలంగాణ-చంద్రుగొండ



చంద్రుగొండ మండల పరిధిలోని ఇంద్రానగర్‌లోని డబల్ బెడ్ రూమ్ ల వద్ద మండల వైద్య అధికారిని డాక్టర్ కనకం తనూజా ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడ ఉన్న 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ కనకం తనూజా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఇమామ్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, ఏఎన్ఎం రమణమ్మ, పంచాయతీ గుమస్తా సారయ్య, ఆశాలు కుమారి, పుణ్యవతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుల సేవలు ఎంతో అమూల్యమైనవి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

నవతెలంగాణ-పాల్వంచ



దేశ ప్రజల సంరక్షణలో సైనికుల సేవలు ఎంతో అమూల్యమైనవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఫ్లాగ్ డేని పురస్కరించుకుని సైనుకులకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మాజీ సైనికులు ఐడిఓసి ఐడివోసీలోని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1949 సంవత్సరం నుండి దేశాన్ని కాపాడేందుకు వీరమరణం పొందిన, పోరాటాన్ని కొనసాగించిన అమరవీరులు, విధి నిర్వహణలో సిబ్బంది ఉన్న గౌరవించటానికి డిసెంబర్ 7వ తేదీని దేశవ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవంగా పాటిస్తున్నామని చెప్పారు. సైనికులు దేశం గొప్ప ఆస్తులలో ఒకరని వారి సేవలకు సెల్యూట్ అన్నారు. సైనికులు దేశ సంరక్షకులని, ప్రజలను కాపాడటానికి తమ ప్రాణాలను సైతం తృణప్రాయం చేస్తారని చెప్పారు. సైనికులు తమ జీవితంలో ఎన్నో త్యాగాలు చేశారని, మాతృభూమి సేవలో తమ ప్రాణాలను అర్పించిన అమర వీరులకు మనం ఎప్పటికీ రుణపడి ఉండాలని చెప్పారు. విధులు నిర్వహణలో త్యాగంలో కీలక పాత్ర పోషించిన వారి కుటుంబాల పట్ల కూడా మన అభిమానాన్ని చాటుకోవడం మన కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

మిచౌంగ్ తుపాన్ బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



అశ్వారావుపేట

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను నూతన ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో తుపాను తాకిడి గురైన పంట చేలు పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల పరిధిలోని తుఫాన్ తాకిడికి గురైన పలు వరి, మొక్కజొన్న, వేరుశనగ పంట చేలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారమే వరి 500, వేరుశనగ 800, పత్తి 150, మొక్కజొన్న 150 ఎకరాల్లో పంటలు తుపాను తాకిడికి గురైనట్లు ప్రాధమిక అంచనాలు వేసినట్లు తెలుస్తుందన్నారు. ఈ పంటలు అన్నింటినీ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, ప్రజాప్రతినిధులు సందర్శించి రైతులకు భరోసా ఇవ్వాలని అన్నారు. చేతికందిన పంట వొన్ను కాకపోగా లక్షల పెట్టుబడి, రైతు కుటుంబ సభ్యుల కాయకష్టం ఒక్క తుఫాన్ కొట్టుకుని పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి మనో వేదనలో ఉన్నారని వాపోయారు. సన్న చిన్న కారు రైతులను ఆదుకుని, ప్రత్యామ్నాయ పంటలు సాగుకు ప్రభుత్వం చేయూతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు చిరంజీవి, మండల నాయకులు సొడెం ప్రసాద్, తగరం జగన్నాథం, కలాపాల భద్రం తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మిచౌంగ్ తుపాను ప్రభావంతో దుమ్ముగూడెం మండల వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆ రైతులను కేంద్ర, నూతన రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మాజీ డిసిసిబి చైర్మెన్, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్ కోరారు. తుఫాన్ తీవ్రత దృశ్య మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాన్



అన్నపురెడ్డిపల్లి

ప్రభావంతో నష్టపోయిన పంటలను గురువారం మారాయి గూడెం, బీమవరం గ్రామాలలో రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వలన పత్తి చేలు, వరి చేలు తడిసిపోయి భారీగా నష్టం వాటిల్లిందన్నారు. ఎకరానికి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. పంట పొలాలను పరిశీలించిన వారిలో సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి. కారం పుల్లయ్య, జిల్లా కమిటి సభ్యులు యలమంచిలి వంశీ కృష్ణ, మర్మం చంద్రయ్య, మారాయిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ తొడం తిరుపతిరావురావు, స్థానిక రైతులు ఆప్కా రామకృష్ణ, అర్జున్, కారం శ్రీరాములు, సోడి రమణ వెంకమ్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ : మిగ్‌జాం తుఫాన్ వల్ల రాష్ట్రంలో అనేక జిల్లాల్లో చేతికొచ్చిన పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణం రైతాంగానికి పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఎలమంచిలి వంశీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం పంట పొలాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ఒకేసారి 18 సెంటి మీటర్లకుపైగా వర్షం కురవడంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాల్లో



పాల్వంచ

వరి, పత్తి, మిర్చి, శనగ, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదే విధంగా టమాట, వంగ, బీర, బెండ తోటలు కూడా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదకు గురౌతున్నారు. కల్లాల్లో ఉన్న వరి తడిసిపోవడంతో మొలకలొచ్చే పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా కల్లాల్లో ఉన్న మిర్చి కూడా తడిసి తీవ్రంగా నష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి పంట కూడా నేలరాలి దెబ్బతిన్నది. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాన్ని తక్షణం అంచనా వేసి నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ.20,000, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.40,000లు చెల్లించాలిని కోరారు. వర్షాల వల్ల మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ములకలపల్లి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో కురిసిన అకాలవర్షం వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు పేటేటి నర్సింహారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలో పలు గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశెనగ పంటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులు అంచనా వేసి పంటనష్టం నివేదికను ఉన్నతాధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.జబ్బార్, రాంబాబు, జాహీర్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి : చుంచుపల్లి మండంలో అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ శ్రేణులతో కలిసి మండల పరిధిలోని ములుగుగూడెం, అంబేడ్కర్ నగర్, రాంపూర్ గ్రామాల్లో పర్యటించి అకాల వర్షాలను నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు తక్షణమే పంట నష్టపోయిన రైతులను కలిసి వివరాలను తెలుసుకొని నష్టపరిహారం అదే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాలంగా కురిసిన ఈ వర్షం వలన పంట చేతికి వచ్చే సమయంలో ఒక్కసారిగా తుఫాన్ తాకిడికి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని అన్నారు. రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అమర్లపుడి అజయ్, పులిచర్ల వెంకటేశ్వర్లు, వేముల మరేశ్వరారావు, వంగా చెన్నరావు, చిల్లపల్లి వెంకటేశ్వర రావు, దోమందుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : గత నాలుగు రోజులుగా మిచౌంగ్ తుఫాను వలన ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల మూలంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడారు. జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం పండించిన మిర్చి పంట, వరి ధాన్యం, పత్తి పంట నీట మునిగి తీరని నష్టాన్ని మిగిల్చాయన్నారు. మిర్చి తోటలు మొత్తం నేలకు వరిగి చచ్చిపోతున్నాయన్నారు. కోతకు వచ్చిన వరి ధాన్యం తడిసి మొక్కలు ఎత్తుతున్నాయన్నారు. రైతాంగం కోట్లాది రూపాయలు అప్పులు చేసి వ్యవసాయానికి పెట్టుబడి పెట్టి సేద్యం చేస్తున్నారన్నారు. పంట చేతకొచ్చే క్రమంలో తుఫాను రూపంలో అకాల వర్షాలు రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని తెలిపారు. రైతాంగం ఆవేదనతో ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందని, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే ప్రభుత్వ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. వ్యవసాయశాఖ వారిని ఉద్యానవన శాఖ వారిని అప్రమత్తం చేయాలని కోరారు. అధికార యంత్రాంగాన్ని గ్రామాలలో పంట నష్టం సర్వేలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్, జిల్లా అధ్యక్షులు బట్టు ప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు, ఎట్టి నరసింహారావు, కల్తి వెంకటేశ్వర్లు పోలారం సర్పంచ్ సౌరాటక్క, డివిజన్ నాయకులు మోతుక్కారి మల్లికార్జునరావు కొండపానేని సత్యనారాయణ పాల్గొన్నారు.



దుమ్ముగూడెం

దుమ్ముగూడెం : బంగాళాఖాతంలోని అల్పపీడన ధోరణితో ఏర్పడిన తుఫాన్ వలన మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనేక మంది రైతుల పంటలు తీవ్రంగా నష్టపోయారని రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షులు కంచర్ల సింహాద్రి గురువారం ఒక ప్రకటనలో కోరారు. వరి పంటలు, మిర్చి పంటలు, పత్తి పంటలు, మొక్కజొన్న పంటలు చేతికి అందిన వేళ ఈ విపత్తు జరగడం రైతులు



ములకలపల్లి

జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. ఆరుగాలం కష్టపడి చేతికిందన పంట నీటి పాలైతే వారి బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. బహుజన సమాజ్ పార్టీ సెక్టార్ అధ్యక్షులు వర్షా ప్రసాద్‌తో పాటు పార్టీ నాయకులను వర్షాల వలన జరిగిన పంట నష్టాలను అడిగి తెలుసుకున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వర్షం విపత్తు నుండి రైతులను వెంటనే ఆదుకొని వారికి తగిన పంట నష్టపరిహారం ఇవ్వాలని అలాగే పండించిన పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



చంద్రుగొండ

చంద్రుగొండ : తుఫాను వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఐలూరు రామరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా (తుఫాన్) వర్షాలకు మండలంలో దెబ్బతిన్న వరి, పత్తి, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్‌రెడ్డి మాట్లాడుతూ వర్షం కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఫలితంగా మండల రైతాంగం తీవ్రంగా నష్టానికి గురైనారు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి పంటలను పరిశీలించి సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. పత్తి, మిరప, పంటలకు ఎకరానికి 40 వేల రూపాయలు చొప్పున వరి పంటకు 30 వేల రూపాయలు చొప్పున పంట నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, అబ్దుల్ రెహ్మాన్, బాలికుంట గ్రామ శాఖకార్యదర్శి చల్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : అకాల తుఫానుతో మండలంలో చేతికి వచ్చిన వరి పంట నీట మునిగి రైతుకు ఎంతో నష్టం జరగాలో అంత నష్టం జరిగిందని మండల రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామానికి చెందిన ఓ సన్నకారు రైతు నన్నపనేని రామారావు తనకున్న రెండు ఎకరాలు రెండు రోజుల్లో కోత కొసుకొని పంట అమ్ముకుందాము అనుకున్న సమయంలో తుఫాన్ రావడంతో వరి పంట అంత నేలమట్టం అయి నీట మునిగింది. అదే కాకుండా మరి మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని అన్ని పెట్టుబడులు పెట్టి చేతికి వచ్చిన పంట అంత నీటి పాలు అయ్యింది అని, రెండు రోజులు కురిసిన వర్షంతో పంట పంత నేలపాలైందని, కనీసం ఖర్చులు కూడా రావు అని ప్రభుత్వం తరుపున నుండి నష్టపరిహారం వచ్చేలా అధికారులు చూడాలని కోరుకుంటున్నారు.

పాల్వంచ : జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సమగ్ర సర్వే నిర్వహించి జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం వ్యవసాయ అధకారులను కోరారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాలలో వర్షాలకు దెబ్బతిన్న మిరప, పత్తి, వరి పొలాలను సీపీఐ ప్రతినిధి బందం సందర్శించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫోన్ ద్వారా వ్యవసాయ అధికారులుకు సమస్యను వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన గిరిజన, గిరిజనేతర పేద రైతులు గుండె నిబ్బరం కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసి జరిగిన నష్టంపై సర్వే చేపట్టి తగు నివేదికని ప్రభుత్వానికి అందించడం ద్వారా నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చొరవ తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కోటి నాగేశ్వరరావు, జకరయ్య తదితులు పాల్గొన్నారు.

లీడర్లు అంత కారులోనే...

- ఓట్లు అన్ని హస్తానికే
- జారే రాక కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండలంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ చూపించి మండలంలో రికార్డు సృష్టించారు ఓటర్లు. మండల పరిధిలోని అన్ని గ్రామల్లో బడా లీడర్లు అంత బీఆర్ఎస్ పార్టీలో వున్నారు. ఓటర్లు కూడా వారి వెంటే వున్నట్లుగా బలంగా నమ్మించారు. అయిన ఎదో సామెతలా అందరూ జంజెం వారే అయిన కోళ్ళ మాయామైయినాయి అన్న చందంగా అందరూ కారు గుర్తుకు ఓటు అంటూ కారు గుర్తును కనుమరుగు చేసి కాంగ్రెస్ పార్టీకి మండలంలో భారీ మెజారిటీ చూపించారు. మండలంలో బి క్లాస్ లీడర్లు మాత్రమే కాంగ్రెస్‌లో ఉన్నారు. వారు కూడా ప్రజల్లోకి ఎలా వెళ్ళాలి అని ఆలోచనలో ఉండటం 10 సంవత్సరాలు అధికార పార్టీ ఒక వైపు ఉండటం గ్రామాల్లో ధన బలం గల లీడర్లు ఉండటంతో కాంగ్రెస్ ప్రచారం ఎలా చేయాలో తెలియని పరిస్థితుల్లో చోట లీడర్లు ఉండటంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో ఆందోళన చెందారు. అదే సమయంలో మండల ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఒక గ్రామంలో ఏకంగా మాజీ శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరావు వచ్చినప్పుడు మా కాలనీలో ప్రత్యేకంగా ఒక పెట్టే పెట్టండి ఓట్లు అన్ని మీకే గుద్దుతాము మా ఓట్లు అన్ని కారు గుర్తుకు పడతాయి అని చెప్పిన దగ్గర కూడా హస్తం గుర్తు హవా కనపడటంతో అసలు ఏమి జరిగింది అని బీఆర్ఎస్ లీడర్లు అయోమయంలో పడ్డారు. ఒక దశలో అసలు కొన్ని కాలనీలో దళిత బంధు ప్రభావం ఎక్కువగా ఉంది అని కాంగ్రెస్ పార్టీ లీడర్లు ఆ కాలనికి వెళ్ళే అవకాశం లేదని భావించిన బీఆర్ఎస్ లీడర్లుకు ఓటును తారు మారు చేసి హస్తం హవా చూపించారు. మరి కొంతమంది అయితే అటు ఇటు దాగుడుమూతలు దండకొరు అంటూ బీఆర్ఎస్ కండువాలు వేసుకొని కాంగ్రెస్ కండువాలు వేసుకొని గెలిచిన తరువాత కాంగ్రెస్ సంబరాల్లో కనిపించి బీఆర్ఎస్ లీడర్లను మోసం చేశారని కొందరు నాయుకులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎది ఏమైనా మేజర్



పంచాయితీల్లో లీడర్లు అంత కారులో ఉంటే హస్తం వైపు చిన్న చిన్న లీడర్లు ఉన్న ప్రజలు మాత్రం హస్తం గుర్తుకు ఓటు వేసి మండలంలో ఊహించని తీర్పు ఇచ్చి జారే అదినారాయణకి మేము అండగా ఉన్నాము అంటూ మెజార్టీ చూపించి అయనకు విజయాన్ని అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మండలంలో అయన రాక కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా విజయోత్సవాలు కోసం ఎదురుచూస్తున్నారు.

కొమరం వెంకటేశ్వర్లు మరణం సీపీఐ(ఎం)కి తీరని లోటు



- రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని పాత నారాయణరావుపేట గ్రామానికి చెందిన సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు కొమరం వెంకటేశ్వర్లు(52) మృతి వారి కుటుంబానికి, సీపీఐ(ఎం)కి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. పొలం పనులకు వెళుతూ హఠాత్తుగా మృతి చెందిన కొమరం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాల్లో ముందుండి పనిచేసిన నాయకుడు అని అయన సేవలు గుర్తుచేశారు. పోడు భూముల పోరాటాలలో తునికాకు బోనస్ కట్ట రేటు పెంచాలని, ఇంకా అనేక ఉద్యమాల్లో పోరాడిన మహా నాయకుడని తెలిపారు. కొమరం వెంకటేశ్వర్లు కుటుంబానికి సాయం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, భద్రాచలం నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య, మండల కమిటీ సభ్యులు కూరం వీరభద్రం, సరియం ప్రసాద్, తోడం తిరుపతిరావు, పెనుబలి ప్రసాద్, కొమరం వీర్రాజ, సొంది అర్జున్, ఉయిక వీరభద్రం, వాసం రాజులు, మడివి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | డిసెంబర్ 08, 2023 | www.navatelangana.com



మహిళ నైపుణ్యం ఉచిత శిబిరం ప్రారంభం

నవతెలంగాణ- టేకులపల్లి

టేకులపల్లి మండలంలోని సులానగర్ గ్రామపంచాయతీలో ఉచిత మహిళ నైపుణ్య శిబిరం గురువారం బ్రిట్ కాన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఉపాధి పొందుటకు చేతివృత్తుల శిక్షణ కేంద్రాలుఉపయోగపడతాయన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు ఉపయోగించుకో వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రీ ట్ కాన్ సిబ్బంది, సులానగర్ పంచాయితీ ఉప సర్పంచ్. బసవయ్య రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తుఫాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ- టేకులపల్లి

గత రెండు రోజులుగా కురుస్తున్న తుఫాను వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి.వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎట్టి నరసింహారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తుఫాను వలన నేలమట్టమైన పత్తి, మిరప, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించామన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారంగా ఎకరానికి 50,000 చెల్లించాలని కోరారు. తక్షణమే నూతన ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామచందర్, వినోదు, రమేష్, పొట్టయ్య లక్ష్మి, ఇరానీ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే ఇల్లందులో కాంగ్రెస్ గెలుపు

నవతెలంగాణ- టేకులపల్లి



సమిష్టి కృషితోనే ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిందని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు గుగులోతు రామచందర్ గురువారం అభిప్రాయపడ్డారు. ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య గెలుపుకు సహకరించిన పార్టీ కార్యకర్తలకు, మిత్రపక్షల నాయకులకు, మహిళా, విద్యార్థి, యువజన కార్మిక, ఆదరించిన అన్ని వర్గాల ప్రజలకు విప్లవ అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన మండల నాయకులు అయిత శ్రీరాములు, ఎజ్జు భాస్కర్, గుగులోతు శ్రీను, వాసం భద్రయ్య ,బానోతు వీరన్న, తేజావత్ లక్ష్మణ్ ,ఇస్లావత్ రవీందర్, తేజావత్ మధు ,వి సతీష్ ,ఈసం నరేష్ ,వాసం నరేందర్, చింత కోటి, ఈసం కృష్ణ, చింత కన్నయ్య, గుగులోతు సోనీ, అరుణ, భారతి ,విజయ ,మణి ,సుగుణ, దేవమ్మ శ్రావణి, సంధ్యలు కృతజ్ఞతలు తెలిపారు.



కరాటేలో జాతీయస్థాయికి బాల భారతి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-తల్లాడ

డిసెంబర్ 5 నుండి ఏడు వరకు నల్గొండ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ స్టేట్ స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో తల్లాడ బాల భారతి విద్యాలయం చెందిన కంటికి నికిత రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి గోల్డ్ మెడల్ సాధించారు. జాతీయ స్థాయికి ఎంపిక అయింది. మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్, కెఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, కరాటే మాస్టర్ బాబు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు నిఖిత ను అభినందించారు.



తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-కారేపల్లి

తుఫాన్‌తో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ డిమాండ్ చేశారు. గురువారం కారేపల్లి మండలం పేరుపల్లిలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ నేత ప్రకాశ్ మాట్లాడుతూ రూ.లక్షలాది పెట్టుబడి పెట్టిన రైతులకు పంట చేతికొచ్చిన తర్వాత తుఫాన్ తీరన వేదనను నింపిందన్నారు. రైతులు మనోధైర్యం చెడకుండా వెంటనే కొత్త ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులను ఆదుకోవటానికి ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పండించిన పంటలకు పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కే.శ్రీనివాసరెడ్డి, అలెం చంద్రయ్య, గురవయ్య, వై.జానకి, సంపత్, సుగుణ, వెంకన్న, బైరుమళ్ల లక్ష్మయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు తుఫాన్ తాకిడికి గురైన పంటలను పరిశీలించనున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ - అశ్వారావుపేట

శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఇటీవలే మీచౌంగ్ తుపాన్ తాకిడికి గురైన పంటలను పరిశీలించనున్నట్లు ఆయన కార్యాలయం నుండి గురువారం ప్రకటన విడుదల చేసారు. శుక్రవారం ఉదయం 09:30 గంటలకు దమ్మపేట మండలం పేరంటాల చెరువు అలుగు పరిశీలిస్తారు,10 గంటలకు మల్కారం లో పంట నష్టపోయిన బాధిత రైతులను పరామర్శిస్తారు. ఉదయం 10:35 గంటలకు అశ్వారావుపేట మండలం ఉట్లపల్లి లో పంట నష్టపోయిన రైతులను ఓదార్చుతారు. ఈ కార్యక్రమానికి రెండు మండలాల బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు అయి విజయవంతం చేయాలని కోరారు.

డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన దంతోజు నవీన్ కుమార్

నవతెలంగాణ- టేకులపల్లి



తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బాధ్యతలు స్వీకరించిన మల్లు భట్టి విక్రమార్కను గురువారం ఇల్లందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, భట్టి యువసేన ప్రెసిడెంట్ దంతోజు నవీన్ కుమార్ హైదరాబాద్ బంజారాహిల్స్ లోని భట్టి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు. హైదరాబాద్ ఎల్.బి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల. రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి , దూదిళ్ళ శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనరసింహ, కొండా సురేఖ, ధనసిరి అనసూర్య సీతక్క, జూపల్లి కృష్ణారావు ప్రమాణస్వీకార మహెూత్సవంలో టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూక్య దేవా నాయక్ లు పాల్గొన్నట్లు వేరువేరు ప్రకటనలో తెలిపారు.

రైతులకు పంటనష్ట పరిహారం ఇవ్వాలి

నవతెలంగాణ-దమ్మపేట



తుఫాను వల్ల దెబ్బతిన్న పంటల నష్టాన్ని సర్వే చేయించి అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం దమ్మపేట మండల కమిటీ డిమాండ్‌చేసింది. మండలంలో తుఫాన్ దాటికి దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించి మాట్లాడుతూ.. తుఫాన్ వలన రాష్ట్రంలో అనేక జిల్లాల్లో మండలాల్లో చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. దమ్మపేట మండలంలోని రైతాంగం తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయారు. మండలంలో ఒకేసారి 20 నుండి 30 సెంటీమీటర్లు పైగా వర్షం కురవడంతో చేతికొచ్చిన వేరుశనగ సీడ్, మొక్కజొన్న, అరటి తోటలు, వరి, పత్తి, మిర్చి పంటలు దెబ్బ తినడంతో మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా వరి పంట కోతకొచ్చి నేత మునిగి కుళ్ళిపోతున్నది. కోసిన వరి పంట ధాన్యం కళ్ళల్లో రోడ్లపైన ఆరబెట్టినవి తడిసిపోయి మొక్కలు వస్తున్నాయి. అరటి తోటలో విరిగిపడిపోయినవి, వర్జీనియా పొగాకు తోటలో ఇసుక మ్యాటర్ వేసి నీటి ముంపు వేసి పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ మండలంలో సీడు మొక్కజొన్న వేలాది ఎకరాల్లో భారీ వర్షానికి గాలికి చాప చుట్టినట్టు కింద పడిపోయింది. ఈ తుఫాను వల్ల నష్టపోయిన అన్ని రకాల పంటల రైతులకు సర్వే చేసి అంచనావేసి తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఆహార పంటలకు ఎకరాకు 25000 చొప్పున, వాణిజ్య పంటలైన వేరుశనగ, అరటి పంటకు, ఇతర వాణిజ్య పంటలకు ఎకరాకు 50000 రూపాయలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం కోరింది. ఇల్లు పడిపోయిన వారికి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేసింది. చెరువు కట్టలు, రహదారులు కోతకు గురై దెబ్బతిన్నవి, వాటిని కూడా యుద్ధ ప్రాతిపదిగిన మరమ్మతులు చేయాలని కోరారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు మారంపూడి సూర్యనారాయణ, రైతు సంఘం మండల కార్యదర్శి మోరంపూడి కేశవరావు, కమిటీ సభ్యులు కూచిపూడి రవి, చెప్పు బోయిన బ్రహ్మయ్య, కూచిపూడి నాగ వెంకట, సతీష్, పిట్టల భాస్కరరావు, పొగడ్త నాగబాబు, పిట్టల గణేష్, పొగడ్త శోభన్ బాబు, ములగల పాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మిచౌంగ్‌తో పొగాకు నష్టం

టుబాకో బోర్డ్ చైర్మన్ యశ్వంత్ కుమార్

నవతెలంగాణ - అశ్వారావుపేట

మిచౌంగ్ తుఫాను కారణంగా పొగాకు పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు పరిధిలోగల ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి, అశ్వారావుపేటతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి తుఫాను వల్ల దెబ్బతిన్న పొగాకు తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంగారెడ్డిగూడెం కేంద్రం పరిధిలోనే దాదాపు 1000 ఎకరాల్లో పొగాకు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వందల ఎకరాల్లో స్వల్పంగా నష్టం జరిగిందని అన్నారు. తుఫానుతో రైతులకు ఎకరానికి రూ.1లక్ష నుంచి రూ.1లక్ష 50 వేల మేర నష్టపోయారని, బాధిత రైతులంతా ధైర్యంగా ఉండాలని కోరారు. గతంలో కుడా తుఫాను, వర్షాల కారణంగా పొగాకు పంటలకు నష్టం జరిగిందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతులకు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం ఆది శేషయ్య, సూపరింటెండెంట్ జే.సురేంద్ర, ఫీల్డ్ ఆఫీసర్లు జేసీ ప్రభాకర్ రెడ్డి, బాలాజీ, కే.వెంకయ్య, రైతు సంఘం బాధ్యులు సత్రం వెంకట్రావు, గడ్డమడుగు సత్యనారాయణ రెడ్డి, రెడ్డిబాబు పాల్గొన్నారు.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం

కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్

నవతెలంగాణ-కరకగూడెం



రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ శాస్త్రీ స్టేడియంలో గురువారం నిర్వహించిన, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి,మంత్రివర్యులు పదవి ప్రమాణ స్వీకారోత్సవనికి కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్,నియోజకవర్గ నాయకులు తొలెం నాగేశ్వరావు,సీనియర్ నాయకులు సర్వేశ్వరరావు,మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు భూక్య అర్జున్, దొంతు మల్లయ్య, మల్లూరి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్, తుమ్మల, జారే చిత్రపటాలకు పాలాభిషేకం

అశ్వారావుపేట : కాంగ్రెస్ ఆధ్వర్యంలో తెలంగాణలో ఏర్పడిన నూతన ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, మంత్రి వర్గంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు స్థానం లభించడం తిరిగి గురువారం మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో, ఎమ్మెల్యే జారే ఆదినారాయణల చిత్రపటాలకు నారంవారిగూడెంకు చెందిన తుమ్మల యూత్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో తుమ్మల యూత్, అభిమానులు, ఆడపడుచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురు గురువారం ప్రమాణ స్వీకారం చేయడం పట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు. పోలీస్ స్టేషన్ సెంటర్లో, మండలంలోని పాత నారంవారి గూడెంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా కలిసి కేక్ కట్ చేసి,స్వీట్లు పంచారు. అనంతరం పెద్ద స్థాయిలో బాణసంచాలు కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగళ్ళపు చెన్నకేశవ రావు, సర్పంచ్ అట్టం రమ్య, ఉప సర్పంచ్ రేమళ్ల కేధర్నాథ్, సొసైటీ చైర్మన్ చిన్నం శెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు వేముల భారతి, జూపల్లి ప్రమోద్,నంద్రు రమేష్, వేముల ప్రతాప్ పాల్గొన్నారు.

ఘనంగా చిత్తారు శ్రీహరి యాదవ్ 12వ వర్ధంతి

నవతెలంగాణ-వైరాటౌన్



ఖమ్మం జిల్లా యాదవుల ముద్దుబిడ్డ ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజా సేవకుడు అమరజీవి చిత్తారు శ్రీహరి యాదవ్ అని చిలకల వెంకట నరసయ్య యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్ అన్నారు. గురువారం అమరజీవి చిత్తారు శ్రీహరి యాదవ్ గారి 12వ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య యాదవ్, యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైరా మండలం అష్టగుర్తి గ్రామంలో చిత్తారు హుస్సేన్, సీతారావమ్మ దంపతుల పెద్ద కొడుకుగా జన్మించిన శ్రీహరి యాదవ్ యాదవ జాతికి జిల్లావ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలనే దృఢ సంకల్పంతో యాదవ జాతి రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుదల కోసం అహర్నిశలు శ్రమించారని అన్నారు. శ్రీహరి యాదవ్ మన ముందు లేకపోవడం బాధాకరమని, ఆయన లేని లోటు ఎవరు తీర్చలేనిదని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి యాదవ యువత అంతా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, చిత్తారు విశ్వనాథం యాదవ్, చిత్తారు పుల్లయ్య, వెంకట్రావు, పొదిల సతీష్ యాదవ్, తెల్లబోయిన రమణ యాదవ్, మెండే శ్రీను యాదవ్, మేడిదుల మల్లేష్ యాదవ్, రాజబంటి వంశీ యాదవ్, కన్నెబోయిన రవి యాదవ్, గోసు హరీష్ యాదవ్, చిత్తారి నాగేశ్వరరావు, చిత్తారు కృష్ణయ్య, వెంకట నర్సయ్య, నరసింహారావు, గంగాదేవుల నరేష్, వెంకట్, గుమ్మ వెంకన్న, అజయ్ కుమార్, మల్లేశం, కష్ణంరాజు, కాటాల బిక్షం, ఆరేపల్లి ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్ యాదవ్, జవ్వాజి సైదులు, గుమ్మ రామకష్ణ తదితరులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ డిమాండ్

నవతెలంగాణ-కామేపల్లి



అకాల వర్షాల వలన నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన రైతుల పంట పొలాలకు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం, రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వర్షంతో దెబ్బతిన్న పంటపొలలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా దుగ్గి కృష్ణ మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాల వలన పంటలు మునిగిపోయి, రైతాంగం తీవ్ర ఆవేదనలో ఉన్నారని అన్నారు. మండలంలో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించామన్నారు. ప్రభుత్వం పాలకులు వెంటనే పంట నష్ట సర్వేలను చేపట్టాలని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మిర్చి, వరి, పత్తి నీట మునిగిపోయి నేలమట్టమయ్యాయని అన్నారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు అప్రమత్తమై సర్వేలు నిర్వహించి పంట నష్టాన్ని అంచనా వేసి పంట నష్టపరిహారాన్ని అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు రైతు సంఘం జిల్లా నాయకులు వింజం. నాగభూషణం, బాదావతు శ్రీను, గుండా వెంకటరెడ్డి, అడప ఉపేందర్, కాటినేని కృష్ణ ముర్తి, కిన్నెర. రామచంద్రయ్య, ఉప్పతల వెంకన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

"అభినవ మొల్ల" లక్ష్మీ నరసమ్మకు ఘననివాళి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచల వాసి, ప్రముఖ కవయిత్రి," అభినవ మొల్ల" బిరుదాంకితులు లక్ష్మీ నరసమ్మ తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. లక్ష్మీ నరసమ్మ బూర్గంపాడు, భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా బోధకురాలుగా సుదీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. 'రామదాసు' ఖండకావ్యం వీరికి ఎంతో ఖ్యాతి గడించింది. కవితా ధనుస్సు, స్వరార్చన లాంటి ఎన్నో పద్య, గేయ, వచన రచనలు చేసారు. కావ్య గౌతమి బృహత్ గ్రంథాన్ని వెలువరించారు. ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. తెలుగునాట అరుదైన రచయిత్రులలో లక్ష్మీ నరసమ్మ గారొకరు. సాంప్రదాయ కుటుంబంలో పుట్టినా ఆధునిక, అభ్యుదయ భావజాలంతో ఎంతో మేలైన కవిత్వం రాయడంలో దిట్ట... కలం పట్టింది మొదలు తుది శ్వాస వరకూ కవితా సేద్యం చేసారు. భద్రాద్రి కవులకు ఆమె సాహితీ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని, అభినవమొల్ల గతించడం యావత్ సాహితీ ప్రపంచానికే తీరని లోటని తెలంగాణ సాహితీ భద్రాచలం పక్షాన కవి, గాయకులు మాల్యశ్రీ, సోంపాక సీత, తాతోలు దుర్గా చారి, బి.జె.ఎల్.పి. దాసు, టి.వి.చలం, కె.కనకదుర్గ, వాణీరాం మేడం,యం.పద్మావతి, కే.ప్రశాంతి, కే.నాగలక్ష్మీ లు నివాళులందించారు.

అరటి తోటలకు ఎకరాకు

లక్ష రూపాయలు పరిహారం అందించాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్


నవతెలంగాణ-వైరాటౌన్



తుఫాన్ వల్ల దెబ్బతిన్న అరటి తోటలకు ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం వైరా మండలంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వలన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పండ్ల తోటలను తెలంగాణ రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన అరటి గెలలు కోత దశలో పంట పూర్తిగా కిందకు పడిపోయిందని అన్నారు. పలు ప్రాంతాల్లో ఇతర పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు పంట దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా వెంటనే సమగ్ర సర్వే జరిపి రైతులకు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, రైతు సంఘం నాయకులు పైడిపల్లి సాంబశివరావు, నారికొండ అమరేందర్, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

కొత్త సర్కారు పచ్చజెండా ఊపితేనే..

- పల్లెల్లో ఎన్నికల సంగ్రామం
- లేదంటే కొన్నెళ్లప్రత్యేకాధికారుల పాలనకు ఛాన్స్!
- ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- మారనున్న పంచాయతీల రిజర్వేషన్లు.. తేలనున్న ఓటర్లలెక్క
- బీఆర్ఎస్‌లో ఉండటమా? అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లడమా?
- అంతర్మథనంలో ప్రస్తుత సర్పంచ్‌లు.. ఆశావహులు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

వచ్చే ఏడాది(2024) ఫిబ్రవరి ఒకటితో పంచాయతీల పాలకవర్గం గడువు ముగియనుంది. అయితే, రెండు నెలల ముందే ఎన్నికలు నిర్వహించాలని పంచాయతీరాజ్ చట్టం చెబుతోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగించుకున్న రాష్ట్రంలో ఈనెల 6న పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారుకు ఇంకా గ్రామ స్థాయిలో బలమైన పట్టులేదు. పైగా రాష్ట్రంలో అధికార పార్టీ మారడం, ఆయా అసెంబ్లీ స్థానాల్లో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలే గెలవడం, మరికొన్ని స్థానాల్లో కొత్తగా కాంగ్రెస్ శాసనసభ్యులు రావడం వంటి రాజకీయ పరిణామాల్లో పల్లెల్లోని ప్రస్తుత సర్పంచ్‌లు, ఆశావహులు అంతర్మథనంలో పడ్డారు. దీంతో గ్రామస్థాయిలో పరిస్థితులు చక్కదిద్దుకున్నాకే పంచాయతీ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంటుందని.. దీంతో మరికొన్ని నెలలు స్పెషల్ ఆఫీసర్ల పాలన పెడతారనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 చోట్ల గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా బీఆర్ఎస్ 39 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా.. పంచాయతీల్లో మార్పులు జరగాల్సి ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గతంలో 13 స్థానాల్లో మంథని తప్ప మిగిలిన 12స్థానాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కొలువుదీరితే.. ఈసారి ఎన్నికల్లో 5 స్థానాలకే గులాబీ పార్టీ పరిమితమైంది. మిగిలిన 8 స్థానాల్లో కాంగ్రెస్ గెలుచుకుంది. పైగా రాష్ట్రంలో ఆ పార్టీయే కొలువుదీరింది. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లూ బీఆర్ఎస్‌లోనే ఉన్న మెజార్టీ సర్పంచులు సహజంగానే అధికార పార్టీలో చేరికతో ప్రయోజనం సహా పంచాయతీ ఎన్నికల్లోనూ ఈజీగా గెలువొచ్చనే భావనలో ఉన్నారు. పైగా గ్రామస్థాయిలో ఇంకా శ్రేణులు, పల్లె పోరులో ఆశావహులు, ఇతర పార్టీల నుంచి వలసలు వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి క్లారిటీ రాలేదు. అందుకే సందిగ్ధంలో ఉంది.

తేలాల్సిన రిజర్వేషన్లు.. పెరగనున్న ఓటర్లు

గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కోటా రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటితో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుండగా.. ఆర్టికల్ 243(3)(ఎ) ప్రకారం సర్పంచ్‌ల పదవీకాలం ఐదేండ్లు, పంచాయతీరాజ్ యాక్ట్ 14(2) ప్రకారం పదవీకాలం ముగియకముందే మూన్నెళ్ల ముందే ఎన్నికలు నిర్వహించాలని చెబుతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి ముందస్తుగానే సమాచారం ఇచ్చింది. ఈ క్రమంలోనే ఆయా జిల్లా కలెక్టర్లకు ఈనెల 6న ఆదేశాలు జారీ చేసింది.

అయితే ఎన్నికల సమయానికి రిజర్వేషన్లు సహా ఎన్నికల తేదీలనూ ప్రకటించాల్సి ఉండగా అది సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2018 ఎన్నికల నాటికి 13 నియోజకవర్గాల పరిధిలో 2788092 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా జరిగిన ఎన్నికల్లో 3112283 మందికి చేరుకున్నారు. కొత్తగా 324191 మంది ఓటర్లు వచ్చారు. ప్రతి బూత్ పరిధిలో 200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ అధికారులను, ఆపై 400లోపు ఉన్న బూత్‌ల్లో అదనంగా మరో ముగ్గురు పోలింగ్ అధికారులు, 650 ఓట్లు దాటిన బూత్‌ల్లో అదనంగా మరో బూత్ ఏర్పాటు వంటి ఏర్పాట్లు చేయాల్సి ఉంది. దీంతో ఎన్నికల ఏర్పాట్లు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు కూడా మరింత ఆలస్యానికే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం లేకపోలేదు. ఫిబ్రవరి ఒకటి తరువాత ప్రత్యేక అధికారులను నియమించి కొన్నెళ్లపాటు పాలన సాగించి గ్రామస్థాయిలో పార్టీ పరిస్థితులు చక్కబడ్డాకే కాంగ్రెస్ సర్కారు ఎన్నికలకు పోయే అవకాశం ఉన్నట్టు చర్చ సాగుతోంది. ఇదే జరిగితే పల్లెల్లో ఏయే రిజర్వేషన్లు ఖరారు అవుతాయనే అంచనాతో ప్రస్తుత సర్పంచ్‌లు, ఆశావహులు లెక్కలు వేసుకునే పనిలో పడుతున్నారు.

జిల్లా	మండలాలు	గ్రామాలు	వార్డులు
కరీంనగర్	16	313	2966
జగిత్యాల	20	380	3500
సిరిసిల్ల	13	255	2444
పెద్దపల్లి	14	263	2436

నూతన ప్రభుత్వానికి డీవైఎఫ్ఐ అభినందనలు

- యువత ఆకాంక్షలకనుగుణంగా నియామకాలు చేపట్టాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నూతన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ప్రకటించిన మాదిరిగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి అతిత్వరలోనే చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల ముందు వాయిదా పడిన గ్రూప్-2, డీఎస్సీ పోటీపరీక్షలను సత్వరమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్లు ప్రకటించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. విద్యావైద్యం, ఉపాధి కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధ పాలనకు కృషి చేయాలని సూచించారు. నిరుద్యోగులకు అన్యాయం జరిగితే ఉద్యమాలను చేపడతామని స్పష్టం చేశారు.

కూనంనేనికి డి రాజా అభినందనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, ఎం బాలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్టాన్ని అంచనావేసి పరిహారమివ్వాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ(ఎం) డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కురుస్తున్న మిచౌంగ్ తుఫాన్ వల్ల కలిగిన పంటనష్టాన్ని అంచనావేసి పరిహారం వెంటనే చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 4.70 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నట్టు ప్రభుత్వ ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి అంతకుమించి నష్టం జరిగిందని వివరించారు. 1.5 లక్షల మంది రైతులు సుమారు రూ.3,500 కోట్లు నష్టపోయినట్టు అంచనా ఉందని పేర్కొన్నారు. గొర్రెలు, బాతులు, పశువులు చనిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి వెంటనే పరిహారం చెల్లించాలని కోరారు. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ పంట సీజన్‌లోనే నష్టం జరగడం ఇది రెండోసారి అని తెలిపారు. అధిక వర్షాల వల్ల జూలైలో 12 లక్షల ఎకరాల్లో నష్టం జరిగిందనీ, 49 మంది మరణించారని గుర్తు చేశారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామంటూ గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఎవరికీ ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ పంట కోతకొచ్చిన తరుణంలోనే మరోసారి నష్టం జరిగిందని పేర్కొన్నారు. వరిపంటలో కేవలం 42 శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయని వివరించారు. మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం కూడా సౌకర్యాల్లేక తడిచిపోయిందని తెలిపారు. ఆరబెట్టడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ములుగు, జోగులాంబ గద్వాల జిల్లాల్లో నష్టం తీవ్రంగా ఉందని వివరించారు. ఈ నష్టాన్ని రైతులు భరించే స్థితిలో లేరని గుర్తు చేశారు. 2023-24లో 15వ ఆర్థికసంఘం కేటాయించిన రూ.660 కోట్లకు తోడు, మరికొన్ని నిధులు కేటాయించి, జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేసి నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

లోపల పెచ్చులు.. బయట పాములు

- ఓయూలో భయబ్రాంతులతో ఎన్ఆర్ఎస్‌హెచ్ విద్యార్థులు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న వైనం
- ఓ విద్యార్థికి తప్పిన ప్రాణగండం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం 105 ఏండ్ల చరిత్ర కలిగిన యూనివర్సిటీ. దీనిలో ముఖ్యంగా న్యూ రీసెర్చ్ స్కాలర్ హాస్టల్ (ఎన్ఆర్ఎస్‌హెచ్) అంటే తెలంగాణ ఉద్యమ వ్యూహాలకు, సామాజిక న్యాయానికి, పరిశోధనలకు పెట్టింది పేరు. కానీ దాని నిర్వహణ, బాగోగులను గాలికి వదిలేశారు ఓయూ అధికారులు. విద్యార్థుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట అన్న మాటలు తప్ప అమల్లో ఎక్కడా చిత్తశుద్ధి లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పీహెచ్‌డీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసతిగృహాల్లోని గదులు, బాత్ రూమ్‌లలో అనేకసార్లు శ్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. విద్యార్థులు వాటి నుంచి బయటపడ్డారు. ఇప్పటికీ కొన్ని రూమ్స్, వరండాల్లో శ్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో అనే పరిస్థితి ఉంది. విద్యుత్ సరఫరా కూడా అస్తవ్యస్తంగా ఉన్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఇటీవల రెండుసార్లు షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఈ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

పాములు, విష పురుగులకు నిలయంగా..

మునుపెన్నడూ లేనంతగా హాస్టల్ పరిసరాల్లో వివిధ రకాల ప్రమాదకరమైన పాములు, విషపురుగుల సంచారం పెరిగింది. ఇటీవల పీహెచ్‌డీ విద్యార్థి విష్ణును విషపురుగు కాటేసింది. ఇతర విద్యార్థులు ఆ పామును చంపేశారు. బాధిత విద్యార్థిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇప్పటి వరకు అనేక విషపురుగులు, పాములు కనిపించడంతో విద్యార్థుల విన్నపం మేరకు అధికారులు ఇటీవల ఆరుబయట వీధి దీపాలు ఏర్పాటు చేశారు. పాములు, విషపురుగులు వసతిగృహంలోకి రాకుండా శాశ్వత పరిష్కారమార్గాలు చూడటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెంటినరీ పైలాన్‌ను కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేసే బదులు తగిన సంఖ్యలో వసతిగృహాల నిర్మాణాలు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల వసతిగృహాల నిర్మాణాలకు ఎస్టిమేషన్, టెండర్లు అంటూ కాలం వెళ్లదీస్తున్న అధికారులు వీసీ అధికారిక నివాసం, వీసీ కార్యాలయాలకు రోజుల వ్యవధిలోనే పనులు ఎలా పూర్తి అవుతున్నాయని విద్యార్థులు అంటున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం

మరుగుదొడ్లు పనిచేయక వసతి గృహాల పరిసరాల్లో మురుగునీరు, తీవ్రమైన దుర్వాసన వస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై విద్యార్థుల నుంచి వ్యతిరేకత రావడంతో వెంటనే అధికారులు కొత్తగా మరుగుదొడ్లు నిర్మాణం చేయించారు. ఇది ఒక్కటి తప్ప మరే సౌకర్యాలూ మెరుగుపర్చలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

- ఎమ్మెల్యే కూనంనేనికి ఈయూ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) సీపీఐని కోరింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును గురువారం హైదరాబాద్‌లో మఖ్దూంభవన్‌లో ఈయూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు, ప్రధాన కార్యదర్శి ఈ వెంకన్న కలిసి వినతిపత్రం సమర్పించారు. 2017, ఏప్రిల్ ఒకటి, 2021, ఏప్రిల్ ఒకటిన ఈ రెండు వేతన సవరణలు వెంటనే జరగాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం అయినట్టుగా గెజిట్ పబ్లిష్ అయినందున విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈనెల నుంచే ఆర్టీసీ కార్మికుల వేతనాలు ప్రభుత్వ ట్రెజరీల ద్వారా చెల్లించాలని తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత ఇవ్వాలనీ, 2019 నుంచి అందరికీ యూనిఫారాలను అందించాలని పేర్కొన్నారు. సుమారు ఎనిమిది డీఏలకు సంబంధించిన బకాయిలు కార్మికులకు చెల్లించలేదనీ, వాటిని వెంటనే ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. పెంచిన పనిభారాన్ని తగ్గించాలనీ, అన్ని కేటగిరీల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కోఆపరేటివ్ సొసైటీకి యాజమాన్యం ఇవ్వాల్సిన రూ.1,200 కోట్లను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఎస్బీటీ, ఎస్ఆర్‌బీఎస్‌లకు బకాయి పడిన నిధులు, పీఎఫ్‌నకు సంబంధించిన బకాయిలనూ వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. మహిళా కండక్టర్లకు రాత్రి తొమ్మిదిలోపు దిగేలా డ్యూటీలు వేయాలని కోరారు. ఈ సమస్యలపై కూనంనేని వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని ప్రభుత్వంతో సంప్రదించి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

ఎంపీడీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం

- కీలక ఫైళ్లు దగ్ధం
- ప్రమాదమా.. ప్రణాళికనా..?
- ప్రమాదంపై అనుమానాలు





నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి కార్యాలయంలో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కార్యాలయానికి సంబంధించిన కీలక ఫైళ్లు దగ్ధమైనట్టు ప్రత్యేక అధికారి నాగలక్ష్మి తెలియజేశారు. మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వర్షానికి తోడు పట్టణ వ్యాప్తంగా ముసురు నెలకొన్న నేపథ్యంలో ఎంపీడీవో కార్యాలయం జరిగిన అగ్నిప్రమాదంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. పట్టణానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పాలకమండలి లేకపోవటంతో ప్రభుత్వ కార్యకలాపాలను, అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రత్యేక అధికారిని నియమించి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నుంచి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే మార్పు చెందిన కొద్ది రోజుల్లోనే మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగి కీలక ఫైల్స్ దగ్ధమవడంతో సిబ్బంది తీరుపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాల్లో అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు జరిగిన అగ్నిప్రమాదంతో వాటికి మరింత బలం చేకూరింది. గతంలో బీసీ రుణాలతో పాటు ఆసరా పింఛన్లు, ఈజీఎస్ పనులలో కార్యాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు రావడంతో పాటు వరదల సమయంలో విపత్తు నిధుల ఖర్చుల వ్యవహారంలోనూ అనేకారోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇంత పెద్ద అగ్ని ప్రమాదం కాకతాళీయకంగా జరిగిందా కావాలనే చేశారా అన్నదానిపై విచారణ చేయబడితే తప్పా, పూర్తి నిజనిజాలు బయటకు రావు. అగ్ని ప్రమాద ఘటన తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద తీరుని పరిశీలించి ప్రత్యేక అధికారి నాగలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదంపై పట్టణ సీఐ నాగరాజు రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనేక అవినీతి ఆరోపణలకు కేంద్ర బిందువైన మండల ప్రజా పరిషత్ కార్యాలయ అగ్ని ప్రమాదంపై పోలీసు సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు ప్రజలకు తెలియజేయాలని వివిధ రాజకీయ పార్టీల పెద్దలు కోరుతున్నారు.

తిప్పన విజయసింహారెడ్డి రాజీనామా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వంలో ఆగ్రో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ తిప్పన విజయసింహారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. మరో ఏడాదిపాటు పదవీకాలం ఉన్నప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడం వల్ల నైతిక బాధ్యత వహిస్తూ కార్పొరేషన్ ఎండీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కు రాజీనామా పత్రాన్ని గురువారం ఆయన పంపించారు.

జోడేఘాట్ అభివృద్ధిపై సీఎం దృష్టి

- డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పురోగతిపై నివేదిక కోరిన రేవంత్
- హుటాహుటిన జోడేఘాట్‌ను సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-కెరమెరి

నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివాసుల పోరుగడ్డ జోడేఘాట్ స్థితిగతులపై, గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పురోగతిపై తక్షణమే నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను కోరారు. సీఎస్ ఆదేశాల మేరకు హుటాహుటిన ఆసిఫాబాద్-కుమురంభీం కలెక్టర్ బోర్కడె హేమంత్ సహదేవ్‌రావు గురువారం జోడేఘాట్‌ను సందర్శించారు. ముందుగా ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కలెక్టర్ గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పురోగతిపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వం 2021లో జోడేఘాట్ గ్రామానికి 32 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేసింది. ప్రతి గృహానికి రూ.5లక్షలు కేటాయించగా వీటిలో ఐదు ఇండ్లు మాత్రమే పూర్తయినట్టు గుర్తించారు. 15 ఇండ్లు రూఫ్ లెవెల్ వరకు, మరో 5 బేస్‌మెంట్ లెవెల్ వరకు పనులు జరగ్గా, మిగతావి ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటి వరకు కేవలం రూ.62లక్షల బిల్లులు మంజూరు కాగా, పనులు పూర్తయిన వాటికి మరో కోటి రూపాయలు మంజూరు కావాల్సి ఉంది. 15 ఇండ్లు రూఫ్ లెవల్ వరకు పూర్తయినా వాటి బిల్లులు రాలేదని కలెక్టర్ గుర్తించారు. సీఎస్ ఆదేశాల మేరకు జోడేఘాట్ సమస్యలను, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పురోగతి వివరాల సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు గ్రామస్తులతో తెలిపారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో మహేందర్, తహసీల్దార్ జమీర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, గ్రామస్తులు పెందూర్ రాజేశ్వర్ ఉన్నారు.

సింగరేణిలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- టీబీజీకేఎస్ గెలుపు చాలా అవసరం
- కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం సంస్థను నిద్రపోనివ్వం
- గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సింగరేణి సంస్థ పురోగమనానికి టీబీజీకేఎస్ గెలుపు చాలా అవసరమని ఆ సంఘం గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ నాయకులు, ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని గురువారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల హక్కులు, ప్రయోజనాల సాధనకు సంస్థను నిద్రపోనివ్వబోమని అన్నారు. సింగరేణి అంటే సింహగర్జన అనీ, అదే స్ఫూర్తితో పనిచేస్తూ సంస్థను కాపాడుకోవాల్సిన అవసరముందని చెప్పారు. రాష్ట్ర సాధనలో బొగ్గు గని కార్మికులు ప్రధాన భూమిక పోషించారని అన్నారు. సింగరేణి కార్మికులకు ఉన్న పోరాట స్ఫూర్తి జాతీయ సంఘాలకు లేదని స్పష్టం చేశారు. గనుల్లో కార్మికులు చేస్తున్న కష్టం, చిందిస్తున్న చెమట తెలంగాణలో వెలుగులు నింపుతోందన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేస్తామనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పారు. ఎన్నికల్లో ఒక్కొక్కరూ ఒక్కో కేసీఆర్‌లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మ్యానిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసి అతిత్వరలో విడుదల చేస్తామని అన్నారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ వంటి జాతీయ సంఘాలు సింగరేణి హక్కులను ఏనాడూ కాపాడలేదని ఆరోపించారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉండగా ఒక్క సమ్మె కూడా చేసే అవసరం లేకుండా అన్ని పనులనూ సాధించామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రాధాన్యతల్లో సింగరేణి కార్మికుల్లేరని చెప్పారు. తమకు పోరాటాలు కొత్త కాదనీ, కార్మికుల హక్కులను సాధించే వరకు విశ్రమించబోమని అన్నారు. సింగరేణిలో దాదాపు 40 వేల ఉద్యోగులుంటే, వారిలో 21 వేల వరకు యువకులే ఉన్నారని వివరించారు. అన్ని కమిటీల్లోనూ యువతకు సరైన ప్రాధాన్యత ఇస్తామనీ, మహిళలకూ అవకాశాలను కల్పిస్తామని చెప్పారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ తీవ్రంగా కృషి చేశారని గుర్తు చేశారు. కార్మికులు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే కాకుండా ఆత్మగౌరవం ఇవ్వాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు.

సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అభినందనలు

- సీపీఎస్ రద్దుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అభినందనలు తెలిపారు. ఎన్నికల సందర్భంలో ప్రస్తావించినట్టు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం, మంత్రిమండలి సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలనీ, పరిపాలన కొనసాగించాలని సూచించారు. పార్టీలతో సంబంధం లేకుండా సీఎం, మంత్రిమండలి సభ్యులు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్లు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను క్రమపద్ధతిలో అమలు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రేవంత్‌కు ఉపాధ్యాయ సంఘాల శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నూతన మంత్రులకు పలు ఉపాధ్యాయ సంఘాలు శుభాకాంక్షలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వానికి పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బి మోహన్‌రెడ్డి, పూల రవీందర్, టీజీజేఎల్ఏ-475 వర్కింగ్ ప్రెసిడెంట్ వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, టీఎస్టీయూ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) అధ్యక్షులు కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మేరోజు బ్రహ్మచారి, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ (ఆర్‌యూపీపీటీ) అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల క్రాంతికృష్ణ, తెలంగాణ గురుకుల ప్రిన్సిపాళ్ల సంఘం (టీజీపీఏ) అధ్యక్షులు ఆర్ అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంబాబు, తెలంగాణ రాష్ట్ర వృత్తి విద్య ఉపాధ్యాయ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎద్దు ఉపేంద్రం అభినందనలు తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తామని పేర్కొన్నారు.

మైలవరం మహిళా రైతు విజయ ప్రస్థానం

రజినీ రెడ్డి... ఎం.కాం చేసి జీవనోపాధి కోసం ఎన్ని ప్రైవేటు ఉద్యోగాలు చేసినా ఏదీ సంతృప్తినివ్వలేదు. 'ఇది కాదు నేను చెయ్యాల్సిన పని, నా కిష్టమైన పని' అనుకుంది. మనసు మూలల్లో దాగివున్న కోరిక తన కర్తవ్యాన్ని, అభిరుచిని తట్టిలేపింది. మట్టితో పెనవేసుకున్న తన అను బంధాన్ని మనసుతో దర్శించింది. అదే ఆమెకు ఆరో ప్రాణమైన వ్యవసాయం. అంతే ఇక మరో ఆలోచన లేకుండా ఊరి బాట పట్టి సాగు మొదలుపెట్టింది.





రజినీ కరీంనగర్ జిల్లా, గన్నేరువరం మండలం, మైలవరం గ్రామంలో పుట్టి పెరిగింది. వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్నప్పటినుండి పొలం పనులంటే ఎంతో ఇష్టం. సెలవు రోజుల్లో తల్లిదండ్రులకు సహాయపడేది. తర్వాత ఉన్నత విద్య, వివాహం ఆమె జీవితాన్ని మరో మలుపుకి తీసుకు వెళ్ళాయి. ఎన్నో కంపెనీల్లో ఉద్యోగాలు చేసింది. కానీ ఏవీ ఆమెకు తృప్తినివ్వలేదు. దాంతో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకుంది. దానికి భర్త రమణా రెడ్డి సహకారం కూడా తోడయింది. ఆయనకూ ఊరన్నా, వ్యవసాయం అన్నా ఎంతో మమకారం.

సమాజ సేవ చేయాలనుకున్నారు

కొంత కాలం ఉన్నత విద్య, ఉద్యోగం కారణంగా డెన్మార్క్‌లో ఉండి తిరిగి హైదరాబాద్ వచ్చి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన రమణా రెడ్డికి ఎప్పుడూ ఏదో వెలితిగా అనిపించేది. నెల తిరిగేసరికి నాలుగంకెల జీతం చేతిలో పడ్తున్నా, ఇంకా జీవితంలో ఏదో శూన్యత, అసంతృప్తి. అప్పుడే సహచరి ప్రపోజల్ అతన్ని ఆలోచింపచేసింది. అయితే ఆ వ్యాపారం కేవలం డబ్బు సంపాదించడమే ధ్యేయంగా ఉండ కూడదు అనుకున్నారు ఆ దంపతులు. అందులో సేవా దృక్పథం సమ్మిళితం కావాలనుకున్నారు. తమ వంతు సమాజ సేవ చేయాలనుకున్నారు. అందుకే ఇద్దరూ ఊరి బాట పట్టారు. సేంద్రీయ ఎరువులతో వ్యవసాయం, దేశీ ఆవులతో పాల వ్యాపారం ప్రారంభించారు.

కుటుంబం నుండి సమాజం కోసం

తన కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం తాను స్వయంగా పరిశోధించి, తయారు చేసిన అనేక ఆరోగ్య ప్రయోజనాలున్న మునగాకు పొడి, ఆధునిక పద్ధతిలో, ఉత్తమ వ్యాపార విలువలతో సమాజానికి అందిస్తే బావుంటుందని ఆలోచించారు. ఆ ఆలోచనే ఆమె వ్యాపా రంలో, సేంద్రీయ వ్యవసాయంలో మరో ముందడుగు వెయ్యడానికి తోడ్పడింది. 75% సబ్సిడీతో, ప్రభుత్వ చేయూతతో మునగాకు పొడి తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. తమ సొంత వ్యవసాయ క్షేత్రంలోనే మునగ పంట సాగు చేస్తూ నైతిక విలువలతో, ఉన్నత ప్రమాణాలతో వ్యవసాయాన్ని వ్యాపారంగా, ఉపాధిగా మలుచుకున్న ఈ ఆదర్శ మహిళా రైతు ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

కల్తీలేని ఆహారం...

ముందుగా తమకున్న కొద్దిపాటి భూమిలో సేంద్రీయ విధానంలో వరి పండించి మంచి దిగుబడిని సాధించారు. వ్యాపార అవసరాల కన్నా, తమ కుటుంబ అవస రాలకు తగినట్లుగా ప్రణాళిక రూపొందించారు. కల్తీ లేని, హానికారక మందుల్లేని బియ్యం, దేశీ ఆవు పాలు, పాల పదార్థాలు, పండ్లు, కూరగాయలు తమ కుటుంబ అవసరాలకు సరిపోగా, మరో పది, పదిహేను కుటుంబాలకు అందించడం ఎంతో తృప్తినిచ్చింది అంటారు రజినీ. రానురాను దీన్ని మరింత విస్త రించి మరికొన్ని కుటుంబాలకు సేవలందిస్తున్నారు రజినీ.

ప్రజారోగ్య దిశగా....

కొద్దిపాటి భూమిలో సేంద్రీయ విధానంలో వరి సాగు చేస్తున్నా, మిగతా ఎకరం భూమిలో ఏదైనా నూతనంగా, ఆధునిక పద్ధతుల్లో ప్రత్యేక పంటను సాగుచేస్తే బాగుండు అనిపించింది ఆమెకు. దాని ఫలితమే పాలీ హౌజ్‌లో తెల్ల చేమంతి వనాలను పెంచడం. తెలంగాణ రాష్ట్రంలో, అందునా కరీంనగర్ జిల్లా ఓ మారుమూల పల్లెలో ఓ సన్నకారు మహిళా రైతు ఈ చేమంతి పంట పండించాలనుకోడం ఓ వినూత్న ప్రయోగం మాత్రమే కాదు అందుకు తగినంత గుండెబలం కూడా కావాలి. ప్రభుత్వ సబ్సిడీపై ప్రాజెక్ట్ మొదలు పెట్టిన ఆమె మహారాష్ట్ర నుండి చేమంతి మొక్కలు తెచ్చి పెంచారు. అయితే మొదట్లో తోట నష్టాల్ని మిగిల్చింది. మళ్లీ ఆశావహ దృక్పథంతో జిల్లా ఉద్యానవన అధికారి సూచనలతో, మదర్ ప్లాంట్ తయారు చెయ్యడం నేర్చుకున్నారు. ఆ విధానంతో ఈసారి పూల తోట రాబడిని సాధించారు. అసలైతే 1,50,000 పూల మొక్కలు నాటితే ఒక పంటలో 15,000 గుచ్ఛాలు రావాలి. కానీ అధిక వర్షాల వల్ల అంత దిగుబడి పొందలేకపోయారు. కానీ క్రమంగా పంటలోని మెళకువలు తెలుసుకుని 9,000 గుచ్ఛాలను తేగలిగారు.

మార్కెట్ విస్తరించుకుంటూ...

తాను పండించిన పూలను తనే స్కూటీపై వేసు కుని ఇల్లిల్లూ తిరిగి మార్కెట్ చేసుకునే దశ నుండి పెద్ద మొత్తంలో హైదరాబాద్, కరీంనగర్, నాందేడ్ వంటి నగరాలకు మార్కెట్‌ను విస్తరించుకోగలిగింది రజినీ. ఇప్పుడు ఆమె పేరు జిల్లాలో మార్మోగుతుంది. ఉత్తమ, విశిష్ట మహిళా రైతు బిరుదుతో పాటు అనేక అవార్డులూ, రివార్డులు వరించాయి. జిల్లా ఉన్నతా ధికారులు ఆమె పూలతోట సాగును, సేంద్రీ య విధాన పద్ధతులను చూడడానికి క్యూ కట్టారు. ఇది ఆమెకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది.

విప్లవాత్మకం...

వ్యవసాయం చెయ్యడం ఒక విశిష్ట కళ. అందరి వల్లా ఇది సాధ్యం కాదు. అందునా సేంద్రీయ వ్యవసాయం ఇంకా సవాళ్ల తో కూడుకున్నదే. మహిళలు అతి తక్కువగా ఉండే ఈ రంగంలో విశిష్ట మహిళా రైతుగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును పొందడం నిజంగా విప్లవాత్మకం. అయితే తన విజయ ప్రస్థానంలో తనకు అడుగడుగునా తన జీవన సహచరుడు, ఇద్దరు పిల్లలు అండగా నిలబడ్డారని ఆమె అంటున్నారు. ఒక స్త్రీ అభివృద్ధికి కుటుంబ తోడ్పాటు చాలా అవసరమని ఆమె అంటున్నారు.

- డా. వాణీ దేవులపల్లి, 9866962414

మునగాకు ప్రయోజనాలు

- మునగాకులో ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు ఉన్నాయి.
- ఆకుల్లో నారింజ కంటే 7 రెట్లు అధికంగా విటమిన్ సీ ఉంటుంది.
- అరటిపండ్ల కంటే 15రెట్లు అధికంగా పొటాషియం ఉంటుంది.
- ఈ ఆకులో క్యాల్షియం, ప్రోటీన్, ఐరన్, అమైనో యాసిడ్స్ ఉంటాయి.
- ఇవి అనారోగ్యాన్ని నయం చెయ్యడానికి కండరాలను నిర్మించడానికి సహాయ పడతాయి.
- రోగ నిరోధక వ్యవస్థను రక్షించగల అనేక పదార్థాలు ఈ ఆకులో ఉన్నాయి.
- మునగాకు క్రమం తప్పకుండా తీసుకునే వారిలో రక్త పోటును తగ్గించ గలదని, శరీరంలో కొవ్వును తగ్గించగలదు అని నిరూపితమైంది.
- మునగాకు ద్రవం, వాపు, నొప్పిని తగ్గిస్తుంది.
- మునగాకు లో ఉండే ఇన్సులిన్ లాంటి ప్రోటీన్ లు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తాయి.
- ల్యాబ్ పరీక్షలలో ఆకు పదార్థాలు పాంక్రియాటిక్ క్యాన్సర్ కణాల పెరుగుదలను మందగించేలా చేశాయని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.
- మునగాకు లోని యాంటీ ఆక్సిడెంట్లు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపితమైంది.



గుర్తించడమిలా...!

మార్కెట్ అంతా కల్తీమయమయిపోయింది. ఏది స్వచ్ఛమైనదో.. ఏది కల్తీనో తెలియడం లేదు. మన దేశంలో తయారయ్యే తేనెలో ప్రముఖ బ్రాండ్లు కల్తీకి పాల్పడుతున్నాయట. సహజ ఔషధ గుణాలున్న తేనె.. మనకు ఎంతో అవసరం. స్వచ్ఛమైన తేనె ఎన్ని రోజులైనా పాడవదు. అంతేకాక అందులో ఉండే ఔషధ గుణాలు మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగం. కానీ కల్తీ తేనెలు వాడటం మూలాన అవి త్వరగా పాడవడం అటుంచితే దాని ద్వారా ఆరోగ్యం కూడా పాడైపోతుంది. ఇటువంటి నేపథ్యంలో స్వచ్ఛమైన తేనెను గుర్తించడానికి పలు మార్గాలున్నాయి. దీనిని మన ఇంటిలోనే చేసుకోవచ్చు. ఇందుకోసం పెద్దగా కష్టపడాల్సిన అవసరం కూడా లేదు. మన వంటింట్లో లభ్యమయ్యే వాటితోనే తేనెను చెక్ చేసుకోవచ్చు.

వెనిగర్ టెస్ట్ : తేనె అసలుదో నకిలిదో గుర్తించాలంటే వెనిగర్ ద్వారా ఇట్టే పట్టేయచ్చు. మీ ఇంట్లో మార్కెట్ నుంచి తీసుకొచ్చిన తేనె డబ్బాలోని రెండు, మూడు చుక్కల తేనెను వెనిగర్ నీటిలో వేయండి. అందులో నురుగులు వస్తే మాత్రం అది కచ్చితంగా కలుషితమైనదే.

నీటి పరీక్ష : తేనె స్వచ్ఛతను గుర్తించడానికి ఇది మరొక పరీక్ష. స్వచ్ఛమైన తేనె నీటిలో కరగదు. దీని కోసం తేనెను.. నీటిని కలపండి. నీటిలో కరిగితే మాత్రం అది చక్కెర ద్రావణమే. అసలైన తేనె నీటిలో వేసినా దానికుండే సహజ గుణాలను కోల్పోదు.

వేడి పరీక్ష : వేడి నీటి పరీక్ష ద్వారా కూడా తేనె కలుషితమైందో లేదో తెలుసుకోవచ్చు. తేనె డబ్బాలో ఒక అగ్గిపెట్టెను గానీ.. దూది ముక్కను గాని వేయండి. అనంతరం దానిని వెలిగించండి. మీరు మంటను చూడగలిగితే అది స్వచ్ఛమైన తేనె. అలా కాకుండా మండీ మండకుండా ఉంటే అది కలుషితమైంది.

ఇట్ల చేద్దాం



బొప్పాయి పండు కోసిన తర్వాత మిగిలిన ముక్క నిల్వ ఉండాలంటే ప్లాస్టిక్ రేపర్‌లో చుట్టి లేదంటే గాలి చొరబడని గాజు సీసాలో పెట్టి ఫ్రిడ్జ్‌లో పెట్టాలి. లేదంటే పాడయిపోతుంది.

సెన్సార్‌షిప్ కోసం బ్లూప్రింట్

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారు. భారత్‌లోని 69.2 కోట్ల మంది మొబైల్ వినియోగదారులు తమ ఫోన్‌లను "ఆన్‌లైన్ వీడియోలు", వార్తలు, చలనచిత్రాలు, ఇతర విషయాలను చూడటానికి ఎక్కువగా ఉపయోగిస్తున్నారని సమాచారం. ప్రజలకు వార్తలు, సమాచారం అనేది క్షణాల్లో చేరగలుగుతుంది. అయితే, ఈ బిల్లు ద్వారా ప్రసారాలు, వార్తలు వంటి వాటిపై మరిన్ని ఆంక్షలు వచ్చే ప్రమాదమున్నదని నిపుణులు, విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. బిల్లులో ప్రీ-సెన్సార్‌షిప్ అనే పదబంధం సంక్లిష్టంగా ఉంది. ఇది అన్ని స్థాయిల్లో 'కేంద్ర ప్రభుత్వం' ఉనికిని నిర్ధారిస్తుందని చెప్తున్నారు. కంటెంట్‌ని తీసివేయాలా? వార్తా వ్యక్తులకు జరిమానా విధించాలా? జైలు శిక్ష విధించాలా? పరికరాలను జప్తు చేయాలా? అనే దానిపై నిర్ణయం తీసుకునే అధికారం ఆ ప్రభుత్వానికే ఉంటుందంటున్నారు.

బ్రాడ్‌కాస్ట్ అడ్వైజరీ కౌన్సిల్ (బీఏసీ) ఎలా ఏర్పాటు చేయబడుతుంది? అది ఎలా పని చేస్తుంది? అని బిల్లులోని క్లాజ్ 27 చెబుతుంది. మీడియా రంగంలో 25 ఏండ్ల అనుభవం ఉన్న స్వతంత్ర సభ్యుడు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. అదనంగా, ఎంఐబీ, మహిళా-శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదుగురు ఎక్స్ అఫిషియో ప్రభుత్వ అధికారులు ఉంటారు. అదనంగా కేంద్రం నియమించిన ఐదుగురు "ప్రముఖ స్వతంత్ర వ్యక్తులు" ఉంటారని క్లాజ్ చెబుతున్నది. బీఏసీ అనేది ప్రోగ్రామ్ కోడ్ లేదా అడ్వర్టైజ్‌మెంట్ కోడ్ ఉల్లంఘన లేదా ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను వింటుంది. ఇది ప్రసార నెట్‌వర్క్‌లు, సేవల పరికరాలను తనిఖీ చేయగలదు, అడ్డగించగలదు, పర్యవేక్షించగలదు, స్వాధీనం చేసుకోగలదు. అయితే, ఈ విషయాలపై నిపుణులు, విశ్లేషకులు పలు రకాల అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. బలవంతపు పోలీసు చర్య సమయంలో జర్నలిస్టులు, పరిశోధకులు, ఇతరుల పరికరాలను జప్తు చేయటం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని అంటున్నారు. కీలకాధికారాలను కేంద్రానికి కట్టబెట్టే ఈ బిల్లు విషయంలో పౌర సమాజం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

పార్లమెంటులో తెలంగాణ సెంట్రల్ గిరిజన వర్సిటీ బిల్లు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలోని సమ్మక్క సారక్క సెంట్రల్ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన సెంట్రల్ యూనివర్సిటీ సవరణ బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది. ఈ బిల్లుకు అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయి. రెండు రోజుల పాటు వివిధ పార్టీల ఎంపీలు ఈ బిల్లుపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. బిల్లుకు 40 మంది ఎంపీలు సవరణలు సూచించారు. అనంతరం బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. చర్చల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ సవరణలు సూచించిన ఎంపీలందరికీ ధన్యవాదాలు తెలిపారు. గిరిజన డ్రాపౌట్స్, వివక్ష వంటి ప్రతిపక్ష ఎంపీలు చేసిన విమర్శలపై కేంద్ర మంత్రి సమాధానమిస్తూ కుటుంబ పరిమితులు చాలా మంది విద్యార్థులను విద్యకు దూరం చేశాయని అన్నారు. 'ఈ బిల్లును ఆమోదించడానికి మాకు తొమ్మిదేండ్లు పట్టింది. మీరు చాలా కాలం అధికారంలో ఉండి గిరిజనులకు చేసిందేమీ లేదు. ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం వల్ల ప్రయోజనం లేదు' అని అన్నారు. యూనివర్సిటీ నిర్మాణానికి భూములు సేకరించడంలో కేసీఆర్ ప్రభుత్వమే జాప్యం చేసిందని విమర్శించారు. రాబోయే కాలంలో ఈ యూనివర్సిటీ ఏర్పాటు ప్రాంతీయ ఆకాంక్షలను తీర్చగలదని అన్నారు. అలాగే ఉన్నత విద్య నాణ్యతను పెంచుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఉన్నత విద్య పరిశోధనా సౌకర్యాలను సులభతరం చేస్తుందని, ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. దేశంలోని గిరిజన జనాభాకు గిరిజన కళలు, సంస్కృతి, ఆచారాలు, సాంకేతికతలో పురోగతిలో బోధన, పరిశోధన సౌకర్యాలను అందించడంతో అధునాతన జ్ఞానాన్ని కూడా ప్రోత్సహిస్తుందని అన్నారు. వరంగల్ జిల్లా ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఈ యూనివర్సిటీ ఏర్పాటుకానుంది. గిరిజన యూనివర్సిటీని ఏడేండ్లలో రెండు దశల్లో రూ.889.07 కోట్లతో నిర్మించనున్నారు.

విద్యతో రాజకీయాలొద్దు : కేంద్రానికి ప్రతిపక్షాల హితవు

విద్యతో రాజకీయాలు చేయొద్దని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్ష ఎంపీలు హితవు పలికారు. ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కె ప్రేమచంద్రన్ మాట్లాడుతూ.. ప్రధాని బొమ్మతో విద్యార్థులు ఫోటోలు దిగేందుకు వీలుగా కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లు ఉంచితే, దాన్ని రాష్ట్రాలు కూడా అనుసరిస్తాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో సెల్ఫీ పాయింట్లు ఉంచాలని ముఖ్యమంత్రులు నోటీసులు జారీ చేస్తారు. ఇలాంటి రాజకీయాలే దేశ విశ్వవిద్యాలయాల ప్రతిష్టను దిగజార్చడానికి కారణమవుతాయి' అని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి చర్చను ముగించి 'సెల్ఫీ-అవగాహన' గల ప్రధాని.. 'విద్యా అవగాహన' కలిగి ఉండాలని ఎద్దేవా చేశారు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ), జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ (జేఎంయూ) వంటి ముస్లిం యూనివర్సిటీలకు 15 శాతం బడ్జెట్‌ను ఎందుకు తగ్గించారని కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ కేంద్రాన్ని ప్రశ్నించారు. 'కొత్త విశ్వవిద్యాలయాలను మాత్రమే ఎందుకు ప్రారంభిస్తున్నారు? ఇప్పటికే ఉన్న విశ్వవిద్యాలయాలను ఎందుకు బలోపేతం చేయరు?' అని ప్రశ్నించారు. బీఎస్‌పీ ఎంపీ రితేష్ పాండే మాట్లాడుతూ అటువంటి కేంద్రీయ విశ్వవిద్యాలయాలు తెరవకముందే దేశం అంతటా గిరిజనులకు అందించే ఏకలవ్య పాఠశాలలను బలోపేతం చేయాలని పునరుద్ఘాటించారు.

గిరిజన, మైనారిటీ విద్యార్థులపై వివక్ష

సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఎస్‌టీ హసన్ మాట్లాడుతూ యూనివర్సిటీల్లో గిరిజన, మైనారిటీ విద్యార్థులు ఎదుర్కొంటున్న వివక్షను ఎత్తిచూపారు. విద్యపై కేంద్రం ఎక్కువ ఖర్చు చేయాలని కోరుతూ, ఈ విశ్వవిద్యాలయాలు అందించే పాఠాలు ప్రాచీన భారతీయ విలువలను ప్రతిబింబించేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. బీజేపీ ఎంపీ సత్యపాల్ సింగ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోనూ కేంద్రీయ విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేయాలని కేంద్రాన్ని కోరారు. అదేవిధంగా, బిల్లుకు మద్దతు ఇస్తున్న శివసేన ఎంపీ అరవింద్ సావంత్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులను ప్రధాన స్రవంతి ఉన్నత విద్యలోకి తీసుకురావడానికి ఇటువంటి విశ్వవిద్యాలయాలలో సిలబస్‌లో సమానత్వం తీసుకురావాలని కోరారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు కులతత్వమే కారణం

యూనివర్సిటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు కులతత్వమే కారణమని ఎఐఎంఐఎం ఎంపీ ఇంతియాజ్ జలీల్ అన్నారు. ముస్లింల తరువాత ఎస్‌టీ వర్గంలో డ్రాప్ అవుట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ విశ్వవిద్యాలయాలలో కులతత్వం ప్రబలంగా ఉందని, దీన్ని ఖండించాలని అన్నారు.


స్వాధీనాలపై మార్గదర్శకాలేవీ?

(మొదటిపేజీ తరువాయి)

సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు ధులియాలతో కూడిన బెంచ్ స్పందిస్తూ 'మేం ఎప్పుడు నోటీసు జారీ చేశాం? ఇప్పటికే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి' అని వ్యాఖ్యానించింది. దీనిపై అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు బదులిస్తూ ఈ అంశంపై ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, మార్గదర్శకాల జారీకి ప్రభుత్వానికి మరికొంత సమయం అవసరమని చెప్పారు. మార్గదర్శకాలు వారం రోజుల్లో సిద్ధమవుతాయని రాజు తెలుపగా ఆ పని చేయండని బెంచ్ సూచించింది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల న్యూస్‌క్లిక్ పోర్టల్‌పై నమోదు చేసిన కేసులో 300 మంది పాత్రికేయుల నివాసాలపై దాడులు జరిగాయని సీనియర్ న్యాయవాది నిత్యా రామకృష్ణన్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఎలక్ట్రానిక్ పరికరాలను మొత్తంగా స్వాధీనం చేసుకోవడానికి బదులు ఆ పరికరాలలో అవసరమైన సమాచారాన్ని కాపీ చేసుకుంటే సరిపోతుందని ఆమె వాదించారు. కాగా మీడియా సిబ్బందికి చెందిన నివాసాలపై దాడులు చేయడం, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం తీవ్రమైన విషయమని గత నెల 7వ తేదీన జరిగిన విచారణ సందర్భంగా బెంచ్ వ్యాఖ్యానించింది. ఇది గోప్యత హక్కుకు సంబంధించిన విషయమని తెలిపింది. 'మీడియా సిబ్బంది చాలా మంది ఉంటారు. వారి ఫోన్లలో సమాచారమిచ్చే వ్యక్తుల వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు ఉంటాయి. కాబట్టి మార్గదర్శకాలు అవసరం. ఇది చాలా తీవ్రమైన విషయం' అని జస్టిస్ కౌల్ అన్నారు.

పక్షం రోజుల్లోనే పార్టీలకు వెయ్యి కోట్ల విరాళం !

(మొదటిపేజీ తరువాయి)



శాసనసభ ఎన్నికల సందర్భంగా పార్టీలకు అందిన విరాళాలతో పోలిస్తే ఇది ఏకంగా 400% అధికం. 2018 నవంబర్ 1-11 తేదీల మధ్య పార్టీలకు ఎన్నికల బాండ్ల విక్రయం ద్వారా అందిన విరాళం రూ.184.20 కోట్లు మాత్రమే. రాజకీయ పార్టీలకు పెద్ద మొత్తంలో విరాళాలు అందించాలని అనుకునే వారు, కార్పొరేట్ సంస్థలు ఎస్‌బీఐలో ఆ మేరకు బాండ్లు కొనుగోలు చేసి, పార్టీలకు ఇవ్వాల్సి ఉంటుంది. వాటిని ఆయా పార్టీలు నగదు రూపంలో మార్చుకుంటాయి. ఎస్‌బీఐకి చెందిన 29 బ్రాంచీలలో బాండ్లను విక్రయిస్తారు. పార్టీలు వాటిని సొమ్ము చేసుకునే వెసులుబాటు కూడా ఆ బ్రాంచీలలోనే ఉంటుంది.

ఎస్‌బీఐ జారీ చేసిన బాండ్లలో 89.9% బాండ్లు ఒక్కోటి కోటి రూపాయల విలువ కలవి. మొత్తం 1,109 బాండ్లను కొనుగోలు చేశారు. హైదరాబాద్, ముంబయి, ఢిల్లీలోని బ్రాంచీలలోనే 79% అమ్మకాలు జరిగాయి. అత్యధికంగా హైదరాబాద్‌లో రూ.359 కోట్లు, ముంబయిలో 259.30 కోట్లు, ఢిల్లీలో రూ.182.75 కోట్ల విలువైన బాండ్లను విక్రయించారు. ఢిల్లీలో రూ.882.80 కోట్ల విలువైన బాండ్లను బ్యాంక్ బ్రాంచీలలో ఇచ్చి నగదు తీసుకున్నారు. రూ.81.50 కోట్లతో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. అంటే హైదరాబాద్, ముంబయి, ఢిల్లీలో కొనుగోలు చేసిన బాండ్లను ఎక్కువగా ఢిల్లీలో ఇచ్చి నగదు తీసుకున్నారన్న మాట. అంటే దీనర్థం ఎక్కువ విరాళాలు జాతీయ పార్టీలకే చేరాయి.

ఎన్నికల బాండ్ల వ్యవహారం అంతా గోప్యంగా ఉంటుంది. తాము ఎంత విలువైన బాండ్లు తీసుకుంటున్నాము, ఎవరికి ఇస్తున్నాము అనే సమాచారాన్ని వ్యక్తులు కానీ, సంస్థలు కానీ బయటపెట్టాల్సిన అవసరం లేదు. ఇవి వడ్డీ లేని బాండ్లు. రాజకీయ పార్టీలు కూడా తమకు ఎక్కడి నుండి విరాళాలు వచ్చాయో చెప్పనక్కరలేదు. ఎన్నికల బాండ్ల ద్వారా పొందిన మొత్తం సొమ్ము వివరాలను మాత్రం ఆడిట్ చేసిన ఖాతాల స్టేట్‌మెంట్ల రూపంలో ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడో మతలబు ఉంది. ఎస్‌బీఐ కేంద్ర ప్రభుత్వ సంస్థ కాబట్టి దాతల వివరాలను ఆ బ్యాంకు నుండి ప్రభుత్వం సేకరించే అవకాశం ఉంటుంది.

కొలువుదీరిన కొత్తసర్కార్

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందన్నారు. ఎన్నో పోరాటాల తర్వాత రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ త్యాగాల పునాదులపై నిర్మించబడిందని తెలిపారు. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల ఆకాంక్షలను నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో గత పదేండ్లుగా ప్రజాస్వామ్యం నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని చెప్పారు. తమ సమస్యలను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదిక లేకపోవడంతో ప్రజలు మౌనంగా ఉన్నారని తెలిపారు. కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కాంగ్రెస్ కార్యకర్తల మద్దతుతో 'ప్రజా తెలంగాణ ప్రభుత్వం' ఏర్పడిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు ప్రక్రియతో తెలంగాణ ప్రజలు స్వాతంత్ర్యం పొందారని ప్రకటించారు. తమ రాష్ట్ర మంత్రివర్గం తెలంగాణ ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో సమానాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ప్రగతి భవన్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను బద్దలు కొట్టి ప్రగతి భవన్‌లోకి స్వేచ్ఛగా ప్రజలకు ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలు, ఆకాంక్షలు, వారి ఆలోచనలను ప్రభుత్వంతో పంచుకునేందుకు స్వాగతం పలుకుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందరి సలహాలు తీసుకుని సంక్షేమ రాజ్యాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు.

నేటి నుంచి ప్రజాదర్బార్

ప్రజలకు అందుబాటులో లేని ప్రగతిభవన్ పేరును శుక్రవారం నుంచి జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చుతున్నట్టు సీఎం రేవంత్ ప్రకటించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. ప్రజల హక్కులను కాపాడే బాధ్యతను తానే తీసుకుంటానన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి, శాంతి భద్రతలు పరిరక్షించేందుకు ప్రాధాన్యతనిస్తానని హామీ ఇచ్చారు. భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. నిస్సహాయులను నిర్లక్ష్యం చేయరాదనే విశ్వాసాన్ని కలిగిస్తానని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గేల స్ఫూర్తితో కొత్త ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ జెండాను వదులుకునేందుకు కార్యకర్తలెవరూ సిద్ధంగా లేరనీ, అందుకే కష్టపడి కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని తెలిపారు. 'మీ కష్టాన్ని గుర్తుంచుకుంటాను. మీ అందరినీ నా హృదయంలో ఉంచుకుంటాను. పదేండ్లు కష్టపడి పని చేసిన కార్యకర్తలను ఆదుకునే బాధ్యతను నాయకుడిగా తీసుకుంటాను. రాహుల్, ప్రియాంక ఢిల్లీలో మమ్మల్ని కుటుంబ సభ్యులుగా పరిగణిస్తారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం మన విద్యార్థులు, నిరుద్యోగులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తుంది' అని తెలిపారు.

ఎన్నికల హామీలకు భరోసా


ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించిన ఫైలుపై సీఎం రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగి తుమ్మరి రజినీకి ఉద్యోగం మంజూరు చేస్తూ...సీఎం రేవంత్ రెడ్డి రెండో ఫైలుపై సంతకం చేశారు. వేదికపైనే రజినీకి ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేశారు.

మంత్రులు కాకుండానే..!

కాగా, ఇప్పటివరకూ రేవంత్‌రెడ్డి మంత్రి కాకుండానే ముఖ్యమంత్రి అయ్యారు. జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ పదవులను ఆయన ఇప్పటివరకు నిర్వర్తించారు. డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన మల్లు భట్టి విక్రమార్క ఏకంగా డిప్యూటీ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క మొదటిసారి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. రేవంత్, సీతక్క ప్రమాణం



చేస్తున్న సందర్భంగా ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది.వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రేవంత్, ఉత్తమ్, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు తదితరులు 'దైవసాక్షిగా' ప్రమాణ స్వీకారం చేయగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క 'పవిత్ర హృదయం'తో ప్రమాణం చేశారు. వీరంతా తెలుగులో ప్రమాణం చేయగా, దామోదర రాజనర్సింహ ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు.


రేవంత్‌కు
ప్రధాని మోడీ సహా పలువురి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రెండో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు ట్వీట్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా శ్రేయస్సుకు కావాల్సిన పూర్తి తోడ్పాటునందిస్తానని మోడీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ సీఎం రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్టు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు రేవంత్ ప్రజలకు మెరుగైన సేవలందించాలనీ, పరిపాలన ప్రజారంజకంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజా సేవ చేసే దిశగా ఆయన భవిష్యత్తు విజయవంతం కావాలని ఆకాంక్షిం చారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు... అన్ని పక్షాలను కలుపుకుని రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని రేవంత్‌కు సూచించారు. ప్రజా శ్రేయస్సు, అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన కొనసాగించాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్ రావు, రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, మంత్రులకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు దిశగా ప్రభుత్వం పనిచేయాలని ఆకాంక్షిం చారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, నందమూరి రామకృ ష్ణ, సినీ నటుడు చిరంజీవి, గాయని స్మిత, స్టేట్ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ తదితర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



ఉప్పొంగిన అభిమానం

- కిక్కిరిసిన ఎల్బీస్టేడియం
- అట్టహాసంగా రేవంత్ ప్రమాణ స్వీకారం
- గవర్నర్‌కూ తప్పని ట్రాఫిక్ కష్టాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జనం పోటెత్తారు. గుండెల నిండా అభిమానాన్ని నింపుకుని, కాంగ్రెస్ జెండాలను బుజాలకెత్తుకుని తమ అభిమాన నేత సీఎంగా పదవి బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి రాష్ట్రం నలుమూల నుంచి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియానికి జనత తరలి వచ్చారు.. కాంగ్రెస్ జిందాబాద్, రేవంత్ రెడ్డి జిందాబాద్ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఆ పార్టీ ముఖ్యనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు తెలంగాణలో సాధారణ ప్రజలను సైతం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించడంతో వారు భారీగా తరలి వచ్చారు. స్టేడియం కేపాసిటీ 80 వేలు



కాగా, సాధారణ ప్రజల కోసం 30 వేల సీట్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకే మైధానం నిండి పోవడంతో నిజాం కాలేజి ఎదురుగా ఉన్న రెండు గేట్లను మూసేశారు. దాంతో దూర ప్రాంతాలనుంచి తరలి వచ్చిన ప్రజలు స్టేడియం చుట్టూ రోడ్లపైనే ఉండిపోయారు. పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ నుంచి మొదలుకుని నిజాం కాలేజి వరకు పరిసరాలన్ని జన జాతరను తలపించాయి.. స్టేడియంలోకి వెళ్లలేని వారు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించారు. సభా స్థలికి వెళ్లే క్రమంలో జనం ఒక్కసారిగా అసెంబ్లీ పరిసరాల్లో పోటెత్తడంతో గవర్నర్ తమిళిసైతో పాటు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తదితర నేతలు ట్రాఫిక్‌లో ఇరుక్కు పోయారు. హైరానా పడ్డ పోలీసులు వారిని సొంత వాహనాల నుంచి దించి ప్రత్యేక వాహనంలో సభా ప్రాంగణానికి చేర్చారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు చేశామని పోలీసులు ముందే చెప్పినప్పటికీ సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పదేండ్ల తర్వాత కాంగ్రెస్ జెండా ఎగిరింది

'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా పదేండ్ల తర్వాత ఎగిరింది. ఈ సంతోషం చెప్పలేనిది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కాదని 2014లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరించారు. రెండు దఫాల పాలన తర్వాత బీఆర్ఎస్ మోసాలకు ప్రజలు చరమ గీతంపాడారు.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటె కాంగ్రెస్‌తోనే సాధ్యమనే వాస్తవం తెలుసుకున్నందుకు తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు"

రవి, లక్ష్మీదేవి పల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా.

అహంకారానికి ప్రజల గుణపాఠం

"తెలంగాణలో గడీల పాలన అంతమైంది. అహంకారానికి ప్రజలు సమాధి కట్టారు. తెలంగాణ నేనే తెచ్చాను అని ప్రజలకు మాయ మాటలు చెప్పి కేసీఆర్ అధికారాన్ని దక్కించుకున్నారు. వాస్తవాలను గ్రహించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారు"

ఎండీ, నయీమ్, మక్తల్, నారాయణ పేట జిల్లా.

రేవంత్ అంటె వీరాభిమానం

రేవంత్ అంటే వీరాభిమానం. గత పదేండ్లుగా ఆయనతోనే నా ప్రయాణం. ప్రజలు మెచ్చిన నాయకులు రేవంత్ రెడ్డి. తెలంగాణకు ఆయన లాంటి ముఖ్యమంత్రి ఎంతైనా అవసరం. తెలంగాణ ప్రజలు చూపించిన అభిమానం వెల కట్టలేనిది" గణేశ్, జోగిపేట, సంగారెడ్డి జిల్లా.

సీఎం.. వెల్‌కమ్...



- ముఖ్యమంత్రిగా సచివాయంలోకి అడుగుపెట్టిన రేవంత్
- ఉద్యోగుల హర్షధ్వానాల మధ్య కాలినడకన లోపలికి
- ఘన స్వాగతం పలికిన సీఎస్, డీజీపీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఉన్నతాధికారుల శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నూతన సెక్రటేరియట్‌ను గతంలో పరిశీలించేందుకు వచ్చి అరెస్టయిన రేవంత్‌రెడ్డి... గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అడుగుపెట్టారు. సచివాలయ అధికారులు, ఉద్యోగుల హర్షధ్వానాలు, అభిమానుల కేరింతల మధ్య ఆయన అక్కడి ప్రధాన ద్వారం నుంచి కాలినడకన లోపలికి విచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తా, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో ఎదురేగి ఘన స్వాగతం పలికారు. ఎల్బీ స్టేడియంలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రేవంత్... సాయంత్రం 4.20 గంటలకు సచివాలయానికి చేరుకున్నారు. పోలీస్ అధికార బ్యాండ్‌తో ఆయనకు స్వాగతం పలికిన అనంతరం... సాయంత్రం 4.30 గంటలకు అక్కడి ఆరో అంతస్తులోగల ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకున్నారు. లోనికి ప్రవేశించగానే ఆయనకు వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. రేవంత్ తన సతీమణి గీతతో కలిసి పూజలు నిర్వహించారు. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం... సాయంత్రం 4.46 నిమిషాలకు సీఎం తన అధికారిక కుర్చీపై ఆసీనులయ్యారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు మిగతా మంత్రులు, సీఎస్, డీజీపీ, పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వివిధ శాఖాధిపతులు, సచివాలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు... రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886



సీఎం రేవంత్‌రెడ్డి సీఐటీయూ అభినందనలు

కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతనంగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎనుముల రేవంత్‌రెడ్డికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. తెలంగాణ ప్రజా ప్రభుత్వం కార్మికుల సమస్యల సత్వర పరిష్కారానికి తగిన ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ తన అభయహస్తం మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలతో పాటు కార్మిక సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే సమస్యలను కూడా సత్వరం పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. గురువారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ జీఓలను సవరించాలనీ, విడుదలైన ఐదు జీఓలకు గెజిట్ జారీ చేసి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందిని పర్మినెంట్ చేయాలనీ, సమానపనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో పనిచేసే గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచడం, ఉద్యోగ భద్రత కల్పించడం, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయడం, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం వంటివి చేయాలని కోరారు. బీడీ పరిశ్రమ రక్షణకు చర్యలు తీసుకోవాలనీ, బీడీ కార్మికులందరికీ షరతులు లేకుండా జీవనభృతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీల్లోని కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ఐకెపి విఓఏలకు కనీస వేతనాలు నిర్ణయించి సెర్ప్ ద్వారా ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలనీ, రెండో ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, స్కీంవర్కర్ల సమ్మెల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు.

కీలకమైన 20 మినరల్ బ్లాక్‌లు వేలం

- ఆక్షన్‌ను ప్రారంభించిన కేంద్రం
- కొత్త చట్టం ద్వారా ప్రభుత్వానికి అధికారం
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టీకరణ

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు కీలకమైన ఖనిజాల బ్లాక్‌ల వేలంతో సొమ్ము చేసుకోవాలని చూస్తున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వం దేశవ్యాప్తంగా 30 కీలకమైన ఖనిజాలను గుర్తించింది. ఛత్తీస్‌గఢ్, కేంద్రపాలి ప్రాంతం (యూటీ)లోని లిథియంతో సహా ఎనిమిది రాష్ట్రాల్లో 20 గనుల వేలం ప్రక్రియను గతనెల 29న ప్రారంభించింది. "భారత ప్రభుత్వం ఈ ఏడాది నవంబర్ 29న ఈ ఖనిజాల వేలం మొదటి విడతను 20 బ్లాక్‌ల కీలకమైన, వ్యూహాత్మక ఖనిజాల కోసం ప్రారంభించింది" అని గనులు, బొగ్గు మరియు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి లోక్‌సభకు లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు.

రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్‌గా శివధర్‌రెడ్డి నియామకం

త్వరలోనే మరికొందరు ఐపీఎస్‌ల బదిలీలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్ర పోలీసు శాఖలో అత్యంత కీలకమైన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అదనపు డీజీ శివధర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెంటనే శివధర్‌రెడ్డిని ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించుకుంటూ ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర రైల్వే పోలీసు, రోడ్ సేఫ్టీ విభాగానికి అదనపు డీజీగా శివధర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యతలను శివధర్‌రెడ్డి స్వీకరించారు. 1994 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్‌రెడ్డి.. నగర సౌత్ జోన్ డీసీపీగా, నల్గొండ ఎస్పీగా, శ్రీకాకుళం ఎస్పీగా, యాంటీ నక్సలైట్ నిఘా విభాగం (ఎస్ఐబీ) డీఐజీగా, వైజాగ్ కమిషనర్‌గా పని చేసిన ఆయన సమర్థుడైన ఐపీఎస్ అధికారిగా పేరు పొందారు. ముఖ్యంగా, తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడగానే కేసీఆర్ ఆయనను తన ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా కీలకమైన బాధ్యతలను అప్పగించారు. కాగా, రెండున్నరేండ్లకే శివధర్‌రెడ్డిని హఠాత్తుగా పదవి నుంచి నుంచి తప్పించిన కేసీఆర్.. లూప్‌లైన్‌లోకి మార్చారు. తాజాగా, రేవంత్‌రెడ్డి.. శివధర్‌రెడ్డి సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆయనకు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పోస్టింగ్ ఇచ్చినట్టు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించటంతో పాటు రాజకీయ ప్రత్యర్థుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగట్టి ముఖ్యమంత్రికి రెండు కండ్లుగా ఇంటెలిజెన్స్ చీఫ్ వ్యవహరిస్తారనే భావన పోలీసు శాఖలో ఉన్నది. దీంతోపాటు త్వరలోనే ఇంటెలిజెన్స్ చీఫ్ ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లతో పాటు మరికొన్ని కీలకమైన పోలీసు విభాగాల అధిపతులను ముఖ్యమంత్రి బదిలీ చేసే అవకాశమున్నదనే ఊహాగానాలు పోలీసు శాఖలో సాగుతున్నాయి.

ఆధునిక క్రికెట్ అగ్ర జట్లలో టీమ్ ఇండియా ఒకటి. టెస్టు, వన్డే ఫార్మాట్లలో భారత్‌కు గట్టి పోటీ ఇచ్చే జట్లు తక్కువే. కానీ టీ20 ఫార్మాట్‌లో పరిస్థితి విభిన్నం. టీమ్ ఇండియా బలహీనంగా కనిపించే ఫార్మాట్లలో టీ20 ముందుంటుంది. మరో ఆరు నెలలో 2024 టీ20 ప్రపంచకప్ వేట షురూ కానుండగా.. భారత్ యువ సేనను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. సొంతగడ్డపై ఆసీస్‌ను చిత్తు చేసి ఇప్పుడు సఫారీ సవాల్‌కు సిద్ధమైంది. ఆదివారం నుంచి భారత్, దక్షిణాఫ్రికా టీ20 సిరీస్ ఆరంభం.

సఫారీ సవాల్

- కుర్రాళ్లను ప్రయోగిస్తున్న భారత్
- దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్
- పొట్టి ప్రపంచకప్ సన్నాహకం

నవతెలంగాణ క్రీడావిభాగం





కఠిన పరీక్ష

2023 ఐసీసీ ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్ వంద శాతం ప్రదర్శన కనబరిచారు. వరుసగా పదికి పది మ్యాచుల్లో విజయాలతో అద్భుతమే చేశారు. ఫైనల్లో గెలిస్తే సరికొత్త చరిత్రే సృష్టించేవారే. ప్రపంచకప్ ఓటమి బాధలో ఉన్న ఈ జోడీకి బీసీసీఐ ఊహించని ఆఫర్ ఇచ్చింది. ద్రవిడ్ అండ్ కో కాంట్రాక్టు పొడగించగా.. 2024 టీ20 ప్రపంచకప్ సారథ్య పగ్గాలు అందుకోమని రోహిత్‌ను కోరింది. ఇటు ద్రవిడ్, అటు రోహిత్‌లు ఇప్పటివరకు ప్రపంచకప్ విజయం ఎరుగరు. కోచ్‌గా ఆ ఘనత కొట్టాలని ద్రవిడ్.. ఆటగాడిగా ఆ కప్పు అందుకోవాలనే రోహిత్ పట్టుదలగా కనిపిస్తున్నారు. టీ20 డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం మార్చటం ఇప్పటికిప్పుడు ఈ జోడీకి కష్ట సాధ్యమే. అయినా.. 2024 టీ20 ప్రపంచకప్ వేటకు ద్రవిడ్, రోహిత్ సిద్ధమయ్యారు. ఈసారి గురి తప్పితే వ్యక్తిగతంగా విమర్శలు ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉందనే విషయం ద్రవిడ్, రోహిత్‌లకు బాగా తెలుసు. మరి ఈ కఠిన పరీక్షను ఈ జోడీ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహిస్తున్నారు. స్వదేశంలో అఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు రోహిత్ పగ్గాలు అందుకునే అవకాశం ఉంది.

దంచికొట్టేవాళ్లే కావాలి

టీ20 ఫార్మాట్‌లో అగ్ర జట్టు, పసికూన అంటూ పెద్దగా వ్యత్యాసం ఉండదు. జోరు సాగితే ప్రపంచ చాంపియన్ సైతం పసికూన ముంగిట తలొంచాల్సిందే. అతి వేగంగా సమీకరణాలు మారే ఈ ఫార్మాట్‌లో అంతే వేగంగా ధనాధన్ జోరు చూపించే ఆటగాళ్లు అవసరం. యువ వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మ అందుకు చక్కటి ఉదహరణ. క్రీజులోకి వచ్చి ఎదుర్కొన్న తొలి బంతి నుంచే ఎదురుదాడి చేస్తూ బౌండరీలు సాధిస్తున్న జితేశ్ విమర్శకుల మెప్పు పొందాడు. అటువంటి ఆటగాళ్లు మిడిల్ ఆర్డర్‌లో భారత్‌కు అత్యవసరం. సూర్యకుమార్ యాదవ్, జితేశ్ శర్మ రింకూ సింగ్‌లకు మరో ఇద్దరు తోడైతే భారత్‌కు ఎదురుండదు. అయితే, భారత జట్టులో ఓ సంస్థాగత సమస్య నెలకొంది. సీనియర్ ఆటగాడు జట్టులోకి రాగానే అప్పటి వరకు మెరుగ్గా రాణిస్తున్న కుర్ర క్రికెటర్‌ను బెంచ్‌కు పరిమితం చేస్తారు. సన్నాహక మ్యాచుల్లో కుర్రాళ్లు ఆడితే.. అసలు టోర్నీలకు సీనియర్లు దర్శనం ఇస్తారు. ఇక్కడే టీమ్ ఇండియా ప్రణాళిక పట్టాలు తప్పుతోంది. సీనియారిటీ, పాపులారిటీ కాకుండా.. దంచికొట్టగలడా? లేదా అనేది మాత్రమే చూడాలి. ఎందుకంటే ఈ ఫార్మాట్‌లో ఫామ్, సగటు.. అంటూ గణాంకాలు పెద్ద లెక్క కాదు. ఎంత తక్కువ బంతుల్లో ఎన్ని ఎక్కువ పరుగులు చేశామనేది కీలకం.

మిడిల్ లెక్క తేలాలి

టీ20 ప్రపంచకప్‌కు కెప్టెన్‌గా రోహిత్ శర్మ రానున్నాడు. వరల్డ్‌కప్‌లో అతడి జోరు చూశాక.. ఈ ఫార్మాట్‌లో సరిపోతాడని అందరూ అనుకున్నారు. రోహిత్ రాకతో మరో ఓపెనర్ బెర్త్ కోసం తీవ్ర పోటీ కనిపిస్తుంది. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, శుభ్‌మన్ గిల్ రేసులో ఉన్నారు. ఈ ముగ్గురిలో ఎవరు వేగంగా పరుగులు చేస్తారో వారికే అవకాశం దక్కవచ్చు. ఇక నం.3 బ్యాటర్‌గా విరాట్ కోహ్లికి అవకాశం ఇస్తారా? జట్టు అవసరాల దృష్ట్యా ధనాధన్ బ్యాటర్‌ను దింపుతారా? అనేది తేలాలి. శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మలు ఈ స్థానం కోసం పోటీపడుతున్నారు. విరాట్ కోహ్లి వస్తే సహజంగానే అతడికే మొగ్గు ఉంటుంది. కానీ ఆచితూచి ఆడుతూ పరుగులు చేయటం వలన ప్రయోజనం ఉండదు. జట్టు అవసరాల మేరకు ఆడేందుకు విరాట్ అంగీకరిస్తాడా? చూడాలి.

అదో అనుకూలత!

డర్బన్ టీ20లో సఫారీ సవాల్ మొదలవనుంది. దక్షిణాఫ్రికా జట్టులో నాణ్యమైన సీమర్లు ఉన్నారు. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో మన పేసర్లు సైతం రాణించగలరు. 2024 టీ20 ప్రపంచకప్ అమెరికా, వెస్టిండీస్‌లో జరగనుంది. కరీబియన్ దీవులను మినహాయిస్తే.. అమెరికా పిచ్‌లు, పరిస్థితులు అందరికీ కొత్తే. ఈ ఫార్మాట్‌లో కాస్త వెనుకంజలో నిలిచిన భారత్‌కు ఇది పెద్ద సానుకూలత. గతంలో వెస్టిండీస్‌తో కొన్ని టీ20 మ్యాచులు అమెరికాలో ఆడిన అనుభవం భారత్ సొంతం. అక్కడి పరిస్థితులకు అనుగుణంగా.. మంచి కుర్ర జట్టును సిద్ధం చేయగలిగితే భారత్ పొట్టి ప్రపంచకప్ వేటలో ఓ అడుగు ముందుకేసినట్టు అవుతుంది. సఫారీతో సిరీస్‌లో సూర్య సారథ్యంలో ప్రయోగించిన కుర్ర జట్టు విజయవంతమైతే.. ఆ కుర్రాళ్లకు ప్రపంచకప్ జట్టులోనూ చోటు కల్పించాలి. లేదంటే, గతంలో ఎన్నో సార్లు చూసిన ఫలితాలనే మళ్లీ చూడక తప్పదు.

నవచిత్రం

దూతకు.. ప్రేక్షకుల స్పందన అద్భుతం



శరత్ మరార్

నాగ చైతన్య 'దూత' వెబ్ సిరీస్‌తో ఓటీటీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ వెబ్ సిరీస్‌కి విక్రమ్ కె కుమార్ దర్శకత్వం వహించారు. ప్రియా భవానీ శంకర్, పార్వతి తిరువోతు, ప్రాచీ దేశాయ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై శరత్ మరార్ నిర్మించారు. ఈనెల 1 నుంచి ప్రైమ్ వీడియోలో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో ప్రసారమైన 'దూత' వెబ్ సిరీస్ యునానిమస్ బ్లాక్ బస్టర్ రెస్పాన్స్‌తో బిగ్గెస్ట్ ఓటీటీ హిట్‌గా ప్రేక్షకులని అలరిస్తోంది.

ఈ నేపథ్యంలో నిర్మాత శరత్ మరార్ మీడియాతో మాట్లాడుతూ, "దూత'తో ఓటీటీలో మాసీవ్ బ్లాక్‌బస్టర్ సాధించడం, ప్రేక్షకుల నుంచి గొప్ప స్పందన రావడం సంతోషాన్ని ఇచ్చింది. నాగచైతన్య, విక్రమ్.. టీం అంతా రిజల్ట్ పై చాలా హ్యాపీగా ఉన్నారు. లాంగ్ ఫార్మట్ స్టోరీ టెల్లింగ్ అనేది ఇండియాలో కొత్త ఫార్మాట్. కొన్ని సిరీస్‌లు వచ్చినప్పటికీ ఇంకా కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్లే. ఈ క్రమంలో చేసిన ప్రాజెక్ట్‌కు ఇంత మంచి స్పందన రావడం వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్. దర్శకుడు విక్రమ్ కుమార్ ఈ కథ చెప్పినప్పుడు 'దూత' ఆలోచన, కాన్సెప్ట్ చాలా నచ్చింది. ఆయన అద్భుతమైన కథకుడు. కాన్సెప్ట్ కూడా చాలా యూనిక్‌గా ఉంటుందని ముందే తెలుసు. అయితే ఈ ఆలోచనని ఎనిమిది ఎపిసోడ్స్‌గా ఎలా మలుస్తారనే క్యురియాసిటీ ఉండేది. కొన్ని నెలలు తర్వాత ఎపిసోడ్స్ వారీగా కథ చెప్పారు. అద్భుతంగా అనిపించింది. తర్వాత అమెజాన్ వాళ్ళు పార్ట్‌నర్స్‌గా వచ్చారు. గొప్పగా సపోర్ట్ చేశారు. క్రియేటివ్‌గా చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. బ్రహ్మానందం తనయుడు గౌతమ్ పాత్రని అందరూ సర్‌ప్రైజ్‌గా ఫీలవుతున్నారు. పవన్‌కళ్యాణ్‌తో మూడు సినిమాలు చేశాను. మంచి కథ కుదిరితే ఆయనతో తప్పకుండా సినిమా చేస్తాను. అలాగే మా అబ్బాయిని దర్శకుడిగా ఎప్పుడు పరిచయం చేస్తారని అందరూ అడుగుతున్నారు. తను పర్మిషన్ ఇచ్చిన వెంటనే దర్శకుడిగా లాంచ్ చేస్తా' అని అన్నారు.



అభిమాని కోసం సెలబ్రిటీ ఆడే ఆట

మంచు మనోజ్ హోస్ట్‌గా 'ఉస్తాద్' ర్యాంప్ ఆడిద్దాం.. పేరిట సరికొత్త టాక్ షో ప్రేక్షకులను అలరించనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.


ఈ టాక్ షో ఈనెల 15 నుంచి ఈటీవీ విన్‌లో ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో ప్రోమో రిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ చాలా గ్రాండ్‌గా నిర్వహించారు. మంచు మనోజ్ మాట్లాడుతూ, 'ఇంతకుముందు సినిమాలు చేయాలనే ప్యాషన్, గోల్‌తో చేశాను. ఇప్పుడు ప్యాషన్ కంటే బాధ్యతతో వచ్చాను. గ్యాప్ తీసుకున్నందుకు ఫ్యాన్స్ నన్ను క్షమించాలని కోరుతున్నాను. కానీ సారి థౌజండ్ కాదు లక్ష కోట్లవాలా పటాకులు పేలబోతున్నాయి. అలాంటి టీం దొరికింది. ఈటీవీ నుంచి రామోజీరావు, బాపినీడు, సాయికృష్ణ, నితిన్, సాయి కిరణ్ అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి టీజీ విశ్వ ప్రసాద్ , వివేక్ కూచిబొట్ల ఎంతో సపోర్ట్ చేశారు. ఈ షో కాన్సెప్ట్ నాకు చాలా నచ్చింది. ఇదొక సెలబ్రిటీ గేమ్ షో. తమని ఎంతగానో అభిమానించే ఫ్యాన్స్ కోసం సెలబ్రిటీలు ఆడే ఆట ఇది. ఫ్యాన్ కోసం సెలబ్రేటీ ఆట ఆడి వాళ్ళకు డబ్బు ఇవ్వడం అనేది చాలా గొప్ప కాన్సెప్ట్. ఈ ఆటలో సెలబ్రిటీ గెలుచుకున్న మొత్తాన్ని ఆ అభిమానికి ఇచ్చేస్తాం. అదే ఈ షో స్పెషాలిటీ. ప్రైజ్ మనీ వచ్చేసి.. రూ.50 లక్షలు, స్పెషల్ గిఫ్ట్‌లు కూడా ఉంటాయి. ఈ షోతో ఫ్యాన్స్‌కి మరింత దగ్గరగా ఉండొచ్చు' అని తెలిపారు.



అత్యంత భయానక చిత్రం

శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం హర్రర్ చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా ఈనెల 15వ తేదీన విడుదల కానుంది.

తాజాగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ఈశ్వరీ రావుతో "మరణం అనేది నిజంగానే అంతమా?. మరణించిన తరువాత ఏం జరుగుతుంది అనేది ఎవరైనా చెప్పగలరా?. కోరికలు తీరని వారి ఆత్మలు ఈ భూమ్మీద నిలిచిపోతాయా?. ఆ ఆత్మలు మనకు నిజంగానే హాని చేయగలవా?" అంటూ నిజ జీవితంలో కూడా ఎందరో తెలుసుకోవాలనుకునే ఆసక్తికర విషయాలను అవసరాల శ్రీనివాస్ అడగడంతో ప్రారంభమైన ట్రైలర్ ఆద్యంతం క్యూరియాసిటీ పెంచింది. యదార్థ సంఘటనల ఆధారంగా రాసుకున్న కథ అని, ఇంతటి భయానక హర్రర్ చిత్రాన్ని టాలీవుడ్ ఇంతవరకూ చూడలేదని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమా కథ ప్రస్తుతం, అలాగే 1990, 1930లలో.. ఇలా మూడు కాలక్రమాలలో జరుగుతుంది. స్క్రీన్‌ప్లే ఈ





స్వచ్ఛమైన ప్రేమకథ

కిషోర్ కేఎస్ డి, దియా సితెపల్లి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ప్రేమకథ'. ఈ చిత్రాన్ని టాంగా ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్ పీ, సినీ వ్యాలీ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. ఉపేందర్ గౌడ్ ఎర్ర సహ నిర్మాత. శివశక్తి రెడ్ డీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని త్వరలో థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

ఈ నేపథ్యంలో ఈచిత్ర ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ విజయ్ మట్టపల్లి మాట్లాడుతూ, 'ఈ సినిమాను దాదాపు అంతా కొత్తవాళ్లతో నిర్మించాం. థియేటర్ నుంచి వచ్చిన టాలెంటెడ్ యాక్టర్స్ మా సినిమాలో నటించారు. మాకు వర్ధన్ దేవరకొండ, మధుర శ్రీధర్ రెడ్డి, శింగనమల కల్యాణ్ బాగా సపోర్ట్ చేశారు. మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన హీరో విజయ్ దేవరకొండకి, అలాగే మా సినిమా ప్రమోషన్స్‌కు సపోర్ట్ చేసి ఫస్ట్ లుక్, సాంగ్స్ రిలీజ్ చేసిన హీరో ఆనంద్ దేవరకొండ, డైరెక్టర్స్ హరీశ్ శంకర్, హనురాఘవపూడి, మారుతికి థ్యాంక్స్. ఒక జెన్యూన్ లవ్‌స్టోరితో మా "ప్రేమకథ" సినిమాను నిర్మించాం' అని తెలిపారు.

ఊర్లో అందరికీ మతిమరుపు ఉంటే?



'తికమకతాండ' అనే ఊరిలోని ప్రజలందరికీ మతిమరుపు అనే ఒక కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం ఈనెల 15న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్‌గా గ్రాండ్‌గా నిర్వహించారు.

ట్విన్స్ హరికృష్ణ, రామకృష్ణ హీరోలుగా యాని, రేఖ నిరోషా హీరోయిన్లుగా వెంకట దర్శకత్వంలో వస్తున్న సినిమా ఇది. నిర్మాతలు సి. కళ్యాణ్, దామోదర్ ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డైరెక్టర్ వెంకట్ మాట్లాడుతూ, 'ఒక మంచి సినిమా తీశానని కచ్చితంగా చెప్పగలను. ఈ సినిమా ఖచ్చితంగా సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'చాలా కష్టపడి ఈ సినిమా తీశాం. తెలుగు ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం' అని నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు చెప్పారు.

హీరోలు హరికృష్ణ, రామకృష్ణ మాట్లాడుతూ, 'మా దగ్గర డబ్బు ఉంది కదా అని ఈ సినిమా తీయలేదు. సినిమా మీద మాకు ఉన్న ప్యాషన్‌తో చేశాం. ఈ సినిమా నేను మీకు ఒక స్టెప్పింగ్ లాగే చూపిస్తున్నా, మీ కష్టంతో మీరు పైకి ఎదగాలి అని మా నాన్న మాతో చెప్పారు. ఆయన మా పై పెట్టుకున్న నమ్మకాన్ని, అలాగే మా బ్యానర్ పేరుని కూడా నిలబెడతాం' అని తెలిపారు. ఇలాంటి మంచి సినిమాలో మంచి పాత్రలు పోషించడం చాలా ఆనందంగా ఉందని హీరోయిన్లు రేఖ నిరోషా, యాని చెప్పారు. టి ఎస్ ఆర్ మూవీమేకర్స్ పతాకంపై నిర్మితమవుతున్న ఈచిత్రానికి కథ : నిరూప్‌కుమార్, డి ఓ పి : హరికృష్ణన్, ఎడిటర్ : కుమార్ నిర్మలాసృజన్, సంగీత దర్శకుడు : సురేష్ బొబ్బిలి.

పక్కా కమర్షియల్‌గా జాలరి

శ్రీహరి హీరోగా రాజ్ తాళ్లూరి డైరెక్షన్‌లో మై3 బాక్సాఫీస్ బ్యానర్‌లో రెండవ చిత్రం 'జాలరి' ప్రారంభమైంది. ఐదు భాషల్లో నిర్మించనున్న ఈ చిత్ర పూజా కార్యక్రమం హైదరాబాద్‌లోని అలేఖ్య ఫార్మ్ వుడ్స్ జరిగింది.

పూజ అనంతరం హీరో వెంకట్ క్లాప్ కొట్టగా, డైరెక్టర్ సముద్ర కెమెరా స్విచ్ ఆన్ చేసి, స్క్రిప్ట్ మేకర్స్‌కి ఇచ్చారు. ఈ వేడుకలో నిర్మాతలు ఆదిత్య పల్లా, రఘు కుడితిపూడి, సాయికిరణ్ బత్తుల, రక్తం దశరథ్ గౌడ్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. హీరో శ్రీహరికి ఇది రెండో సినిమా కాగా, డైరెక్టర్ రాజ్ తాళ్లూరికి మూడవ సినిమా. ఇది 80ల బ్యాక్‌డ్రాప్‌లో కమర్షియల్ ఫార్మాట్ సినిమాగా తెరకెక్కనుంది. రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరి మొదటివారం నుంచి ప్రారంభం కాన్నుఈ సినిమా ఖచ్చితంగా అందర్నీ ఆకర్షిస్తుందన్న నమ్మకాన్ని దర్శక, నిర్మాతలు వ్యక్తం చేశారు.

థ్రిల్ చేసే వధువు



అలీ రెజా, నందు

డిస్నీ ప్లస్ హాట్ స్టార్ అందిస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ 'వధువు'. అవికా గోర్, నందు, అలీ రెజా కీలక పాత్రల్లో నటింఆరు. ఎస్వీఎఫ్ బ్యానర్‌లో శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మాణంలో పోలూరు కృష్ణ రూపొందించారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నందు మాట్లాడుతూ, 'సవారీ, బొమ్మ బ్లాక్ బస్టర్ సినిమాల తర్వాత మరో ఇంట్రెస్టింగ్ మూవీ కోసం వెయిట్ చేస్తున్న టైమ్‌లో హాట్ స్టార్ నుంచి ఈ ఆఫర్ వచ్చింది. ఒక ఫ్యామిలీలో మెంబర్స్ ఇంత డిఫరెంట్‌గా ఎలా ఉన్నారు? ఇంత అనుమానస్పదంగా ఎందుకు ఉన్నారు అనేది మీకు ఆసక్తి కలిగిస్తుంది. ఇదే కాదు సీజన్ 2 ఇంకా బిగ్గర్ కాన్వాస్‌లో ఉంటుంది' అని తెలిపారు. 'ఈ సిరీస్‌లో నా క్యారెక్టర్ పర్‌ఫార్మెన్స్ చాలా సెటిల్డ్‌గా ఉంటుంది. ఈ సిరీస్ ష్యూర్ హిట్ అవుతుంది' అని అలీ రెజా చెప్పారు. దర్శకుడు పోలూరు కృష్ణ మాట్లాడుతూ,'బెంగాలీ వెబ్ సిరీస్ 'ఇందు'ను 'వధువు'గా రీమేక్ చేశాం. మన నేటివిటీకి తగినట్లు క్యారెక్టర్స్ డిజైన్ చేసుకున్నాం. చాలా గ్రిప్పింగ్‌గా సిరీస్ ఉంటుంది. సెకండ్ ఎపిసోడ్ నుంచి 7వ ఎపిసోడ్ వరకు అంతే క్యూరియస్‌గా కథ సాగుతుంది. 7వ ఎపిసోడ్ కిక్ ఇచ్చేలా ఉంటుంది. ఈ సిరీస్‌ను మీరు బాగా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాం' అని అన్నారు.

'ఈ వెబ్ సిరీస్‌కు వర్క్ చేసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్‌కి, హాట్ స్టార్‌కు థ్యాంక్స్. ఆర్టిస్టుల పర్‌ఫార్మెన్స్ అదిరిపోతుంది. వాళ్ల పర్‌ఫార్మెన్స్ చూసి నేను ఇన్స్‌పైర్ అయి మ్యూజిక్ చేశాను' అని మ్యూజిక్ డైరెక్టర్ శ్రీరామ్ మద్దూరి చెప్పారు.